

వీక్షణం

ఆర్థిక, సామాజిక మాస పత్రిక


డిసెంబర్ 2005 53 రూ. 10

- ఆంధ్రప్రదేశ్ స్వర్ణోత్సవాలు - విస్మరణ, వివక్ష
- తెలంగాణ రాజకీయోద్యమ గమనంలో ఒడిదుడుకులు
- ప్రభుత్వ కార్యక్రమాలు - అభివృద్ధి
- పోలవరం - ఆదివాసీ గ్రామాల అంతర్ధానం
- వరికి ఉరి వేస్తున్న ప్రభుత్వ విధానం
- కొల్లేరు : తిలాపాపం తలా పిడికెడు
- ముస్లిం రిజర్వేషన్లు





Dr. Y.S. Rajasekhar Reddy
Hon'ble Chief Minister of
Andhra Pradesh.



Sri S. Vijayarama Raju
Hon'ble Minister for
Forests, Environment,
Science & Technology

WORKING TOWARDS HARITANDHRA PRADESH

PERFORMANCE

- Country's first Treatment Storage Disposal Facility (TSDF) commissioned at Dundigal, Rangareddy district with the help of Aus-Aid for effective implementation of Industrial Hazardous Waste Management.
- To manage the Bio-medical waste, eight common waste treatment facility plants have been established.
- Model facilities planned at Tirupathi and Ananthapur to facilitate the management of Municipal Solid Waste.
- Identified Mancherial, Ramagundam, Bhadrachalam and Rajahmundy for construction of STPs under Godavari River Action Plan of NRCP. The STP works at Ramagundam and Bhadrachalam have been completed and the projects at Rajahmundry and Mancherial are under process.
- The CP Cell taken up sector-wise studies and demonstration projects for major small and medium scale polluting units.
- APPCB has developed GIS for the whole state for data management and analysis and is used for Zoning Atlas, Pollution Loads, Siting, Prioritising areas, baseline surveys etc.,
- The Citizen's Charter of the Board promises responding to public grievances within the time limits. In this regard a special cell is created for timely responding public grievances.
- The Board has constituted Environment Educational Wing to inculcate environment awareness among the public by organising interactive meets, seminars, workshops etc. through the mobile exhibitions. 727 programmes have been conducted with the help of Manaratham, Shramika and Nagarika Mobile Exhibition Buses during the year 2004-2005.

TARGETING THE FUTURE

- Common TSDF at Parawada, Vizag is to manage Industrial Hazardous Waste generated from the industries located in North Costal district of Andhra Pradesh is under progress. An incenerator at Dindigal (V), Rangareddy district is being established to treat the organic hazardous wastes.
- Tracking the CFE, CFO applications and complaints received for timely action. Bring new Industries into the ambit of Consent, Hazardous waste, Cess regime.
- Identifying the Municipal Solid dump yards / processing plants for monitoring and encouraging waste to energy projects to manage the Municipal Solid Waste.
- Encouraging the Industries by granting financial and non-financial incentives for implementing waste minimisation and cleaner production techniques.
- Monthly sample collection targets have been fixed for effective monitoring of compliance of common treatment facilities, Industrial estates and pollution levels of lakes.

ANDHRA PRADESH POLLUTION CONTROL BOARD
'Paryavaran Bhavan', A-3, Industrial Estate,
Sanathnagar, Hyderabad-500 018.

LR. No. 00042/APPCB/EEW

సలహా మండలి:
ప్రొ॥ ఆర్.వి.ఆర్.చంద్రశేఖరరావు
ప్రొ॥ వకుళాభరణం రామకృష్ణ
ప్రొ॥ చక్రధరరావు
కాత్యాయని
బి.సాంబశివరాజు

గౌరవ సంపాదకులు:
ఎ.బి.కె. ప్రసాద్
ప్రధాన సంపాదకులు:
వి. హనుమంతరావు
వర్కింగ్ ఎడిటర్:
ఎన్. వేణుగోపాల్

వీక్షణం
ఆర్థిక, సామాజిక పత్రిక
సమీక్షా పబ్లికేషన్స్, సెంటర్ ఫర్ డాక్యుమెంటేషన్, రీసెర్చ్ అండ్ కమ్యూనికేషన్ ప్రచురణ

వార్షిక చందా: రు.120 విడి ప్రతి: రు. 10

53 డిసెంబర్ 2005

సంపాదకీయం

తెరాస వివాదాలు - ప్రజాస్వామ్య స్ఫూర్తి

తెలంగాణ రాష్ట్ర సమితి లోపల సంభవిస్తున్న పరిణామాలు, ఆ పార్టీ పట్ల ఇతర పార్టీలు, ప్రచార సాధనాలు అనుసరిస్తున్న వైఖరి ఆ పార్టీకి మాత్రమే సంబంధించిన అంతరంగిక వ్యవహారాలు కావు. మన సమాజంలో ఒక ముఖ్యమైన సామాజిక, రాజకీయ డిమాండ్‌తో ముందుకు వచ్చిన రాజకీయపక్షంగా తెరాసకు చాల ప్రాధాన్యత ఉంది. అందువల్ల ఆ రాజకీయ పక్షానికి ఇంటా బయటా ఎదురవుతున్న సమస్యల గురించి సమాజమంతా ఆలోచించవలసి ఉంది.

సంస్థ లోపల అసమ్మతి, అంతర్గత ప్రజాస్వామ్యం కోసం తపన, నిర్మాణం లోపల ఒక వైపు నియంతృత్వం మరొక వైపు అరాచకత్వం పెనుగులాడుకునేటప్పుడు ప్రజాస్వామ్యయుతమైన క్రమశిక్షణ కోసం అన్వేషణ - ఇవన్నీ మన సమాజం వంటి భూస్వామ్య విలువలు ప్రధానంగా ఉండే సమాజంలో అన్ని రాజకీయ పక్షాలలోనూ, అన్ని సంస్థలలోను ఉండే సమస్యలే. వీటిని అధిగమించడానికి సంస్థల లోపలే ఓపికతో గూడిన ప్రయత్నం ఎంతో జరగాలి. చాల సంస్థలలో అట్లా జరుగుతున్నది కూడ.

కాని దురదృష్టవశాత్తూ తెరాసలో అటువంటి ప్రయత్నం లోలోపల జరుగుతున్నట్టులేదు. తెరాస అంతర్గత వ్యవహారాలన్నీ బహిరంగంగా, పత్రికలలో, ప్రసార సాధనాలలో జరుగుతున్నాయి. ఇరుపక్షాలూ అవసరమైన దానికన్న ఎక్కువ దురుసుగా అవతలి పక్షం మీద విరుచుకుపడుతున్నాయి. అంతర్గతంగా చర్చ ద్వారా, ఇచ్చి పుచ్చుకోవడం ద్వారా, అవతలి వారి బలాలనూ బలహీనతలను అర్థం చేసుకొని, ఉమ్మడి లక్ష్యం కోసం కలిసిపనిచేయడం ద్వారా కాక ఇప్పటికిప్పుడు తేలిపోవాలన్నట్టుగా ఇరుపక్షాలూ ప్రవర్తిస్తున్నాయి.

ఇటువంటి వైఖరి వల్ల లాభపడుతున్నవి ఇతర రాజకీయ పక్షాలు, వివాదమే ప్రాణంగా బతుకుతున్న ప్రచార సాధనాలు, తెలంగాణ వ్యతిరేక సంస్థలు. ఇప్పుడు తెరాసలో పొడసూపుతున్న విభేదాలకూ, ఘర్షణలకూ మించిన సమస్యలు అన్ని రాజకీయ పక్షాలలోను ఉన్నాయి. కాని ఆ రాజకీయ పక్షాల నాయకులకు ఏ సమస్యను ఎక్కడ ఎంతవరకు చర్చించాలనే విషయంలో విచక్షణ ఉన్నది. తమకు ఉన్నలాంటి విచక్షణ ఈ కొత్త రాజకీయ పక్షానికి లేదు గనుక పాత రాజకీయ పక్షాలు, చాణక్యనీతిని పుణికి పుచ్చుకున్న రాజకీయ పక్షాలు ఈ తమాషాను ఆసక్తిగా చూస్తున్నాయి. ఈ అగ్నికి ఆజ్యం జోడిస్తున్నాయి. తమ ప్రయోజనాల కోసం చిచ్చుపెడుతున్నాయి. దాదాపుగా ప్రచారసాధనాలలో నిర్ణయాధికార స్థానాలలో ఉన్నవారందరిలో ఎంతో కొంత తెలంగాణ వ్యతిరేకత ఉంది గనుక తెరాసలో ఘర్షణలు ప్రచారసాధనాలకు చాల ఆసక్తికరంగా, వినోదదాయకంగా మారిపోయాయి.

ఒక నిజమైన ప్రజా సమస్య పునాదిగా పుట్టుకు వచ్చి, ఎన్నికల రాజకీయాలనే వేదికగా చేసుకున్న రాజకీయ పక్షాన్ని ఇంతగా అవహేళనకు, పరాచకానికి, వేళాకోళానికి వనరుగా మార్చిన వారెవరయినా, అటూ ఇటూ ఏ పక్షాన ఉన్నా, వారి ప్రజాస్వామిక వైఖరి ఎంత అధమ స్థితిలో ఉండి ఉండాలి?!

❑

లోపలి పేజీల్లో...

'వీక్షణం'లో అచ్చవుతున్న రచనలలో వ్యక్తమైన అభిప్రాయాలన్నిటితో సంపాదకులకు ఏకీభావం ఉండనవసరం లేదు. 'వీక్షణం'ను నిజమైన ప్రజాపక్ష సామాజిక, ఆర్థిక విశ్లేషణా వేదికగా తీర్చిదిద్దడంలో అన్ని రకాల అభిప్రాయాలకు, భిన్నాభిప్రాయాల ఛాయలకు స్థానం కల్పించాలని సంపాదక వర్గం భావిస్తోంది.

ఉత్తరాలు:

'వీక్షణం' నవంబర్ సంచికలో శ్రీ ఎన్. వేణుగోపాల్ గారి "ఐదు దశాబ్దాల ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి వెలుగు నీడలు" సమీక్షాపరంగా చాలా విషయాలను తులనాత్మకంగా విశ్లేషించింది. ప్రొఫెసర్ కె ఆర్ చౌదరి గారి "రాష్ట్ర వ్యవసాయ రంగం ఆరోహణ అవరోహణపర్వం" వ్యవసాయరంగంలోని లోటు పాట్లను, ఈ రంగానికి ప్రభుత్వ విధానాలు తగినంత దోహదం చేయటంలేదనే విషయాలను చక్కగా విశదీకరించింది. శ్రీ డి. పాపారావు గారి "ప్రపంచీకరణ చివరిపాదం" చక్కటి ప్రామాణికమైన ప్రస్తుత పరిస్థితులపై అధ్యయనం చేసింది. పోలవరం ప్రాజెక్టుపై మానవ హక్కుల వేదిక కరపత్రంలోని అంశాలు ప్రజలలో ఈ విషయంపై ఏర్పడిన అనేక తికమకలను పోగొట్టే దిశగా సాగాయి.

ఆర్థిక, సామాజిక రంగాలలోని కీలకమైన అంశాలపై విశ్లేషణాత్మకంగా, సమీక్షా పరంగా ప్రజలకు అవగాహన కల్పించే విధంగా ఇలాగే 'వీక్షణం' సంచిక కొనసాగించాలని కోరుతున్నాను.

- డి. సంపత్ కుమార్
హైదరాబాద్

మన 'వీక్షణం' పత్రిక నవంబరు, 2005లో మీరు ప్రచురించిన 'వావిలాల శతజయంతి: నా జీవితమే సందేశం' పేరున వకుళాభరణం రామకృష్ణ గారి వ్యాసం ఎంతో అద్భుతంగా ఉంది. వావిలాల గురించి చాలా గొప్ప విషయాలు తెలుసుకున్నాం. నిరాడంబరానికి, నిస్వార్థానికి ప్రతీక వావిలాల అని తెలుసుకున్నాను. అధ్యాపకుడిగా ఈ సంచికను ఎంతో ఆసక్తిగా చదివాను. మన పత్రికకు మంచి భవిష్యత్తు ఉంది.

- ఎస్ కె బాషా
కోటవురట్ల

వీక్షణం ఆర్థిక, సామాజిక పత్రిక
సమతా పబ్లికేషన్స్
సెంటర్ ఫర్ డాక్యుమెంటేషన్, రీసెర్చ్ అండ్ కమ్యూనికేషన్
స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్,
హైదరాబాద్ - 500 029. ఫోన్ : 040 - 55843495
ప్రింటర్స్ : చరితా ఇంప్రెషన్స్, అజామాబాద్, హైదరాబాద్.

తెలంగాణ రాజకీయోద్యమ గమనంలో ఒడిదుడుకులు

నాగోబా

గత సంవత్సరం మార్చి నెలలో రాష్ట్ర అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో సమైక్యాంధ్రవాదులు చావు దెబ్బతిన్న సంగతి మనందరికి తెల్సిందే. తెలంగాణ ప్రజల ఆకాంక్షని యావత్ భారతదేశం గుర్తించింది. జాతీయ స్థాయిలో తెలంగాణ ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటును సమర్థించే రాజకీయపక్షాల, నాయకుల సంఖ్య పెరిగింది. సంకీర్ణ ప్రభుత్వాల వర్తమాన సందర్భంలో ఏ చిన్న పార్టీకైనా, ఏ చిన్న ప్రాంతీయ ఆకాంక్షనైనా సాకారం చెందించుకోవడానికి అపూర్వ అవకాశాలు లభిస్తున్నాయి. ఈ అవకాశాన్ని వినియోగించుకునే ఐదుగురు సభ్యులను కలిగి ఉన్న చిన్న రాజకీయ పక్షమైన టి.ఆర్.ఎస్. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అంశాన్ని యు.పి.ఏ ప్రభుత్వ ఎజెండాలో ఒక అంశంగా చేర్పించ గలిగింది. పార్లమెంటు మొట్టమొదటి ఉమ్మడి సమావేశంలో రాష్ట్రపతి ద్వారా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు యుపిఏ ప్రభుత్వం కట్టుబడి ఉన్నట్లు ప్రకటింపజేయగలిగింది. ఆ తర్వాత ప్రధాని మన్మోహన్‌సింగ్ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు అనుకూలంగా స్పందించడం, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకోసం పార్లమెంటులోని అన్ని రాజకీయ పక్షాల మధ్య ఏకాభిప్రాయ సాధనకోసం ప్రణబ్‌ముఖర్జీ నాయకత్వంలో త్రిసభ్యకమిటీని ఏర్పాటు చేయటం కేంద్రంలో తెలంగాణ ఏర్పాటుకు రాజకీయ ప్రక్రియ ఊపందుకున్నట్లుగా ప్రజలకు సంకేతాలు అందాయి. ఇదంతా జరిగి దాదాపు 15 నెలలు కావస్తున్నది. ప్రణబ్‌ముఖర్జీ కమిటీ తన పనిలో భాగంగా పార్లమెంటులోని రాజకీయపక్షాలకు లేఖలు రాసి చేతులు దులుపుకున్నది. బిజెపి మినహా అన్ని రాజకీయ పక్షాలు తమ అభిప్రాయాలు తెలియజేసినప్పటికీ ప్రణబ్ కమిటీ నివేదిక రూపొందించడంలో తాత్సారం చేస్తున్నది. తెలంగాణ ప్రజల్లో నిరాశా నిస్పృహలు కమ్ముకుంటున్నవి. ఈ 15 నెలల వ్యవధిలో తెలంగాణ రాజకీయ ఉద్యమం నిర్వీర్యం అయి పోయింది. రాష్ట్ర ప్రభుత్వంలో చేరిపోయిన టి.ఆర్.ఎస్. ప్రజలు తమమీద పెట్టిన భాద్యతని విస్మరించింది. అంతవరకు తనకు పనికి వచ్చిన ఆయుధాలు - 610 జీవో, పులిచింతల, కృష్ణా గోదావరి జలాల్లో నీటి వాటా మొదలైనవి అటకెక్కినాయి. టిఆర్‌ఎస్‌లో నెలకొన్న స్తబ్దతని, నిర్వీర్యతని ప్రజలు తీవ్రంగా నిరసించడంతో ఒత్తిడికి లోనై రాష్ట్ర ప్రభుత్వం నుండి బయటపడి రాష్ట్రంలో కాంగ్రెస్‌తో తెగతెంపులు చేసుకున్నది. ఒంటరిగానే మున్సిపల్ ఎన్నికలను ఎదుర్కొన్నది. ఓటమి పాలయింది. ఇదే అదునుగా కాంగ్రెస్ టిఆర్‌ఎస్‌ను చీల్చేందుకు వేసిన ఎత్తుగడలు_ఫలించి మొదట సంతోష్‌రెడ్డి, ఆ తర్వాత వరంగల్ జిల్లాకు చెందిన నలుగురు ఎమ్మెల్యేలు చంద్రశేఖరరావు వ్యవహారశైలిని విమర్శిస్తూ బహిరంగ ప్రకటనలు చేశారు. టిఆర్‌ఎస్‌లో తలెత్తిన సంక్షోభం టిఆర్‌ఎస్‌నే కాదు తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నీరుగార్చే విధంగా ఉంటున్నాయని ప్రజలు భావిస్తున్నారు. ఇటువంటి సందర్భంలో అటు కేంద్రంలోనూ, ఇటు రాష్ట్రంలోనూ జరుగుతున్న పరిణామాలను, మొత్తంగా తెలంగాణ ఉద్యమ గమనాన్ని సమీక్షించుకోవాల్సిన అవసరం ఉంది.

ఎన్నికల అనంతరం విశ్లేషణలు :

ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు స్పష్టంగా సమైక్యాంధ్ర వాదాన్ని చిత్తుగా ఓడించారు. తెలంగాణ శక్తుల ఏకీకరణ ఫలితంగా తెలంగాణ ఆకాంక్ష ప్రబలంగా వ్యక్తమైంది. కోస్తాంధ్ర మేధావులు, పత్రికలు మాత్రం ఫలితాలను విశ్లేషిస్తూ ఇవి గత ప్రభుత్వ విధానాల పట్ల అసమ్మతి మాత్రమేనని, ప్రభుత్వ వ్యతిరేకత తప్ప ఎన్నికల్లో తెలంగాణ ఆకాంక్ష లేదని గోబెల్స్ ప్రచారం సాగించినాయి. అయితే సమైక్యవాదులు తెలంగాణలో గెల్చుకున్న సీట్లను పరిగణనలోకి తీసుకుంటే ఘనవిజయం తెలంగాణవాదులదే అని తేలుతుంది. కాంగ్రెస్ ప్రత్యేక రాష్ట్రాన్ని వాగ్దానం చేసి ప్రజల ముందుకు వెళ్లింది. తెలంగాణలోని 107 సీట్లలో సమైక్యవాదులకు దక్కినవి 12 మాత్రమే. కాంగ్రెస్, టిఆర్‌ఎస్‌ల పొత్తుని రెండు పార్టీల ఎన్నికల పొత్తుగా మాత్రమే అనుకునేవాళ్లు ఫలితాల్లో తెలంగాణ ప్రజల ఆకాంక్షని చూడలేరు. కాంగ్రెస్, టిఆర్‌ఎస్‌ల పొత్తు తెలంగాణ శక్తుల ఏకీకరణకు దోహదం చేసింది. ప్రభుత్వ వ్యతిరేకత ఉన్నప్పటికీ సమైక్యరాష్ట్రవాదాన్ని నెత్తికెత్తుకున్న తెలుగుదేశం ఓటమికి తెలంగాణ శక్తుల ఏకీకరణ కీలకమైన అంశంగా పనిచేసింది. ఈ విషయాన్ని దేశం యావత్తూ గుర్తించినప్పటికీ ఇక్కడి సమైక్యవాదులు మాత్రం అంగీకరించరు.

కోస్తా రియల్ ఎస్టేట్ వ్యాపారుల దాడి :

ఒకవైపు పత్రికల్లో తెలంగాణ వ్యతిరేక విశ్లేషణల పర్వం కొనసాగుతుండగానే మరోవైపు హైదరాబాదులో కోస్తా రియల్ ఎస్టేట్ వ్యాపారులు రియల్ ఎస్టేట్ వ్యాపారం కుప్పగూలటానికి తెలంగాణ ఉద్యమమే కారణమని చెప్తూ విష ప్రచారం మొదలు పెట్టినారు. ఇటీవలి మున్సిపల్ ఎన్నికల్లో టిఆర్‌ఎస్ వైఫల్యం తర్వాత కూడా తెలంగాణ ఆకాంక్ష కనుమరుగైందన్న ప్రచారంలో వీళ్లే ముందున్నారు. అమ్మకాలు, కొనుగోళ్లు దారుణంగా పడి పోయినాయని, రిజిస్ట్రేషన్లు 40% వరకు తగ్గిపోయినాయని పత్రికలు, టీవీ మీడియా కోడై కూయడం ప్రారంభించినాయి. నిజానికి రియల్ ఎస్టేట్ వ్యాపారంలో సంక్షోభానికి గత చంద్రబాబు ప్రభుత్వం అనుసరించిన విధానాలే కారణంగాని తెలంగాణ ఉద్యమం కాదు. చంద్రబాబు పల్లెల్ని ఎండగట్టి, పరిశ్రమల్ని

మూసివేసి అంతర్జాతీయ పెట్టుబడులను నగరానికి ఆకర్షించే పేరుమీద హైటెక్ సిటీని, అంతర్జాతీయ విమానాశ్రయాన్ని, సాఫ్ట్‌వేర్, బయోటెక్ పార్కులను, ఎక్స్‌ప్రెస్ హైవేలు, ఔటర్ రింగ్‌రోడ్, మల్టీమోడల్ రైల్వే లైన్లు మొదలైనవి ఏర్పాటు చేయడానికి పెద్దఎత్తున కేటాయింపులు చేసింది. వీటిని చూపించే రియల్ ఎస్టేట్ వ్యాపారులు తమ వ్యాపారాన్ని గణనీయంగా పెంచుకున్నారు. కృత్రిమంగా అభివృద్ధి చెందిన రియల్ ఎస్టేట్ ధరల వల్ల అధికంగా లాభాలను వశం చేసుకున్నది కోస్తా సంపన్న వర్గాలే. కోస్తా పాలకవర్గంతో ఉన్న సంబంధాలను ఆసరా చేసుకొని చంద్రబాబు మెగా ప్రాజెక్టులు ప్రకటించక ముందుగానే వాటి వివరాలను తెల్సుకొని వాటి చుట్టుపక్కల భూములని అగ్గువకు కొనుగోలు చేసి, విపరీతంగా లాభాలు గడించి కోట్లకు పడగలెత్తినారు. ఎన్నికల్లో చంద్రబాబు అనుసరించిన ఈ అభివృద్ధి నమూనాని ప్రజలు తిరస్కరించారు. ఆ కారణంగా రియల్ ఎస్టేట్ ధరలు కుప్పగూలక తప్పలేదు. ఇది రియల్ ఎస్టేట్ వ్యాపారంలో ఇమిడి ఉన్న అంతరంగిక సంక్షోభ ఫలితమే తప్ప తెలంగాణ ఉద్యమానికి ఏ సంబంధమ్మూ లేదు. కొత్తగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం కూడా చంద్రబాబు విధానాలను విడనాడలేదు. మున్సిపల్ ఎన్నికల్లో టిఆర్ఎస్ ఓటమితో తిరిగి కృత్రిమంగా ధరలను పెంచేసారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు కుట్రపూరిత వ్యవహారానికి, అందులో వస్తున్న ఒడిదుడుకులకు తెలంగాణ ఉద్యమానికి లంకె పెడ్తూ ప్రచారాన్ని సాగిస్తున్నారు. ఈ ప్రచారానికి పత్రికలు, టీవీ మీడియా వారికి సహకరిస్తూనే ఉన్నాయి.

కోస్తా నేతల మానసిక పుత్రిక రాయలసీమ ఉద్యమం :

తెలంగాణ ఉద్యమంపై ముప్పేట దాడిలో భాగంగానే రాయలసీమ ఉద్యమాన్ని ఎగదోసారు. రాయలసీమ ఉద్యమ కారుల (?) వాదనలు, డిమాండ్లు గనుక పరిశీలించినట్లయితే వారి అసలు ఉద్దేశ్యాలు బయటపడ్తాయి. తెలంగాణ విడిపోతే మేమూ విడిపోతాం, లేకుంటే సమైక్య రాష్ట్రంలోనే కొనసాగుతాం అంటూ రాయలసీమ నేతలు చేసిన ప్రకటనల్లో వారి ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షకన్నా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావాన్ని అడ్డుకోవడమే లక్ష్యంగా కన్పిస్తుంది. ప్రత్యేక రాయలసీమ ఆ ప్రాంత ప్రజల ఆకాంక్షనే అయ్యుంటే ఇక తెలంగాణ విడిపోవడానికి, కల్సి ఉండడానికి ఏమిటీ సంబంధం? ఏ ప్రజాస్వామిక ఆకాంక్ష అయినా అది తమ హక్కులను ఆకాంక్షలను వ్యక్తీకరించాలేగానీ ఇతరుల హక్కులకు, ఆకాంక్షలకు విఘాతం కలిగించకూడదు. వారి ప్రకటనలు కొన్ని తెలంగాణ ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షలను హరించే పద్ధతిలోనే సాగాయి.

ఒకే భాష మాట్లాడే ప్రజలకు ఒకటి కన్నా ఎక్కువ రాష్ట్రాలు మన దేశంలో ఉన్నాయి. అంతర్జాతీయంగా చూసినప్పుడు ఒకే భాష మాట్లాడే ప్రజలకు రెండు మూడు దేశాలే ఉన్నట్లు తెలుతున్నది. మనదేశంలో హిందీ భాషా రాష్ట్రాలు ఎనిమిది, తమిళ భాషా ప్రాంతాలు రెండు (తమిళనాడు, పాండిచ్చేరి) ఉండడం మనం ఎరిగినవే. అంతర్జాతీయంగా చూసినప్పుడు జర్మన్ భాష మాట్లాడే ప్రజలకు రెండు (జర్మనీ, ఆస్ట్రియా), చైనీయులకు మూడు (చైనా, తైవాన్, హాంకాంగ్), ఇంగ్లీషు వాళ్లకు మూడు (ఇంగ్లాండ్, ఐర్లండ్, స్కాట్‌లాండ్) దేశాలు ఉన్నాయి. ఇట్లా ఎన్నయినా ఉదాహరణలను మనం పేర్కొనవచ్చు. దీన్ని విశ్లేషించుకున్నపుడు భాషా సారూప్యతలు మాత్రమే రాష్ట్రాల ఏర్పాటుకు, జాతుల రాజ్యాల ఏర్పాటుకు ప్రాతిపదిక కాదు. సాంస్కృతిక వైవిధ్యమే ప్రధాన పాత్ర పోషిస్తుంది. ఈ సాంస్కృతిక వైవిధ్యమే జాతుల అస్తిత్వానికి పునాదిగా నిలుస్తుంది. 1956లో జరిగిన రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ లేదా ఏకీకరణ ఆయా ప్రాంతాల ప్రజల సామాజిక, సాంస్కృతిక వైవిధ్యాలను పట్టించుకోనేలేదు. భాషాపరమైన సారూప్యతలు కలిగి ఉన్నప్పటికీ దేశంలో సాంస్కృతిక భిన్నత్వం కల్గిన ప్రాంతాలు 56 ఉన్నట్లు ఆనాటి ఒక అధ్యయనంలో తేలింది. తెలంగాణ, రాయలసీమ, కోస్తా ఆంధ్ర ప్రాంతాలు భిన్నమైన సాంస్కృతిక వైవిధ్యం కల్గిన ప్రాంతాలుగా ఆ అధ్యయనం గుర్తించింది. ఈ సామాజిక సాంస్కృతిక వైవిధ్యాన్ని పట్టించుకోకుండా భాషాపరమైన సారూప్యతల కారణంగా రాష్ట్రాలను ఏర్పాటు చేయడం మన తెలంగాణ, విదర్భ, ఛత్తీస్‌గఢ్, ఝూర్ఖండ్ మొదలైన ప్రాంతాలలో అసంతృప్తులు ప్రబలి ప్రత్యేక రాష్ట్ర డిమాండ్లు ముందుకు వచ్చాయి. రాయలసీమ వాసులకు ప్రత్యేక రాష్ట్రమే ఒక డిమాండుగా ముందుకు వచ్చినపుడు తెలంగాణ ప్రజలు సహృదయంతో మద్దతు పలుకుతారు. కాని రాయలసీమ నేతల నుంచి సంఘీభావానికి బదులు విఘాతం కల్గించే ప్రకటనలు రావడం ఎవరి కుట్రల ఫలితమో తెలంగాణ ప్రజలకు తెలుసు.

కొనసాగుతున్న తెలంగాణ వ్యతిరేక ప్రచారం :

అసెంబ్లీ ఎన్నికల అనంతరం ప్రారంభమైన తెలంగాణ వ్యతిరేక ప్రచారం ఇంకా కొనసాగుతూనే ఉంది. ముఖ్యంగా మున్సిపల్ ఎన్నికల్లో టిఆర్ఎస్ వైఫల్యం తర్వాత అది ఒక దాడిగా రూపం మార్చుకుంది. ఈ దాడిలో ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నాయకుడు, సీనియర్ రాజకీయనాయకులు, సీనియర్ పాత్రికేయులు, విశ్వవిద్యాలయ ఆచార్యులు పాల్గొని తమవంతు బాధ్యతను నిర్వర్తించారు. 2004 అక్టోబరులో విశాఖలో జరిగిన కోస్తానేతల రౌండ్ టేబుల్ సమావేశంలో 1) షరతులు లేని సమైక్యాంధ్రని 2) 610 జీవో రద్దుని 3) ఆరుసూత్రాల పథకం రద్దుని డిమాండు చేశారు. సమైక్యాంధ్ర రాష్ట్రం బేషరుతుగా ఏర్పడింది కాదు. పెద్దమనుషుల ఒప్పందంలోని షరతులే సమైక్యాంధ్ర రాష్ట్రానికి ప్రాతిపదికలు. వారి డిమాండ్లు విశాలాంధ్ర భావన వెనుక ఉన్న అసలు లక్ష్యాలని వెల్లడించాయి. ఈ డిమాండ్లు వారి వలసవాద భావజాలానికి, సామ్రాజ్యవాద తత్వానికి నిదర్శనంగా నిలుస్తాయి.

ఈ దాడిలో భాగంగానే ముఖ్యమంత్రి - ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాల వలన తెలంగాణ ఆకాంక్ష కనుమరుగై పోయిందని, కలసి ఉంటే కలదు సుఖమని

ప్రకటించాడు. దానికి వంత పాడుతూ ఇప్పుడు తెలంగాణ రాష్ట్రం ఏర్పరచే పరిస్థితులు లేవని, అవును నిజం అంటున్నారు ప్రతిపక్షనాయకుడు చంద్రబాబు. ఇదే రకమైన అభివృద్ధివాదాన్ని సమర్థిస్తూ ప్రకటనలు చేస్తున్నారు వామపక్షనేతలు. ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షను అభివృద్ధి సమస్యగా కుదించి వేసి ఆకాంక్షని పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారు. ఒకవైపు అభివృద్ధి, సాగునీటి పథకాలు అని వల్లిస్తున్న ప్రభుత్వమే మరోవైపు తెలంగాణ జలవనరుల దోపిడీకి పథకాలు రూపొందిస్తున్నది. పులిచింతల, పోలవరం, పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ సామర్థ్యం పెంపు మొదలైనవి జలదోపిడీకి ప్రాతిపదికలయినాయి. ప్రభుత్వం చెబుతున్నది ఒకటి, ఆచరిస్తున్నది మరొకటి. ఈ వైరుధ్యాన్ని తెలంగాణ ప్రజలు గమనిస్తూనే ఉన్నారు.

తెలంగాణ ఉద్యమ గమనం :

ఎన్నికల అనంతరం గడిచిన 15 నెలల్లో తెలంగాణ రాష్ట్ర సాధన కోసమే ఏర్పాటై తమది ఉద్యమపార్టీ అని చెప్పుకున్న టిఆర్ఎస్ ప్రభుత్వంలో చేరి తన ఉద్యమ లక్ష్యాలకు దూరమైంది. స్తబ్దత నెలకొంది. తెలంగాణ వ్యతిరేకశక్తుల కుట్రలను, వ్యతిరేక ప్రచారాన్ని, ప్రభుత్వ తెలంగాణ వ్యతిరేక విధానాలను ఎదిరించడంలో, ప్రతిఘటించడంలో ఒక్క టిఆర్ఎస్సే కాదు తెలంగాణ రాజకీయవర్గాలు పూర్తిగా విఫలం అయ్యాయి. మంత్రి పదవులకు ఆశపడి టిఆర్ఎస్ మౌనం పాటిస్తోంది. ప్రభుత్వంలో చేరిపోయి తన నోటికి తానే తాళం వేసుకొని ఢిల్లీలో లాబీయింగ్ పేరుతో పార్టీని, ప్రజలను ఉద్యమానికి దూరం చేసింది టిఆర్ఎస్ నాయకత్వం. కేవలం లాబీయింగ్ అండ్ అడ్వొకసీ మాత్రమే తెలంగాణని సాధించి పెడ్తుందని, ప్రజల ఉద్యమం లేకుండా, ఉద్యమం కల్గించే ఒత్తిడి లేకుండా తెలంగాణ ఉనికిలో వస్తుందని టిఆర్ఎస్ బయట ఉన్న తెలంగాణవాదులెవ్వరూ నమ్మలేదు. 15 నెలల అనుభవం ద్వారా లాబీయింగ్ అండ్ అడ్వొకసీ ఒక్కటీ తెలంగాణని ఇవ్వలేదనే సత్యాన్ని టిఆర్ఎస్ అధినాయకత్వం గుర్తించక పోతే తాము ఇన్నాళ్లు అవలంబిస్తున్న వ్యూహాత్మక తప్పిదాన్ని ఇంకా కొనసాగించిన వాళ్లవుతారు.

తెలంగాణ ఉద్యమాన్ని బలంగా నిర్మాణం చెయ్యకుండా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో ప్రజల నిర్మాణాత్మక పాత్రని విస్మరించడం టిఆర్ఎస్ వ్యూహాత్మక తప్పిదమన్న భావన తెలంగాణ వాదుల్లో బలపడింది. కేంద్రంలో సోనియాగాంధి దయాదాక్షిణ్యాలకి తెలంగాణని వదిలేయడం సమంజసమా అన్న ప్రశ్న తలెత్తింది. సోనియాగాంధీ తెలంగాణ అనుకూల నిర్ణయం తీసుకునేందుకైనా ఉద్యమం ఒత్తిడి అవసరంకాదా? దీపం వెలగాలంటే నూనె అవసరమే కాని దీపం వెలుగుతూ ఉంటేగానీ నూనె కరగదు. తెలంగాణ ఉద్యమ దీపం వెలుగుతుంటేనే నిర్ణయాధికారం కల్గిన సోనియా గాంధీ అయినా, మన్మోహన్‌సింగ్ అయినా, ప్రణబ్‌ముఖర్జీ అయినా కరుగుతారు.

15 నెలలుగా టిఆర్ఎస్ తీకుసున్న ఉద్యమ కార్య క్రమాలు ఏమీ దాదాపు లేవు. తనూ పాలకపక్షమే గనుక అసెంబ్లీలో గాని, బయటగాని నిలదీసి ప్రశ్నించే నైతిక హక్కుని కోల్పోయింది. తమ వదునైన అస్త్రాలు 610 జీవో, గిర్‌గ్లానీ కమీషన్ రిపోర్టు, కృష్ణాగోదావరి జలాల్లో నీటివాటా మొదలైనవి అటకెక్కినాయి. ఉద్యోగాల్లో ఆరుసూత్రాల పథకం ఉల్లంఘనలకు గురి అవుతూనే ఉన్నది. గత అసెంబ్లీలో ఒక్క ఎమ్మెల్యే పులిచింతల నిర్మాణాన్ని అడ్డుకున్నారు. ఇప్పుడు 26 మంది ఎమ్మెల్యేలు పులిచింతలనే కాదు గోదావరి నీళ్లని కోస్తాకు, కృష్ణానీళ్లని రాయలసీమకు తరలించే దోపిడీ పథకాల నిర్మాణాన్ని అడ్డుకోలేక పో తున్నారు. తెలంగాణ నేతల ప్రతిఘటన ఎక్కడా కనిపించదు.

బహుశా ఇంకా కొన్ని నెలల్లో తెలంగాణ రాష్ట్రమే ఏర్పడ బోతున్నపుడు తక్షణ సమస్యలపై స్పందించడం, ఉద్యమించడం ఎందుకు అన్న మీమాంస వారి మదిలో ఉండి ఉండవచ్చు. కాని ప్రత్యేక రాష్ట్రం కోసం చేసే కృషి, తెలంగాణ ఏర్పడేలోపు వచ్చే తక్షణ సమస్యలను ప్రతిఘటిస్తూ ఉద్యమించడం వేరువేరుకాదు. అవి పరస్పర ప్రేరితాలు. సమస్యలపై ఉద్యమించినందువల్ల ప్రత్యేక రాష్ట్రం కోసం చేస్తున్న కృషికి బలం పెరుగుతుంది. ప్రత్యేక రాష్ట్రం కోసం చేసే ఉద్యమం తక్షణ సమస్యలను ప్రతిఘటించడంలో లేదా అవి తలెత్తకుండా చేయడానికి దోహదపడ్తుంది. ఈలాంటి సమన్వయాన్ని సాధించడంలో టిఆర్ఎస్ వైఫల్యం చెందింది. అందుకు తెలంగాణ సాధన కోసం వారు ఎంచుకున్న వ్యూహంలో లోపమే కారణం.

ఈ వ్యూహాత్మక తప్పిదం వల్లనే ప్రజలకు, పార్టీకి లింకు తెగిపోయింది. పార్టీ ప్రజలకు దూరమైంది. పట్టణ ప్రజలు తమ ఆగ్రహాన్ని అసంతృప్తిని టిఆర్ఎస్ పై వెళ్లగక్కారు. మున్సిపల్ ఎన్నికల్లో టిఆర్ఎస్ ఓటమి అది పార్టీ ఓటమే తప్ప తెలంగాణ ఆకాంక్ష ఓటమి కాదు.

టిఆర్ఎస్‌లో ప్రస్తుత సంక్షోభం :

టిఆర్ఎస్‌లో అసమ్మతి ఎమ్మెల్యేల తిరుగుబాటుకు 15 నెలల ఉద్యమ వైఫల్యమే నేపథ్యంగా ఉందన్న విషయాన్ని టిఆర్ఎస్ అధినాయకత్వం అంగీకరించక తప్పదు. అసమ్మతి ఎమ్మెల్యేలు సంధించిన ప్రశ్నలన్నీ గూడా టిఆర్ఎస్ ఉద్యమ వైఫల్యాల్లోంచి తలెత్తినవన్నది వాస్తవమే అయినప్పటికీ ఆ సంక్షోభం తీసుకున్న రూపం మాత్రం పూర్తిగా ఉద్యమం కోసం అన్నది ఇప్పుడుభ్రమగానే మిగిలిపోతున్నది. ప్రశ్నలు సంధించిన సమయం, పద్ధతి మాత్రం అసమంజసంగానే ప్రజలకు తోస్తున్నవి. పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం లోపించడం, నాయకత్వపు నియంతృత్వ పోకడలు, కుటుంబ ఆధిపత్యం ఇవేవి ఇవాళ పార్టీలో తలెత్తినవి కావు. భారతదేశ రాజకీయ వ్యవస్థలో నెలకొని ఉన్న అన్ని రకాల అపసవ్య ధోరణులు టిఆర్ఎస్ లోనూ మొదటినుంచి ఉన్నవే.

(మిగతాది 39వ పేజీలో)

వరికి ఉరి వేస్తున్న ప్రభుత్వ విధానం

ఎం. కోదండరాం
కె. సీతారామారావు

బావుల కింద రెండో పంటగా వరి వేయరాదన్న ప్రభుత్వ ఉత్తర్వులపై సాగుతున్న చర్చ అసమగ్రంగానే ఉన్నది. ప్రభుత్వ మేమో భూగర్భ జలాల పరిరక్షణ కొరకే ఉత్తర్వులను జారీ చేస్తున్నట్టుగా ప్రకటించింది. కానీ ప్రతి పక్షాలన్నీ దాన్ని ఉచిత కరెంటుపై ఆంక్షగా, ప్రపంచ బ్యాంకు నిబంధనల అమలుగా చూపి విమర్శిస్తున్నాయి. అందువల్లనే చర్చ సమగ్రంగా, వాస్తవాల ఆధారంగా సాగడం లేదు.

చర్చలోకి పోయే ముందు మూడు విషయాలను దృష్టిలో పెట్టుకోవాలి. వరి మన రాష్ట్రంలో ప్రధానమైన ఆహార పంట. కొన్ని ప్రాంతాల్లో మినహాయిస్తే రాష్ట్రమంతటా వరి ధాన్యాన్ని ప్రధాన ఆహారంగా తీసుకుంటున్నారు. ఎన్టీరామారావు రెండు రూపాయలకు కిలో బియ్యం పథకం ప్రవేశపెట్టక ముందు జొన్న, మక్కజొన్న, రాగులు, సజ్జలు వంటి ధాన్యాన్ని కూడా చాలా ప్రాంతాల్లో ప్రజలు తినేవారు. కానీ ఆ తరువాత ఆహారపు అలవాట్లు మారిపోయాయి. రెండవ విషయమేమిటంటే వరి రిస్కులేని పంట. 'రొంపి రొక్కం' అని వరి సాగు గురించి ఎప్పటినుండో సామెత ఉన్నది. హరిత విప్లవం తరువాత వరి దిగుబడి బాగా పెరిగింది. సాగు పద్ధతులు మెరుగయ్యాయి. కనుక వరి సాగులో ఖర్చు తక్కువ, రిస్కు కూడా తక్కువే. ఇతర వాణిజ్య పంటల విషయంలో సాగునీటి వసతి లేని చెలుక (ఖుష్కీ) భూముల్లో పండే పంటల విషయాలలో ఇటువంటి దిగుబడిని పెంచే, సాగు పద్ధతులు మెరుగుపరిచే ప్రయోగాలు, పరిశోధనలు జరుగలేదు. మిర్చి, పొగాకు, పత్తి పంటల్లో ఆదాయం ఎక్కువ. కానీ అవి భరోసాలేని పంటలు, పెట్టుబడి ఎక్కువ. ఆదాయం వస్తుందన్న నమ్మకం తక్కువ. రైతును తీవ్రంగా నష్టాల పాలు చేసే అవకాశాలు కూడా ఎక్కువే. ఇక మూడవ విషయమేమిటంటే వరి సాగు నుండి వేరొక పంటకు మారడం అంత సులభ సాధ్యం కాదు. వరి సాగు చేపట్టే ముందు భూమిని అచ్చుకట్టి భూసారాన్ని పెంచడానికి చర్యలు తీసుకుంటారు. అందుకే "ఒక తరం మునిగితే తరి పొలం తేలు తుందన్న" సామెత తెలంగాణలో వాడుకలో ఉంది. అటువంటిది ఎంతో కష్టపడి తయారుచేసుకొన్న తరి పొలాన్ని వెంటనే వేరే పంటలకు మార్చుకొమ్మని శాసించడమంటే నోటికాడికొచ్చిన కూడును ఎత్తగొట్టడం కాక మరేమవుతుంది? తుగ్లక్ ఢిల్లీ నుండి రాజధానిని దౌలతాబాద్‌కు మార్చినట్టు ఉంటుంది.

ఇక అసలు విషయానికి వస్తే ఇంత కీలకమైన వరి సాగు విషయంలో ఇప్పటికే రాష్ట్రంలో స్పష్టంగా గుర్తించతగ్గ అసమానత లున్నాయి. 1998 సంవత్సరంలో మొత్తం వరి ఉత్పత్తిలో ఆయా ప్రాంతాల వాటా ఇలా ఉన్నది.

	ఉత్తర కోస్తా	దక్షిణ కోస్తా	రాయల సీమ	దక్షిణ తెలంగాణ	ఉత్తర తెలంగాణ
వరి ఉత్పత్తి లో ఆయా ప్రాంతాల వాటా	7.2%	53.2%	8%	12.7%	18.91%

ఆయా ప్రాంతాల్లోని మొత్తం సాగుభూమిలో వరిసాగు కింద ఉన్న భూ విస్తీర్ణంలోనూ ఈ తేడాలను గమనించవచ్చు. ఉదాహరణకు 1998 గణాంకాల ప్రకారం దక్షిణ కోస్తాలోని మొత్తం సాగుభూమిలో 49 శాతం భూమి వరిసాగు కింద ఉన్నది. అదే సంవత్సరానికి తెలంగాణలోని మొత్తం సాగుభూమిలో 27 శాతం, రాయలసీమలో మొత్తం సాగుభూమిలో 11 శాతం భూమిలో వరి సాగవుతున్నది.

ఒక హెక్టారుకు వచ్చే దిగుబడిలోనూ వ్యత్యాసాలున్నాయి. తెలంగాణలో ఒక హెక్టారుకు 2500 కిలోల దిగుబడి వస్తుండగా దక్షిణ కోస్తాలో ఒక హెక్టారు దిగుబడి 3400 కిలోలు.

సాగునీటి వసతిలో కల వ్యత్యాసాల వల్లనే ఈ తేడాలు తలెత్తాయని గమనించాలి. మన రాష్ట్రంలో 2004-05 సంవత్సరంలో కాలువల కింద నికరంగా 13.46 లక్షల హెక్టార్లు సాగైంది. అయితే ఈ మొత్తంలో అగ్రభాగం నాలుగు జిల్లాల్లోనే ఉన్నది. కృష్ణా, గుంటూరు, ఉభయ గోదావరి జిల్లాల్లో 8.34 లక్షల హెక్టార్లు. ఇందులోనూ సగభాగం శ్రీకాకుళం, విజయనగరం, నెల్లూరు జిల్లాలకే పరిమితమైంది. కాలువల కింద తెలంగాణలో 1.16 లక్షల హెక్టార్లు. చెరువుల కింద 1.26 లక్షల హెక్టార్లు సాగులో ఉన్నది. 2004-05 సంవత్సరానికి బోర్ల కింద 12.54 లక్షల హెక్టార్లు, తవ్వకం బావుల కింద 6.49 లక్షల హెక్టార్లు సాగులో ఉన్నది. ఇందులో అగ్రభాగం తెలంగాణలోనే ఉన్నది.

తెలంగాణలో బోర్ల కింద 5.35 లక్షల హెక్టార్లు తవ్వకం బావుల కింద 4.6 లక్షల హెక్టార్లు సాగునీటిని పొందుతున్నాయి. తెలంగాణలో సాగునీటి సౌకర్యం కల 12.80 లక్షల హెక్టార్లలో సుమారు 10 లక్షల హెక్టార్ల భూమి బావుల పారకమే. రాయలసీమలోనూ మొత్తం 5.36 లక్షల హెక్టార్లకు సాగునీటి సౌకర్యం ఉండగా అందులో 3.76 లక్షల హెక్టార్ల బావుల నుండి సాగునీటిని పొందుతున్నాయి.

ఈ బావుల కింద సాగు నీరు ఉంటే వరి సాగు చేసు కుంటున్నారు. భారత ప్రభుత్వం జాతీయ సాంపిల్ సర్వే విభాగం వారిచేత జరిపించిన ఒక సర్వే ప్రకారం రైతులు ప్రధానంగా ఆహార పంటలను పండించడానికి ఇష్టపడతారని తేలింది. కానీ బావులున్న రైతులు నీళ్ళుంటేనే వరిసాగు చేస్తున్నారు. లేక లేక ఎన్నో సంవత్సరాల తరువాత సంతోషపడదగిన రీతిలో నీళ్ళు వచ్చినాయి. భూగర్భ జలాల మట్టం పెరిగింది, బావుల్లో పుష్కలంగా నీళ్ళున్నాయి. ఇంజన్లు పెట్టికొట్టినా ఒడవని నీళ్ళు బావుల్లో, బోర్లలో ఉన్నాయి. ఇప్పుడు రైతులకు కావలసింది నీళ్ళు తోడటాని కవసరమయిన కరెంటు. కాని ప్రభుత్వం వరిసాగుపై ఆంక్షలు పెడుతున్నదంటే పరోక్షంగా కరెంటు వాడకంపై ఆంక్షలు పెడుతున్నట్టేగా. మన రాష్ట్రంలో 2004-05 లెక్కల ప్రకారం కాలువల కింద, చెరువుల కింద ఉన్న దాదాపు మొత్తం భూమిలో వరి సాగవుతుండగా బావుల కింద, బోర్ల కింద ఉన్న సాగుభూమిలో ప్రతి మూడు ఎకరాలలో ఒక ఎకరమే (అంటే 1/3 భూమి) వరి పంట వేస్తున్నారు. దీనికి కారణం నీటి కొరత. ఈ మాత్రం కూడా పంట వేసుకొనే అవకాశం రాని సంవత్సరాల్లో తినడానికి తిండి లేక రైతు కుటుంబాలు ఆకలి చావులకు లోనయ్యాయి.

అసలు రబీలో రాష్ట్రంలో 8.71 లక్షల హెక్టార్లలో వరి సాగవుతుండగా అందులో తెలంగాణలో 2.76 లక్షల హెక్టార్లు, రాయలసీమలో 0.53 లక్షల హెక్టార్లు ఉన్నది. ఇందులో కాలువుల, చెరువుల కింద సాగయ్యేది పోను బావుల కింద సాగయ్యేది తక్కువే ఉంటది. రైతులు హేతుబద్ధంగా ఆలోచించి నీరు ఉంటేనే పంటలు వేసుకుంటున్నారు. బావుల్లో నీళ్ళు ఉండే అంశాన్ని అంచనా వేసుకొని ఏ పంట వేయాలి, ఎంత విస్తీర్ణంలో వేయాలి అన్న విషయాన్ని రైతు నిర్ణయించుకొంటాడు. అయితే నీళ్ళు అందే అవకాశాన్ని బట్టి వరి అయితే తక్కువ విస్తీర్ణంలో మక్కజొన్న అయితే ఎక్కువ విస్తీర్ణంలో వేసుకొంటారు. మొత్తం మీద ఉన్న నీటిని మొత్తంగా వినియోగించుకొనే ప్రయత్నం చేస్తారు. కానీ బావుల కింద వరి వేస్తే తల్లి శరీరంలో రక్తం తాగినట్టే అన్న రఘువీరారెడ్డికి రైతుల గురించిగాని, వ్యవసాయం గురించిగాని అవగాహన లేదనే సందేహం వస్తుంది. ఉంటే ఎందుకు మాట్లాడుతాడు?

రెండో పంటగా వరి వేయకూడదని ఆంక్షలు విధించ దలుచు కుంటే ప్రభుత్వం ప్రధానంగా బావుల కింద వ్యవసాయం సాగుతున్న తెలంగాణ లాంటి ప్రాంతాల్లో ముందుగానే ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అందరికి నాణ్యమైన బియ్యాన్ని సబ్సిడీ ధరకు అందించాలి. తక్కువ ధరకు కుటుంబ అవసరాలను తీర్చగల మోతాదులో బియ్యం సరఫరా చేయాలి. జరుగవలసింది ఇలా ఉండగా ఇప్పుడు ప్రభుత్వ రేషన్ షాపుల ద్వారా అందే మొత్తం 20 శాతం తిండి అవసరాలను కూడా తీర్చడం లేదని పలు సంస్థలు చేసిన సర్వేలో తేలింది.

పోనీ రానున్న కాలంలో సాగునీటి రంగంలో తలెత్తిన అవసరాలను తీర్చడానికి చర్యలు తీసుకుంటున్నారా అంటే అదీ లేదు. గోదావరి నీళ్ళను కోస్తాంధ్రకు, కృష్ణ నీళ్ళను రాయలసీమకు మళ్ళించడానికి ప్రభుత్వం పాలనాపరమైన చర్యలను వేగంగా తీసుకుంటున్నది. అందుకే ఆంధ్ర, రాయలసీమలకు కలిపి గోదావరి, కృష్ణ సుమారు 800 టి.యం.సి.ల నీళ్ళను, తెలంగాణకు సుమారు 100 టి.యం.సి.ల నీటినే ఇవ్వనున్నారు. చెరువుల మరమ్మత్తు నిర్లక్ష్యం చేయబడుతున్నది. మొన్న వలిగొండలో జరిగిన రైల్వే ప్రమాదం చెరువుల యాజమాన్య స్థితికి నిదర్శనం. అనూహ్యంగా నీళ్ళు వచ్చేసరికి ఆ విధంగా ఎన్నో చెరువులు తెగిపోయాయి. కనీసం ఎందుకిలా చెరువులు తెగిపోయాయో తెలుసుకోడానికి కూడా ప్రభుత్వం ఆలోచించడం లేదు. చెరువుల పునరుద్ధరణకు చర్యలు తీసుకోవడం లేదు.

అంతేకాక ఖుష్కీ పంటల పునరుద్ధరణకు ప్రభుత్వం చేస్తున్నదీ చాలా తక్కువే. జొన్న, సజ్జ, రాగులు వంటి పంటల నుండి ఆదాయం రాదు. వాటి స్థానంలో వరి కాక రిస్కు లేకుండా పండ గల పంట మరొకటి లేదు. గతంలో విరివిగ సాగిన ఖుష్కీ పంటల దిగుబడి, సాగు విస్తీర్ణం చాలా పడిపోయాయి. ఎందుకంటే ప్రభుత్వం వరి పట్ల చూపిన శ్రద్ధ ఇతర పంటల దిగుబడిని పెంచడానికి అవసరమయిన ప్రోత్సాహక చర్యలు తీసుకోలేదు. అందుకే ఆ పంటలను రైతు వదిలేయక తప్పలేదు. ఆ పంటల వలన కూలీ కూడా గిట్టుబాటు కాదని రైతులు అంటున్నారు. చాలా ప్రాంతాల్లో గత్యంతరం లేక పత్తి, మక్కజొన్న సాగుచేస్తున్నారు. పత్తి చాలా రిస్కుతో కూడుకున్న పంట. మక్కజొన్న పంట తగిన ఆదాయాన్నివ్వదు.

ఈ పరిస్థితిలో ప్రభుత్వం వరిసాగును నిషేధించడం వలన కొన్ని ప్రాంతాల్లో ఆహార భద్రతకు ముప్పు వాటిల్లడమే కాదు ప్రాంతాల మధ్య అసమానతలు మరింతగా పెరిగి స్థిరపడి పోయే ప్రమాదమున్నది. ముఖ్యంగా తెలంగాణ ప్రజలు తమ తిండి అవసరాలకు, పశుగ్రాసానికి ఇతర ప్రాంతాలపై ఆధారపడే విధంగా ప్రభుత్వ నిర్ణయాలుంటున్నాయని రైతులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే కోస్తాంధ్రలో సగటున ఒక హెక్టారు దిగుబడికి 25,000 ఆదాయం వస్తే తెలంగాణ, రాయలసీమల్లో 15,000 ఆదాయం మాత్రమే వస్తున్నది. దీనికి గల కారణాలు రైతులు చేసిన తప్పులు కాదు. పరిస్థితి ఇలా మారడానికి బాధ్యత ప్రభుత్వానిదే. కనుక రైతును బాధ్యుణ్ణి చేయడం సరికాదు.

రైతు నేలతల్లి రక్తం తాగడంలేదు కానీ ప్రభుత్వం తన విధానాల ద్వారా ఖుష్కి (వర్షాధార) పంటలు పండే ప్రాంతాల రైతు భవిష్యత్తును నాశనం చేసింది. ఇవ్వాళ మారవలసింది రైతులు కాదు ప్రభుత్వ విధానమే. నీరు పుష్కలంగా ఉన్నప్పుడు, జల విద్యుత్తు సమృద్ధిగా ఉత్పత్తి అవుతున్నప్పుడు బావుల కింద వరిసాగుపై ఆంక్షలు ఎందుకు? రైతులకు వాగ్దానం చేసిన ఉచిత విద్యుత్తును ఎగ్గొట్టడానికేనా?

❑

ఆదివాసీ గ్రామాలు అంతర్థానం - పోలవరం రాజ్యాంగ విరుద్ధం

| బిర్సు |

పోలవరం ప్రాజెక్ట్‌కు పర్యావరణ అనుమతి లభించినట్లు ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి ప్రకటించిన నాడే ప్రజా ఉద్యమాల జాతీయ సమాఖ్య సమన్వయకర్త మేధాపాట్కర్ హైదరాబాద్‌లో ఉండటం యాదృచ్ఛికం కావచ్చు. పోల అంటే ప్రజలనీ, పోలవరం ప్రాజెక్ట్ ప్రజలకు వరప్రసాదమనీ వై.ఎస్. చెప్పినదానికి విరుద్ధంగా పోలవరం ఆదివాసీ ప్రజలపాలిట శాపమని, ఆమె హెచ్చరించటంలో ఎలాంటి సందేహం లేదు. ముమ్మాటికీ వాస్తవమే. మరో మాటలో చెప్పాలంటే పోలవరం నిర్మాణం ఆదివాసీ తెగ మీద దాడిగా అభివర్ణించవచ్చు.

ప్రాజెక్ట్ నిర్మాణం వల్ల పెద్ద సంఖ్యలో ఆదివాసుల స్థానభ్రంశం కలుగుతుందనీ వారికి అతి తక్కువ అసౌకర్యం కలిగే విధంగా ప్రాజెక్ట్ రూపొందించవచ్చుననీ, వాదించిన ఇంజనీరింగ్ నిపుణులు అనేకమంది ప్రత్యామ్నాయ డిజైన్లను ప్రతిపాదించినా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోలేదు. పైగా తాను చెప్పిందే వేదంగా ప్రభుత్వ పనితీరు కనబడుతున్నది.

నిర్వాసితులయ్యే ఆదివాసీలకు అన్యాయం జరగకుండా వారి సంస్కృతికి, జీవన విధానానికి, స్వేచ్ఛకు భంగం కలగకుండా నివారించేందుకు కొన్ని రాజకీయ పార్టీలు, హక్కుల సంఘాలు ఉద్యమాలు నిర్మిస్తున్నాయి. రాజమండ్రిలో సీతారామాంజనేయ యుద్ధం యథావిధిగా ప్రహసనప్రాయంగా సాగింది. అసలు సమస్యల జోలికి వెళ్ళకుండా టెండర్లకు సంబంధించిన ఖండన మండనలకే ఆ వాక్శూరులిద్దరూ పరిమితమైనారు.

కేంద్ర జలసంఘం నుండి అన్ని అనుమతులు రాకుండా పోలవరం కాలువల తవ్వకాలు సాగించరాదంటూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. పోలవరం ప్రాజెక్ట్ మూలంగా భూములు కోల్పోతున్న వారికి నష్టపరిహారం చెల్లించాలంటూ ముద్రగడ పద్మనాభం తనమృత్యువును అరచేతిలో పెట్టుకుని ఆమరణ నిరాహార దీక్ష చేసాడు. ప్రభుత్వం సూచించిన పరిమితమైన షరతులకు లొంగిపోయి నిమ్మరసం తాగి దీక్ష విరమించిన కొద్ది సేపటికే, అదే జిల్లాకు చెందిన కాంగ్రెస్ నాయకులు కలెక్టర్ హామీ (నిర్వాసితులు కోల్పోయే భూమికి బదులు భూమి) చెల్లదంటూ ప్రకటించడం పాలకవర్గాల నేలబారు రాజకీయం కాక మరేమిటి?

ఆదివాసీల గోడును పట్టించుకోకుండా, ప్రాజెక్ట్ డిజైన్ మార్చుకోవాలన్న విజ్ఞుల సలహాలను పట్టించుకోకుండా మొండిగా వ్యవహరిస్తున్న ప్రభుత్వ వైఖరిని ఏమనుకోవాలి? పాలక వర్గాల సంస్కృతి అధికారంలో ఉన్నప్పుడు అధికారాన్ని తమ అవసరాలు తీర్చుకోవడానికి వాడుకుంటారు. చట్టాలు, నియమాలు, ఇతరుల హక్కులు, తప్పొప్పుల వివేచన, ఇవేవీ వారికి అక్కరలేదు. దీని వలన సమస్యలొస్తాయేమో కదా? అంటే వచ్చినప్పుడు చూసుకుంటాం అంటారు. అందరూ ఇట్లాగే నడుచుకుంటే సంఘజీవితం అసాధ్యం కాదా? అంటే కాకపోతే పోయింది. మనకేల? అంటారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేని కాలంలో చేసిన వాగ్దానాలను, విమర్శలను, అధికారంలోకి వచ్చాక విస్మరించడాన్ని మాత్రం ఉపేక్షించలేము. పోలవరం నిర్మాణం అనుమతి పొందడం కోసం తప్పుడు నివేదిక కేంద్ర జలవనరుల సంఘానికి నివేదించి ప్రజలను మభ్యపెడుతున్నారు. అభిప్రాయ సేకరణ పేరుతో పాలకవర్గాలు (కాంగ్రెస్) సాగించిన తమాషాను, నిరసన వెలిబుచ్చిన ఆదివాసీలపై పోలీసుల లాఠీచార్జీ ప్రభుత్వ నిరంకుశత్వాన్ని తేటతెల్లం చేస్తున్నది.

ఆదివాసీల హక్కులను కాలరాస్తూ ప్రాజెక్టులను తలపెడితే సహించేది లేదనీ ప్రజలు చేస్తున్న హెచ్చరికలు చెవిటి వాడి ముందు శంఖమూదిన మాదిరిగా వుంది. నర్మదా సరోవర్ నిర్మాణం విషయంలో ప్రజలు సాగించిన సుదీర్ఘమైన ఉద్యమం గురించి పార్లమెంట్ సభ్యుడుగా చాలా సంవత్సరాలు జాతీయ రాజకీయాలను పరిశీలించిన ముఖ్యమంత్రికి తెలియదా? ముందుగా తామనుకున్న మాటే నెగ్గాలన్న పంతంతో వ్యవహరిస్తున్న ముఖ్యమంత్రి నియంతృత్వానికిది నిదర్శనం.

పోలవరం (ఇందిరాసాగర్) ప్రాజెక్టు వల్ల రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ప్రత్యేక హోదా కలిగిన సుమారు మూడు వందల గ్రామాలు జలసమాధి అవుతాయి. ఇవన్నీ ఏజన్సీ ప్రాంతంలో వున్నాయి. ప్రత్యేక చట్టాలు వర్తించే షెడ్యూల్డ్ ప్రాంతాలలో నివసిస్తున్న ఒక లక్షా డెబ్భైవేల మంది ప్రజలు నిర్వాసితులౌతారు. సాగుభూములతో పాటు కొంత అడవి ప్రాంతం కూడ మునిగిపోతుంది. రాష్ట్ర ఆదివాసీ వ్యవహారాల సలహా మండలిని కానీ, షెడ్యూల్డ్ ట్రైబ్స్ కమిషన్‌తో కూడ సమాలోచన జరిపిన దాఖలాలు లేవు. ఏజన్సీ ప్రాంతాల సరిహద్దులను మార్చుతున్న ఈ విషయం రాష్ట్రపతి దృష్టికి తీసుకువెళ్ళకపోవడం కూడా అప్రజాస్వామికమే. రాజ్యాంగంలోని షెడ్యూల్ 5,6 ప్రకారం గ్రామ సభలు తీర్మానం లేకుండా ఆదివాసీ ప్రాంతాలను ఖాళీ చేయించే అధికారం రాష్ట్ర ప్రభుత్వంకు గానీ, కేంద్ర ప్రభుత్వంకు గానీ లేదు.

పోలవరం ప్రాజెక్టు వల్ల మూడు దశాబ్దాలుగా పెండింగ్‌లో వున్న లోయర్ సీలేరు ప్రాజెక్టుతో పాటు, దానివల్ల సాగులోకి రావాల్సిన ఇరవైరెండువేల ఐదువందల ఎకరాల భూమి కనుమరుగయ్యే దుస్థితి ఏర్పడింది. అంతేగాకుండ పోలవరం ప్రాజెక్టు కారణంగా ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన 13 గ్రామాలు, ఒరిస్సాకి చెందిన 10 గ్రామాల ప్రజలను కూడ ఖాళీ చేయించాల్సి ఉంటుంది.

73వ రాజ్యాంగ సవరణ ప్రకారం మండలాలు మహాజన సభల తీర్మానం లేకుండా షెడ్యూల్డ్ ప్రాంతాలలో ఎటువంటి కార్యక్రమాలు చేపట్టడానికి వీల్లేదు. షెడ్యూల్డ్ ప్రాంతాలుగా రాష్ట్రపతి గుర్తించిన ప్రాంతాలను, నాన్ షెడ్యూల్డ్ ప్రాంతాలుగా పరిగణించే అధికారం రాష్ట్రపతికే వుంది. షెడ్యూల్డ్ ప్రాంతాల్లో వుండే మండల పరిషత్తులకు, జనసభలకు, అక్కడ ఎంపికయ్యే పార్లమెంట్ సభ్యులను సైతం రీకాల్ (వెనక్కు పిలిపించే) చేసే అధికారం వుంది. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం దానిని తుంగలో తొక్కి అప్రజాస్వామికంగా పోలవరం ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతి తీసుకువచ్చి పచ్చి నియంతలా వ్యవహరిస్తున్నది.

పోలవరం నిర్మాణం ద్వారా తరతరాలుగా వున్న ఆదివాసీ సంస్కృతి, సాంప్రదాయాలు, రాజకీయ, ఆర్థిక సామాజిక సాంఘిక జీవన విధానానికి, జీవించే హక్కుకి, స్వేచ్ఛ (నిజమైన స్వేచ్ఛ కాదు)కు తీవ్ర విఘాతం ఏర్పడి చిన్నాభిన్నం అయ్యే ప్రమాదం వుంది. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే మరో పదేళ్ళలో ఆదివాసీ ప్రాంతాలన్నింటిని ప్రభుత్వం ప్రాజెక్టులు, గనులు తవ్వకాల పేరుతో కబళించి వేసే పరిస్థితి ఆసన్నమైంది.

రాష్ట్రంలో కాంగ్రెస్, కేంద్రంలో యు.పి.ఏ. ప్రభుత్వాలు కనీస ఉమ్మడి కార్యక్రమాల (సిఎంపి)లో ఆదివాసీల హక్కులు కాపాడతామనీ, ప్రజాస్వామిక హక్కుల రక్షణ, ఉచిత విద్యుత్తు, విప్లవకారులతో చర్చలు, స్త్రీలకు ప్రత్యేకంగా ఎన్నో పథకాలు, రాయితీలు ప్రకటించి అధికాంలోకి వచ్చారు. వై.ఎస్. అధికారంలోకి రాగానే అన్ని గాలి కొదిలేసి తన ఫ్యాక్షన్ రాజకీయాలు, స్వప్రయోజనాలతో బాటు ప్రపంచబ్యాంకు, సామ్రాజ్యవాదం, బడా భూస్వాముల విధానాల కనుగుణంగానే పరిపాలనా కొనసాగిస్తున్నాడు.

పోలవరం ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతి లభించినట్టు ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖరరెడ్డి ప్రకటిస్తూ, పోలవరం ప్రాజెక్టు ప్రజలకు వరప్రసాదమనీ ప్రకటించడం పచ్చి బూటకం. ప్రజలకు వరప్రసాదం కాదు, మరణశాసనంగా చెప్పుకోవడం సరిగ్గా ఉంటుందేమో!

పోలవరం ప్రాజెక్టుకు షరతులతో కూడిన పర్యావరణ అనుమతిని మాత్రమే కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వశాఖ మంజూరు చేసింది. పోలవరం ప్రాజెక్ట్ పునరావాసం, అంతరించుకు పోబోతున్న వన్యప్రాణి, వృక్షసంపద, భూమి వినియోగం (ఎఫ్‌సిసి), భూమి వర్గీకరణ, మట్టి వర్గీకరణ, తదితర అంశాలకు సంబంధించిన, సమాచారంపై పలు సందేహాలు లేవనెత్తింది. పోలవరం నిర్వాసితులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కల్పించబోతున్న పునరావాస ప్యాకేజిపై పలు సందేహాలు లేవనెత్తిన కేంద్ర మంత్రిత్వశాఖ సవరించిన ప్యాకేజిని సమర్పించాలనీ ఆదేశించింది. అలాగే పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం వల్ల ముంపునకు గురవుతున్న 9 వేల ఎకరాలకు పైగా అడవులపై ఆధారపడ్డ వన్యప్రాణి, వృక్షసంపద తదితర సమాచారం కూడ అసంపూర్తిగా ఉందని, ఆ వివరాలు కూడా తిరిగి సమర్పించాలనీ సూచించింది. దీనిని బట్టి అర్థమౌతున్నదేమంటే 'హస్త' లాఘవంతో రాష్ట్ర ప్రభుత్వం అనుమతులు పొందింది. అందుకే పోలవరం ప్రాజెక్టు ప్రతిపాదన అందిన రెండురోజులకే కేంద్రపర్యావరణశాఖ అనుమతి మంజూరు చేయడానికి హడావుడి ఎందుకు పడింది? తప్పుడు సమాచారం, తప్పుడు డేటా సమర్పించడం లేదా వాస్తవాలను దాచిపెట్టడం వంటి పనులకు పాల్పడితే ప్రాజెక్టును నిరాకరిస్తామనీ కేంద్ర ప్రభుత్వ ఇఐఏ నోటిఫికేషన్ సెక్షన్ 5(4) లో పేర్కొన్నారు. తప్పుడు సమాచారం యిచ్చిన పోలవరం ప్రాజెక్టుకు ఆ క్లాజును వర్తింపజేయాలి. ఎన్ని అనుమతులు వచ్చినా అత్యున్నత చట్టమైన భారత రాజ్యాంగం ప్రకారం అందరికీ జీవించేహక్కు ఉంది. ఆదివాసులకు రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంఘిక జీవనానికి న్యాయం జరిగిన నాడే నిజమైన పోల'వరం' అవుతుంది. దీనికి విరుద్ధంగా జరిగితే పోల'వరం' ప్రజల పాలిట మరణశాపమే అవుతుంది.

గత తొమ్మిదేండ్ల చంద్రబాబు ప్రభుత్వం ప్రపంచబ్యాంకు అప్పులతో జాతీయ రహదార్లు నిర్మించడమే ఆంధ్రప్రదేశ్ పురోగతి అన్నాడు. ఐ.టి. రంగాన్ని అభివృద్ధి చేయడానికి విద్యను ప్రైవేటీకరించాడు. మన ఐ.టి. విద్యార్థులను అమెరికా, బ్రిటన్ వంటి సామ్రాజ్యవాద దేశాలలో వేతన బానిసలుగా మార్చివేసిన అభివృద్ధే చంద్రబాబు అభివృద్ధి. రాజశేఖరరెడ్డి జలయజ్ఞాల ద్వారా ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధిని ప్రకటించాడు. రాజశేఖరరెడ్డి ప్రకటించిన ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం నుండి క్లియరెన్స్ రాక ముందే శిలాఫలకాల, శంకుస్థాపనలతో, ప్రాజెక్టుల నిధులు పంపకాలలో అభివృద్ధి కనబడుతుంది. ప్రాజెక్టు నిర్వాసితులకు, పునరావాసం, నష్టపరిహారం చెల్లించాలనీ పులిచింతల, పోలవరం, తోటపల్లి రైతులు డిమాండ్ చేస్తే తోటపల్లి రైతులపై ప్రభుత్వం కాల్పులు జరిపింది. పోలవరం రైతులపై తీవ్రస్థాయిలో పోలీసులు విరుచుకుపడి లాఠీ చార్జీ చేసి తీవ్రంగా గాయపర్చారు. చంద్రబాబు విధానాలు, అణచివేతకు కొనసాగింపుగానే వై.ఎస్. పాలన కూడ కొనసాగుతోంది.

బాక్రానంగల్ నుండి నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టుల నుండి నేటి పోలవరం వరకు ప్రాజెక్టు నిర్వాసితుల జీవితాలు నాశనం చేసి అభివృద్ధి చెందిన ప్రాంతాలను అభివృద్ధి చేయడం, అసమానాభివృద్ధిలో అభివృద్ధి చెందుతున్న దోపిడీ వర్గాల వారిని అభివృద్ధి చేయడమే ప్రభుత్వం యొక్క పరమ లక్ష్యం. నిజంగా ఆంధ్రరాష్ట్ర అభివృద్ధి అంటే ఉత్పత్తి శక్తుల అభివృద్ధే! ఉత్పత్తి శక్తుల అభివృద్ధికి అర్థవలస-అర్ధ భూస్వామ్య వ్యవస్థ ఆటంకంగా వుంది. ఈవ్యవస్థను సామ్రాజ్యవాదులు పరిరక్షించుతూ తమ దోపిడీ విధానాలను యధేచ్ఛగా కొనసాగిస్తున్నారు. ఇక్కడ దళారీ నిరంకుశ భూర్జువా, భూస్వామ్య వర్గాలు, సామ్రాజ్యవాద దోపిడీ విధానాలకు సేవ చేస్తూ తమ ప్రయోజనాలను పొందుతూ ఉత్పత్తిశక్తుల అభివృద్ధికి ఆటంకంగా వున్నారు.

ఆదివాసీ ప్రాంతంలోని ఉత్పత్తి శక్తులు నేటికీ భూస్వామ్య ఉత్పత్తి విధానంలోకి (ఆదిమ వ్యవసాయ పద్ధతియే కొనసాగుతున్నది) అడుగుపెట్టలేదు.

(మిగతా 37వ పేజీలో)

కొల్లేరు : తిలా పాపం తలా పిడికెడు

| కొణతం దిలీప్ |

అధికారం, అవినీతి, ధనం - ఈ మూడింటి అపవిత్ర కలయిక కొల్లేరు సరస్సు పాలిట యమపాశమైంది. ప్రపంచ పటంలో తనకంటూ ఓ ప్రత్యేక స్థానం సంపాదించుకుని, అపార మత్స్య సంపదకు ఆలవాలమై, ఎక్కడో వేలమైళ్ల దూరాన ఉన్న సైబీరియన్ పక్షులకు ఆత్మీయ ఆతిథ్యమిచ్చిన మన మంచినీటి కొల్లేరు ఇప్పుడు విషాదసంద్రం - మనిషి దురాశకు, ప్రభుత్వ నిష్క్రియాపరత్వానికి, నేతల అవినీతికి నిలువెత్తు అద్దం.

చేపల చెరువులుగా మార్చబడి రూపురేఖలు కోల్పోయి కాలుష్య కాసారంగా మారిన కొల్లేరుకు ఘనమైన చరిత్ర ఉంది. దాదాపు రెండువేల మూడువందల చదరపు కిలోమీటర్లలో విస్తరించిన ఈ భారీ సరస్సు ఆసియాలోనే రెండో అతి పెద్ద మంచినీటి సరస్సు. కృష్ణా, గోదావరి నదుల మధ్య సముద్ర తీరం చెంతనే ఏర్పడిన ఈ సరస్సుకు రామిలేరు, బుడమేరు, తమ్మిలేరు, గుండేరు, ఎర్రకాల్వ, దాదాపు ఇరవై మేజర్ డ్రైన్లు, అంతే సంఖ్యలో పంటకాలువల ద్వారా నీరు చేరుతుంది. ఇలా చేరిన నీరు ఉప్పుటేరు ద్వారా సముద్రంలో కలుస్తుంది. పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల్లోని పది మండలాల పరిధిలో కొల్లేరు విస్తరించింది.

వలస పక్షులు శీతాకాలంలో కొల్లేరును తమ నివాసంగా చేసుకుని ఇక్కడే గుడ్లు పెట్టి, వాటిని పొదిగి తిరిగి వెళ్ళేప్పుడు తమ పిల్లలను తీసుకుని వెళ్ళేవి. అయితే 1984లో కొల్లేరు పరిసర గ్రామాల ప్రజలు నీటిలో మునిగిన తమ పొలాల్లో చేపలసాగు లాభదాయకమని గ్రహించి చేపల చెరువులు ఏర్పాటు చేయడం మొదలు పెట్టాక పరిస్థితి మారిపోయింది.

తొంభైయ్యవ దశకంలో ఈ చేపల చెరువుల వేలం వెర్రి తారస్థాయికి చేరింది. ప్రభుత్వం పేదలకిచ్చిన డి.ఫారం భూములు, రైతుల స్వంత భూములు, సరస్సులోని ప్రభుత్వాధీన ప్రాంతాలలో విచ్చలవిడిగా చేపల చెరువులు వెలిసాయి. వీటి విస్తీర్ణం క్రమంగా పెరిగి ఇప్పుడు దాదాపు లక్ష ఎకరాల కొల్లేరు భూమి చెరువులుగా మారిపోయిందని అంచనా వేస్తున్నారు. ఈ చెరువులు నిర్వహిస్తున్న వారిలో అన్ని పార్టీలకు చెందిన నాయకులున్నారు. వేర్వేరు వ్యాపారాలు చేసుకుంటున్న ప్రముఖులున్నారు, ఆఖరికి మాఫియా డాన్‌లు కూడా ఉన్నారు.

కొల్లేరు సరస్సులో ఆక్రమణలు తొలగించాలని 1992 నుండి అనేక మంది ఉన్నతాధికారులు నివేదించినా రాష్ట్ర ప్రభుత్వంలోని పెద్దలు పట్టించుకున్న పాపాన పోలేదు. 1999లో కోర్టు ఆదేశించిన పిమ్మట గానీ కొల్లేరును అభయారణ్యంగా మారుస్తూ 120 జీవోను వెలువరించలేదు రాష్ట్ర ప్రభుత్వం. అయితే 120 జీవో విడుదల కాగానే కొల్లేరు పరిరక్షణ బాధ్యత అటవీశాఖదే అని రెవెన్యూశాఖ, సాగునీటిశాఖ చేతులు దులిపేసుకున్నాయి.

కొల్లేరును ఫలహారం చేస్తున్న అక్రమార్కుల పట్ల వరుస ప్రభుత్వాలు ఉదాసీన వైఖరినే కనబరిచాయి. కారణాలు బహిరంగ రహస్యమే. కొల్లేరు చేపల చెరువుల వ్యాపారం రమారమి వెయ్యి కోట్ల వరకూ ఉంటుందని అంచనా. ఇందులోంచి అధికార్ల నుంచి అమాత్యుల వరకు అందరికీ లంచాలు అందుతున్నాయి. లంచాల రుచి మరిగిన వీరు అక్కడ కొల్లేరుకు శాశ్వత సమాధి కట్టేస్తున్నా ఉలకరు పలకరు. కుంభకర్ణ నిద్ర నటిస్తారు.

అయితే ఈ ఏడాది కురిసిన భారీ వర్షాలు పరిస్థితిలో మార్పు తెచ్చాయి. వివిధ డ్రెయిన్లు, పంటకాలువల ద్వారా పోటెత్తిన వరదనీరు కొల్లేరును చేరలేక పరిసర గ్రామాల్లోని పంట పొలాలను ముంచెత్తింది. ఫలితంగా దాదాపు లక్షా ఎనభై వేల ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. వారాలు గడిచినా వరదనీరు తగ్గలేదు. పంటంతా నాశనమైంది. రైతుల హాహాకారాలు మిన్నంటాయి. అప్పుడు మేల్కొంది రాష్ట్ర ప్రభుత్వం. నీటి ప్రవాహానికి అడ్డుగా నిలిచిన కొల్లేరులోని చేపల చెరువులు ధ్వంసం చేయాలని సంబంధిత జిల్లా కలెక్టర్లను ముఖ్యమంత్రి ఆదేశించారు.

కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల కలెక్టర్లు వెంటనే రంగంలోకి దిగారు. పక్షం రోజులపాటు 'ఆపరేషన్ కొల్లేరు' అని నామకరణంచేసి చేపల చెరువుల ధ్వంసం కొనసాగించారు. అక్రమార్కులు ఊరు కోలేదు. అన్ని ప్రయత్నాలూ చేశారు. పరిసర గ్రామాల ప్రజలను రెచ్చగొట్టి అధికారులపైకి ఉసికొల్పారు. చెరువులను లీజుకు తీసుకున్న తిమింగలాలు తెరవెనుక ఉండి డబ్బు, అధికారం అండతో అడుగడుగునా ఆపరేషన్ కొల్లేరుకు అడ్డు తగిలారు. 'ఎవరు చెప్పినా వినొద్దు' అంటూ సాక్షాత్తూ రాజశేఖరరెడ్డి ఆదేశించిన మూణ్ణాళ్ళకే కొల్లేరు చెరువుల లాబీ ధాటికి రాష్ట్ర ప్రభుత్వం లొంగి పోయినట్టు కనబడుతోంది. 370 చేపల చెరువులు ధ్వంసం చేసి 'ప్రస్తుతానికి ఈ ఆపరేషన్ ముగిద్దాం' అన్న నిర్ణయానికి ప్రభుత్వం వచ్చిందని భోగట్టా. 120 జీవో అమలును తాత్కాలికంగా ఆపివేసి కేవలం పొలాల ముంపు సమస్య తీర్చడమే ప్రధాన కర్తవ్యంగా మంత్రి బొత్స సత్యనారాయణ ప్రకటించారు. కొల్లేరు పూర్తి స్థాయి పరిరక్షణ కొరకు ఒక మంత్రివర్గ ఉపసంఘం వేశామని దాని నివేదిక వచ్చాక మిగతా చెరువుల సంగతి తేలుస్తామని ఆయన అంటున్నారు.

ఎప్పటికి వస్తుందో తెలియని ఆ నివేదిక కేవలం సమస్యను పక్కదారి పట్టించడం కోసమేనని, చేపల చెరువుల లాబీ మంత్రి బొత్సను లోబరుచుకుందనే ఆరోపణలు మాత్రం బలంగా వినపడుతున్నాయి. ❑

ఆంధ్రప్రదేశ్ స్వర్ణోత్సవాలు - విస్మరణకు, వివక్షకు గురవుతున్న చరిత్ర

పి. మునవాళ్ళయ్య

ఆంధ్రప్రదేశ్ ఏర్పడి ఏభయ్యవ ఏట ప్రవేశిస్తున్న సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణోత్సవాలు నిర్వహిస్తున్నది. ఈ సందర్భంగా ప్రభుత్వం, మీడియా, పలు సంస్థలు ఉత్సవాల్లో భాగంగా చరిత్రను స్మరించుకుంటున్నాయి లేదా ఆవిష్కరించుకుంటున్నాయి. ఈ విషయంలో ఈనాటి ఆకాంక్షలు, ప్రయోజనాలు మన దృష్టిని ప్రభావితం చేస్తాయి. నిరపేక్ష వస్తుగత దృష్టి కష్టమే. చరిత్ర చేరుకున్న మజిలీల విషయంలో మన ఈనాటి అభిప్రాయాలు ఏవైనా, చరిత్ర గమనాన్ని వక్రీకరించే హక్కు మనకు లేదు.

మనకు తెలిసిన చరిత్రలో శాలివాహనులు లేదా శాతవాహనుల నుంచి ఆసఫ్‌జాహీ వంశ పాలన వరకు విశాల సామ్రాజ్యాల్లో (శాతవాహనులు, కాకతీయులు, విజయనగర రాజులు, ఆసఫ్‌జాహీలు ఇప్పటికన్నా విశాలమైన తెలుగు భూభాగాన్ని పరిపాలించారు.) ఒకే పాలన కింద ఉన్న తెలుగువాళ్లు బ్రిటిష్ ఇండియాతో ఆసఫ్‌జాహీ ఆఖరి ప్రభువుల స్నేహం వల్ల వేరువేరు పరిపాలనల కిందికి పోయారు. అట్లా హైదరాబాదు సంస్థానం నుంచి విడిపోయిన సర్కారు జిల్లాలు, రాయలసీమ మద్రాసు ప్రావిన్సులో భాగమయ్యాయి. రెండువందల ఏళ్లు ఈ భిన్న పరిపాలనల్లోనే తెలుగువాళ్లు ఉన్నారు. ఇది తక్కువకాలం కాదు. బ్రిటిష్ పెట్టుబడి రాజకీయార్థిక విధానానికి, నైజాం ఫ్యూడల్ పరిపాలనకు ఉన్న తేడాను దృష్టిలో పెట్టుకుంటే ఈ రెండువందల ఏళ్లు రాజకీయార్థిక, సామాజిక, సాంస్కృతిక, భాషా సంబంధాల్లో సృష్టించే అఖాతం కూడ తక్కువ అంచనా వేయదగిందికాదు. పెట్టుబడి దోపిడీ అభివృద్ధి పరుస్తూ తరలించుక పోవడంగా ఉంటుంది. ఉదాహరణకు - గుమస్తాలను తయారు చేయడానికి విశ్వవిద్యాలయాలు వస్తాయి. బొగ్గు, ముడిసరుకులు తరలించుక పోవడానికి రైళ్లు వస్తాయి. ఫ్యూడల్ దోపిడీ ఎక్కడికి తరలించుకపోదు. ఇక్కడే అణచి ఉంచుతుంది. అందుకని విశాల ప్రజాబాహుళ్యానికి చదువు ఉండదు, సౌకర్యాలుండవు.

ఇట్లా విడిపోయి అటు మద్రాసు ప్రావిన్సులో, ఇటు హైదరాబాదు సంస్థానంలో ఉన్న తెలుగువాళ్లల్లో 1905 బెంగాల్ విభజన జాతీయభావాలు రగిలించింది. 'వందేమాతరమ్' ఉద్యమం ఆంధ్ర ప్రాంతంలోనే కాదు, తెలంగాణ విద్యావంతుల్లోనూ తన ప్రభావాన్ని చూపింది. మొదటి ప్రపంచ యుద్ధం, కాంగ్రెస్‌లో గాంధీ నాయకత్వం రెండు ప్రాంతాల్లో ప్రజాస్వామిక భావాలకు ప్రోది చేసాయి. మొదటి ప్రపంచ యుద్ధం ముగియగానే రష్యాలో కార్మికవర్గ విప్లవం విజయవంతమైంది.

1920ల నుంచే బ్రిటిష్ వ్యతిరేక జాతీయోద్యమంతో పాటు, జాతీయోద్యమంలో భాగంగా మద్రాసు ప్రావిన్సులో ఆంధ్రోద్యమం ప్రారంభమైంది. ఇటు హైదరాబాద్ సంస్థానంలోనూ ఆంధ్రజన కేంద్ర సంఘం స్థాపనతో తెలుగు ఆత్మగౌరవ పోరాటం ప్రారంభమైంది.

బ్రిటిష్ పాలకులకు యూరపు రాజకీయార్థిక చరిత్ర తెలుసు గనుక, భూగోళ జ్ఞానం ఉంది గనుక బ్రిటిష్ ఇండియాలో భాగమైనవైనా, ఐదువందల సంస్థానాల్లో ఉన్నవైనా జాతులని తెలుసు. మతాలు తప్ప ఈ జాతులను కలిపే ఏకసూత్రం ఏదీ లేదని తెలుసు. అందుకే వాళ్లు 1857 నుంచే మతాల ప్రాతిపదికపై ప్రజలను చీల్చి పరిపాలనా విభాగాలుగా రాష్ట్రాలు ఏర్పాటుచేసి ఈ దేశ భావనను (జాతీయోద్యమంగా వ్యక్తమైన దేశభావన), జాతి భావనను దెబ్బ తీయాలని కుట్ర చేసాయి. పంజాబ్ అండ్ ఈస్టర్న్ ప్రావిన్సెస్ యూనియన్ (పెప్సు), యునైటెడ్ ప్రావిన్సెస్, సెంట్రల్ ప్రావిన్సెస్, మద్రాసు ప్రావిన్సు, ట్రివాన్కూర్-కొచ్చిన్ - వంటి పరిపాలనా విభాగాలు బ్రిటిష్ ఇండియాలే కుట్రతో ఉద్దేశపూర్వకంగా జాతిభావనను విచ్ఛిన్నం చేయడానికి ఏర్పడినవే. అయితే ఒక వాస్తవాన్ని గుర్తించడానికి, స్వప్రయోజనానికి తప్పకుండా ఒక వైరుధ్యం ఉంటుంది - ముఖ్యంగా పాలకుల ప్రయోజనాలు ముందుకు వచ్చినప్పుడు. బ్రిటిష్ వాళ్లు వాళ్ల రాకపూర్వపు ఏ ఒక్క జాతి రాష్ట్రంగా ఉండకుండా జాగ్రత్త పడ్డారు.

బ్రిటిష్ కరెన్సీపై నాణేలతో సహా పదహారు భాషలుండేవి. 'ఈ ఆంధ్రోద్యమంఏమిటి? జాతీయోద్యమం చాలదా' అని గాంధీజీ ప్రశ్నించినపుడు ఆయన ముందుకు ఒక నాణాన్ని విసిరి డాక్టర్ పట్టాభి సీతారామయ్య 'అందులో తెలుగు ఉంది చూడండీ' అన్నాడట. (బందరులో జాతీయ కళాశాల రావడానికి, ఆంధ్రాబ్యాంకు ఏర్పడడానికి బాధ్యుడైన భోగరాజు పట్టాభిసీతారామయ్యను ఆంధ్రరాష్ట్రం ఏర్పడినప్పుడు కూడ ఎవరూ తలచుకున్నట్లు లేరు).

జాతీయోద్యమ ప్రభావంలో తెలుగులో సాహిత్యం వెల్లివిరిసింది. అయితే మద్రాసు ప్రావిన్సులోని సాహిత్య వేత్తలంతా ఒక విశ్వజనీన భావంలో ప్రత్యేక అంశంగా చూసినట్లుగానే ఏ వైరుధ్యం లేకుండా దానితో పాటే ఆంధ్రోద్యమాన్ని గానం చేసారు. రాయప్రోలు (తెలుగు తోరణం), విశ్వనాథ (ఆంధ్రప్రశస్తి, ఆంధ్రపౌరుషము), కొడాలి (హంపీక్షేత్రం) మొదలైన ఏ ప్రసిద్ధ కవిని తీసుకున్నా ఇది కనిపిస్తుంది. 'వేంగీక్షేత్రం'లో విశ్వనాథ ఈ భావాన్ని ఆనాటి విద్యావంతులందరి చైతన్యానికి ప్రతీకగా చెప్పాడు. వాస్తవానికి వేంగి రాజధానిగా ఉన్న తెలుగు రాజ్యం చిన్నది. అయినా తెలుగు జాతిని బ్రిటిష్ పాలకులు ఎట్లా విచ్ఛిత్తి చేసారో చెప్పు - ఒక సరస్సులో విప్పారిన రేకులతో వికసించిన

తామరపువ్వును మదపుటేనుగు తూడ కోసం పెరికి ఆ పూరేకుల మీంచే పదఘట్టనలతో నడిచిపోతే రేకులే కాదు, పరాగం కూడ విచ్చిన్నమైనట్లుగా బ్రిటిష్ పాలనలో జాతిభావన చిన్నాభిన్నమైందంటాడు.

బాపట్ల మొదలు ఆంధ్రోద్యమ సభల గురించీ, ఆంధ్రరాష్ట్ర సాధన గురించీ పొట్టి శ్రీరాములు వరకు జరిగిన ఉద్యమాల ప్రస్తావన చాలనే వస్తున్నది గనుక మద్రాసు ప్రావిన్సులోని రాష్ట్ర ఉద్యమ పోరాటాల గురించి పునరుక్తి అవసరం ఇక్కడ లేదు. ఇక్కడే గుర్తు చేసుకోవాల్సింది 1936 కరాచీ కాంగ్రెస్‌లోనే నెహ్రూ నాయకత్వంలో భాషా రాష్ట్రాల ప్రాతిపదికగా దేశాన్ని ఒక సమాఖ్య నిర్మాణం గలిగిన కేంద్రం (యూనియన్)గా ఏర్పాటు చేయాలన్న ఆలోచన మొదలైంది. ఇది కేవలం భారత ఉపఖండంలోని వేల సంవత్సరాల స్వతంత్ర భాషా జాతుల పరిపాలనా విభాగాల ప్రతిపత్తిని మళ్లీ గౌరవించడమే.

ఇక్కడే నెహ్రూ గురించి ఒక విషయం చెప్పుకోవాలి - ఆయన మీద 1917 రష్యావిప్లవ ప్రభావం విప్లవం జరిగినప్పటి కన్నా కమలానెహ్రూ ఆరోగ్యం బాగుండక స్విట్జర్లాండ్‌కు పోయినప్పుడు బలంగా పడింది. వాస్తవానికి మన దేశంలోకి, రాష్ట్రంలోకి కూడ 1917 కన్నా ఫాసిస్టు వ్యతిరేక, నాజీ వ్యతిరేక స్పెయిన్ అంతర్యుద్ధ కాలంనుంచి రష్యా విప్లవ భావ ప్రభావ ప్రసారాలు ఎక్కువ. ఇంచుమించు అదే కాలంలో నెహ్రూ యూరప్‌లో ఉండే ముసోలినీని కలవడానికి కూడ నిరాకరించాడు. రష్యా విప్లవంలో జాతుల విముక్తి గురించి లెనిన్ నాయకత్వంలో కార్మిక వర్గం యిచ్చిన పిలుపు ఆయనను ఎంతగా ప్రభావితం చేసిందో ఆంధ్రప్రదేశ్ ఏర్పాటును నిజామాబాద్‌లో ప్రకటించినప్పుడు ఆయన చేసిన వ్యాఖ్యను చదివితే అర్థమవుతుంది.

జార్ చక్రవర్తికి వ్యతిరేకంగా చేసే విముక్తి పోరాటంలో కార్మిక వర్గంతో కలిసిరమ్మని జాతులకు పిలుపునిస్తూ లెనిన్ 'ఆ తర్వాత ఇష్టం లేకుంటే మీరు విడిపోవచ్చు. పెళ్లి అవనరాన్ని గుర్తించడమంటే అంతకన్నా బాధ్యతతో విడాకుల హక్కును గుర్తించడమేన'ని అంటాడు.

నెహ్రూకు తెలంగాణను ఆంధ్ర రాష్ట్రాన్ని విలీనం చేయాలనే భావనకేమో ఈ జాతి సిద్ధాంతం కారణంగా కనిపించింది. కాని తెలంగాణ ప్రజల మనోభావాలు, భౌతిక పరిస్థితులు దానికి పూర్తిగా భిన్నంగా ఉన్నాయని కూడ 1956 నాటికి ఫజలలీ కమీషన్ నివేదిక వల్ల కూడ స్పష్టంగా అర్థమైంది. ఆ ఘర్షణ నుంచి వెలువడిన ప్రకటనే ఇది.

1956 లో నిజామాబాదులో భారత సేవక్ సమాజ్ ఏర్పాటు చేసిన ఒక భారీ బహిరంగ సభలో మాట్లాడుతూ ఆంధ్ర తెలంగాణల విలీనాన్ని ప్రకటించారు.

'ఏక్ మాసూమ్ లడ్కీకో, ఏక్ నట్‌కట్ లడ్‌కాసే షాదీ కియా గయా.. చలేతో చలే. అగర్ నై చలేతో కభీభీ తలాక్ లే సకతే'

(ఒక అమాయకురాలికి ఒక సమస్యాత్మక కుర్రాడితో పెళ్లి చేస్తున్నాం. ఈ బంధం కుదిరితే కుదురుతుంది. కుదరకపోతే ఎప్పుడైనా విడాకులు తీసుకోవచ్చు)

కరాచీ కాంగ్రెస్ తర్వాత ఇరవయ్యేళ్లకు అనుభవం నుంచి ప్రధానిగా చెప్పిన మాట ఇది. మళ్లీ ఆంధ్రోద్యమంలోకి వస్తే,

ఇటు హైదరాబాదు సంస్థానంలో వివేకవర్ధినీ కళాశాల అనుభవంతో తెలుగు భాషకు జరిగిన అవమానం నేపథ్యంలో ఏర్పడిన ఆంధ్రజన కేంద్ర సంఘం ఆంధ్రమహాసభగా మారి మాడపాటి హనుమంతరావు, ఆదిరాజు వీరభద్రరావు, కొమర్రాజు వేంకట లక్ష్మణరావు, సురవరం ప్రతాపరెడ్డి, బూర్గుల రామకృష్ణారావు, కొండా వేంకట రంగారెడ్డి మొదలైన వారి అదే వరుస సారథ్యంలో చారిత్రక దృష్టితో తెలుగు ప్రజల భాష, సంస్కృతి, పరిపాలనా చరిత్రలను తవ్వి తీస్తూ, గొప్ప పరిశోధకులుగాను, గొప్ప ఉద్యమకారులుగాను ఆంధ్రమహాసభను నడిపారు. ఆంధ్రమహాసభ ఆరంభం నుంచే మహిళా విభాగం ఏర్పడి మహాసభలతో పాటే మహిళల సమస్యలపై చర్చలు తీర్మానాలు చేసేవాళ్లు. తెలంగాణ ఆంధ్రమహాసభకు చరిత్ర దృష్టి ఎక్కువ.

అందరికన్నా లోతుగా చరిత్ర అధ్యయనం చేసిన ఆదిరాజు వీరభద్రరావు 'మొదట ఇది తెలంగాణయే' అని తన ఆంధ్రోద్యమ చరిత్ర సంపుటాలను ప్రారంభిస్తారు. (దేశోద్ధారక గ్రంథమాల తరపున వట్టికోట ఆళ్వారుస్వామి ప్రచురించాడు) త్రిలింగాల మధ్యన - అంటే శ్రీశైలం, కాళేశ్వరం, ద్రాక్షారామం మధ్యన ఉన్న తెలుగు ప్రాంతమంతా తెలంగాణయే అని కూడ ఆదిరాజు వీరభద్రరావుగారంటారు.

అయితే కరాచీ కాంగ్రెస్ నాటికే ఏర్పడిన కమ్యూనిస్టు పార్టీ ఆంధ్రలో కాంగ్రెస్ సోషలిస్టు పార్టీలో భాగంగా, ఆంధ్రమహాసభలో నీటిలో చేపవలె రావి నారాయణరెడ్డి నాయకత్వంలో పని చేసే దాకా ఈ రెండు తెలుగు ప్రాంతాలు ఒకటిగా ఏర్పడాలన్న బలమైన ఆకాంక్ష ముందుకు రాలేదు.

అటు మద్రాసు ప్రావిన్సు నుంచి ఆంధ్ర ప్రాంతం విడిపోవాలని, ఇటు నైజాంపాలననుంచి తెలంగాణ విముక్తం కావాలని పోరాటమే మొదటి దశ. అంతే కాదు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంగా పిలుచుకుంటున్నది కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో ఆనాడు హైదరాబాదు సంస్థానంలోని మరాఠ్వాడ, కర్ణాటక ప్రాంతాల్లో కూడ ఉన్నది.

పుచ్చలపల్లి సుందరయ్య గారి 'విశాలాంధ్రలో ప్రజారాజ్యం', దాశరథి 'ముక్కోటి ఆంధ్రులం ఒక్కటై ఉండాలి' అన్న బలమైన వ్యక్తీకరణలు రెండో దశగా కమ్యూనిస్టులకు, వాళ్ల ప్రభావంలో వున్న మధ్యతరగతి విద్యావంతులకు, 1940ల నాటికి ఆ ప్రభావంలోకి వచ్చిన తెలంగాణలోని ఆంధ్రమహాసభకు ఉద్యమ రూపాన్ని ఇచ్చిన నినాదాలయినవి. అయినా అప్పటికే ఇటు తెలంగాణలో 'వెట్టి చాకిరీ నుంచి విముక్తి, దున్నేవారికే భూమి'

ప్రధాన కార్యక్రమంగా ఉండింది. ఆంధ్రమహాసభలోని కమ్యూనిస్టుల ప్రభావంలోకి వచ్చిన కాళోజీ, సాహిత్యరంగంలో ఉన్న కమ్యూనిస్టేతరుల్లో కూడ ఈ విశాలాంధ్ర భావన ప్రవేశించింది. తెలంగాణ రచయితల సంఘాన్ని అలంపురం మహాసభల్లోనే 1953 లో అఖిలాంధ్ర రచయితల సంఘంగా మార్చుకోవడం, ఆ సభలకు ముఖ్య అతిథిగా సర్వేపల్లి రాధాకృష్ణను పిలిచి శ్రీశ్రీ చేత కాళోజీ 'నా గొడవ' ను ఆవిష్కరింప చేయడం వంటివి గమనిస్తే దేవులపల్లి రామానుజరావు, పట్టికోట ఆళ్వారుస్వామి, దాశరథి, సి. నారాయణ రెడ్డి, కాళోజీ వంటి సాహిత్యోద్యమకారులందరూ హృదయ పూర్వకంగా అఖిలాంధ్ర ఏర్పాటు కోరుకున్నారని అర్థమవుతుంది.

జాతీయోద్యమకాలపు ఆంధ్రోద్యమ కవుల్లో గాంధేయవాది అయిన తుమ్మల సీతారామయ్య 'తెలుగు లెంక' అని కూడ అనిపించుకున్నాడు. కాని వాళ్లెవరూ అఖిలాంధ్ర ఏర్పడాలని ఉద్యమించినట్లు కనిపించదు.

శ్రీశ్రీ ప్రాసక్రీడలు (1953)

భాషాప్రయుక్త రాష్ట్ర రచన
దేశానికరిష్టం
అసలు రహస్యం నెహ్రూ
కది చాల కష్టం

తెలుగు రాజ్యమేర్పడితే
తొలి వజీరు రెడ్డి
తాగిందికి కుళ్ళు నీళ్ళు
తినడానికి గడ్డి

ప్రజాస్వామికం పేరిట
పదవులకై పోటీ
పరిపాలన చేసేదిక
పోలీసుల లాఠీ

కమ్యూనిస్టు పార్టీ ప్రభావం వచ్చాకనే వావిలాల గోపాలకృష్ణయ్య అయినా, గొల్లపూడి సీతారామ్ అయినా, శ్రీశ్రీ అయినా, ఆరుద్ర, సోమసుందర్, కుందుర్తి, గంగినేని వంటి కవులయినా విశాలాంధ్ర భావాన్ని ప్రచారంలోకి తెచ్చారు. ఏమైనా ఇది 1940లో కమ్యూనిస్టు పార్టీ ప్రభావంతో ఊపందుకున్న నినాదం, ఉద్యమం. పైన పేర్కొన్న కవులు, సాహిత్య వేత్తలు అందరూ అయితే కమ్యూనిస్టులు లేదా సహగాములు. అరసంలో ఉన్న వాళ్లు లేదా అరసంతో ఉన్నవాళ్లు. ఆంధ్రమహాసభతో ఉన్నవాళ్లు. కమ్యూనిస్టు పార్టీ చారిత్రక అవగాహన వల్ల, జాతి గురించి స్టాలిన్ చేసిన చారిత్రక విశ్లేషణ వల్ల ప్రపంచ వ్యాప్తంగా జాతి విముక్తి పోరాటాలను బలపరచింది. ఈ నాటికీ బూర్జువా, అకడమిక్ రాజకీయార్థిక సిద్ధాంత వేత్తలు కూడ అంగీకరించిన జాతి నిర్వచనాన్ని చేసినవాడు స్టాలిన్. జాతి అంటే ఒక భాష, సంస్కృతి, భౌగోళిక పరిధి, స్వతంత్ర పరిపాలనా విధానం - అనే నాలుగు అంశాలు ఉన్న బృందంగా ఆయన నిర్వచించాడు. యూరపులో ఉన్న దేశాలన్నీ ఇంగ్లాండు, ఫ్రాన్సు, జర్మనీ, ఇటలీ - దాదాపు అన్ని దేశాలు అట్లా భాషా జాతుల స్వతంత్ర పరిపాలనా భౌగోళిక ప్రతిపత్తులే. రష్యా కూడ అటువంటి జాతుల సమాహారమే. కనుకనే లెనిన్ కార్మికవర్గ విముక్తి పోరాటంలో జార్ చక్రవర్తికి వ్యతిరేకంగా రష్యాలోని జాతులన్నింటినీ కలిసిరమ్మని పిలుపు ఇచ్చాడు. అటువంటి జాతి విముక్తి పోరాటం, ఇంకా విశాల సందర్భంలో దేశ స్వతంత్ర పోరాటం కమ్యూనిస్టుల నాయకత్వంలో ప్రజల విప్లవ పోరాటంలో భాగమైతే అది విముక్తి పోరాటమవుతుందని ఈ సిద్ధాంతాన్ని మావో వియత్నామ్, చైనా, కంపూచియా వంటి అనుభవాలనుంచి చెప్పాడు. లెనిన్, స్టాలిన్, మావోల వంటి స్పష్టమైన అవగాహన, విశ్లేషణలతో తెలంగాణ విమోచనోద్యమం నడిచిందా అనే చర్చ ఎలా ఉన్నా 1948 నాటికి కమ్యూనిస్టులు మూడు వేల గ్రామాల్లో పది లక్షల ఎకరాల భూమిని విముక్తం చేసి బీజరూపంలో ఎర్ర రాజ్యాన్ని ప్రజలకు చవిచూపి చైనా విప్లవ పంథాలో ప్రవేశిస్తున్న వేళ నెహ్రూ, పటేల్‌లు పొరుగున మావో నాయకత్వంలో చైనా ఆచరణ చూస్తున్నారు గనుకనే హైదరాబాదు సంస్థానంపై మిలటరీ పోలీసు చర్యకు పూనుకున్నారు. 1971లో బంగ్లాదేశ్ విముక్తి పోరాటాన్ని కూడ అక్కడి కమ్యూనిస్టుల నాయకత్వం కిందికి పోకుండా చేయడానికే ఇందిరాగాంధీ భారత ప్రధానిగా జోక్యం చేసుకొని విముక్తిని దిగుమతి చేసింది. ఇది విప్లవ పార్టీల అవగాహన.

కనుక సిద్ధాంత రీత్యానే కమ్యూనిస్టులు భాషా జాతుల రాష్ట్రాలను, స్వయంప్రతిపత్తి మొదలు స్వతంత్రించడం దాకా బలపరచవలసి ఉంటుంది. స్టాలిన్ దీనికి 'కార్మికవర్గ ప్రయోజనాలకు భంగకరం కానిమేరకు' అని ఒక జాగ్రత్త చెప్పాడు. ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ ఇండియన్ యూనియన్ ఒక సమాఖ్యగా ఉండాలని అందులో భాషా జాతుల రాష్ట్రాలు స్వయంప్రతిపత్తి (అటానమీ) కలిగి ఉండాలని - కరెన్సీ, విదేశీ వ్యవహారాలు, సైన్యం, రైల్వేలు తప్ప అన్నీ రాష్ట్రాల అధీనంలో ఉండాలని ప్రతిపాదించింది. మొదటి సాధారణ ఎన్నికల్లో కేరళలో అధికారానికి వచ్చిన నంబూద్రిపాద్ ఆ ప్రతిపాదనతోనే విద్యాబిల్లు తెచ్చి ప్రైవేటు విద్యాసంస్థలన్నింటినీ ప్రభుత్వ అధీనంలోకి తెచ్చే ప్రయత్నం చేస్తే విద్య రాష్ట్ర, కేంద్ర ఉమ్మడి జాబితాలో ఉన్న విషయమని, ఆ బిల్లుకు అధ్యక్షుని ఆమోదం కావాల్సి ఉంటుంది గనుక ఆ నెపంతో నెహ్రూ ప్రభుత్వం నంబూద్రిపాద్‌కు శాసనసభలో పూర్తి ఆధిక్యత ఉన్నా పడగొట్టింది. షేక్ అబ్దుల్లా నాయకత్వంలో నేషనల్ కాన్ఫరెన్స్ గానీ, పంజాబ్‌లో ఆనందపూర్ సాహెబ్ తీర్మానంగానీ ఈ స్వయంప్రతిపత్తిని కోరేవే. ఈ సూత్రం ప్రకారం వాస్తవానికి కమ్యూనిస్టులు కాశ్మీరు, ఈశాన్య రాష్ట్రాలు స్వయం నిర్ణయాధికారాన్ని కోరినా బలపరచాలి. అట్లే ఆదివాసీ జాతులుగా జార్ఖండీయులు (సంతాల్‌లు), బీహార్, బెంగాల్, ఒరిస్సా, మధ్యప్రదేశ్‌లలో ఉన్న ఆదివాసీ ప్రాంతాలు కలిపి విశాల జార్ఖండ్‌ను ఏర్పాటు చేయడాన్ని, గూర్ఖాల్యాండ్‌ను, కూచ్‌బిహారీ ఉద్యమాన్ని బలపరచవలసి ఉంటుంది. కాని ఇవ్వాళ సిపిఐ, సిపిఎంలు, ముఖ్యంగా సిపిఎం ఈ స్వయంప్రతిపత్తి, స్వయం నిర్ణయాధికార పోరాటాలను వ్యతిరేకించడమే కాదు రాష్ట్రాల ఏర్పాటును కూడ వ్యతిరేకిస్తూ అఖండ భారత్‌ను బలపరుస్తున్నది. మరొకవైపు అసమ అభివృద్ధి సామ్రాజ్యవాద

లక్షణమనే అంశాన్ని గమనంలోకి తీసుకోకుండా బ్రిటిషిండియాలోని ఆంధ్రప్రాంతం, ఫ్యూడల్ నిరంకుశ రాజరిక పరిపాలన కింద తెలంగాణ రెండువందల ఏళ్ల వేరువేరు పాలనల తర్వాత విలీనం కావడంలో ఉన్న రాజకీయార్థిక మాత్రమే కాకుండా భాషా, సాంస్కృతిక, మానసిక విషయాలను కూడ గణనలోకి తీసుకోకుండా యాంత్రికంగా భాషా జాతుల సిద్ధాంతాన్ని అన్వయిస్తూ ఏభై ఏళ్లుగా రగులుతూ కొనసాగుతూ ఉన్న ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమాన్ని వ్యతిరేకిస్తున్నాయి. ఇందులోను సిపిఐ ఎం, న్యూడెమొక్రసీ తీవ్రంగాను, (సిపిఐ మావోయిస్టు, సిపిఐ ఎంఎల్ జనశక్తి, భారత సంయుక్త రాష్ట్రాల శ్రామిక బహుజన విముక్తి పార్టీ మినహా) మిగతా అన్ని కమ్యూనిస్టు పార్టీలు ఏదో మేరకు వ్యతిరేకిస్తున్నాయి. ఇప్పటి సిపిఐ మావోయిస్టు శ్రీకాకుళ పోరాటకాలంనుంచి కూడ కొండపల్లి సీతారామయ్య, కె.జి.సత్యమూర్తి నాయకత్వంలో ప్రత్యేక తెలంగాణ డిమాండును 1968 ఉద్యమకాలంనుంచి కూడ బలపరుస్తూనే ఉన్నది. కె.జి.సత్యమూర్తి ఎన్ని పార్టీలు మారినా, వ్యక్తిగతంగా కూడ ప్రత్యేక తెలంగాణ ఉద్యమాన్ని బలపరుస్తున్నాడు.

భాషాజాతుల రాష్ట్ర భావనకు ఒక సైద్ధాంతిక, చారిత్రక అవగాహన ఉన్నదని, లెనిన్, స్టాలిన్‌ల ఆ అవగాహన, ఆచరణలే నెహ్రూను 1936 నాటికే ప్రభావితం చేసాయని చెప్పడానికే ఇంత వివరణ. అట్లాగే ఈనాడు ఆంధ్రప్రదేశ్ భావనకు కమ్యూనిస్టుల 'విశాలాంధ్రలో ప్రజారాజ్యం' భావనే ఒక ఆదర్శప్రాయమైన ఉద్యమ ప్రాతిపదిక అని, ఇవ్వాళ ప్రజారాజ్యం లుప్తమై అది విశాలాంధ్ర కూడ అనిపించుకోకుండా కేంద్ర దళారీలు పిలిచే భాషలో రాష్ట్ర దళారీలతో స్వర్ణోత్సవాలను జరుపుకుంటున్నదని విప్లవకారులు విశ్లేషించే అవకాశం ఉన్నది.

ఈమాత్రం నేపథ్యం నుంచి చూస్తే పొట్టి శ్రీరాములు ఆమరణ నిరాహారదీక్ష మద్రాను ప్రావిన్సునుంచి ఆంధ్ర ప్రాంతం విడిపోవడానికి మాత్రమే. ఆ నిరాహార దీక్షను మద్రాసు ప్రావిన్సు అంతటా బలపరచిన కమ్యూనిస్టు పార్టీకి, ఇతరులకు విశాలాంధ్ర లక్ష్యం ఉండొచ్చు. ఉన్నది. అట్లాగే ఇతర మధ్యతరగతి మేధావులకు, ప్రజాస్వామ్యవాదులకూ ఉండవచ్చు.

ఇటు ఆంధ్రమహాసభ కమ్యూనిస్టుల ప్రభావంలోకి పోయిందని విడిపోయి పోటీ ఆంధ్రమహాసభ పెట్టిన మందుముల నరసింగరావు మొదలుకొని ఎవరూ అఖిలాంధ్ర గురించి మాట్లాడిన వాళ్లుకాదు. ఒక్క బూర్గుల రామకృష్ణారావు పోలీసు చర్య తర్వాత ఏర్పడిన హైదరాబాదు రాష్ట్రంలో మొదటి సార్వత్రిక ఎన్నికలయ్యాక ముఖ్యమంత్రిగా అఖిలాంధ్ర భావనను బలపరచడం మొదలు పెట్టాడు. తెలంగాణలో కమ్యూనిస్టుల ప్రభావానికి, కాంగ్రెస్ పార్టీలో రెడ్డి నాయకత్వ ప్రాబల్యానికి వెరచి రాజకీయ కారణాలైతే, స్వయంగా భాషాసాహిత్యవేత్త కావడం వల్ల భావనా స్థాయిలో బలపరచక తప్పలేదు. చరిత్ర, సాహిత్యం నుంచి వచ్చిన అందరిదీ ఆనాడు అదే వైఖరి.

జరుగుతున్న స్వర్ణోత్సవాలలో చరిత్ర విస్మరణగానీ, వక్రీకరణ గానీ ఎలా జరుగుతున్నాయో ఒకటొక్కటిగా పరిశీలిద్దాం.

1. ఇప్పటి ఆంధ్రప్రదేశ్ కన్నా సువిశాలమైన తెలుగునేలను ఏలిన సామ్రాజ్యాలకు తెలంగాణ నుంచే రాజధాని, పరిపాలన నడిచాయి. శాలివాహనులకు ఇప్పటి కరీంనగర్ జిల్లాలోని ఎలిగందల, కాకతీయులకు ఓరుగల్లు, గోల్కొండ రాజులకు గోల్కొండ, తర్వాత అసఫ్‌జాహీ వంశానికి హైదరాబాదు. కాకతీయుల తర్వాత రెడ్డిరాజులకు నల్లగొండ జిల్లాలోని రాచకొండ. వీరిలో శాతవాహనులకు అమరావతి, ఘంటశాలలు, రెడ్డిరాజుల కొండవీడు, రాజమహేంద్రవరం, వెలమరాజులకు వేంగి, విజయనగరం వంటి రాజధానులు ఉండవచ్చు గానీ ఆంధ్రప్రాంతంలో రాజధానులు కలిగి ఉన్న రాజులెవ్వరూ శాతవాహనులు తప్ప విశాలమైన తెలుగునేలను (తెలంగాణను) పరిపాలించిన రాజులు కారు. చోళులు, చాళుక్యులు, పల్లవులయితే తమిళ రాజులు లేదా ఆ సంబంధాలనుంచి వచ్చిన వాళ్లు. కోస్తా తీరంలో ఉన్న ప్రతి గ్రామము, ప్రతి వంశనామమూ కాకతీయుల, రెడ్డిరాజుల కాలంలో తెలంగాణ నుంచి వెళ్లిన పరిపాలన, సంస్కృతి ఫలితాలనే అర్థం చేసుకుంటే - ముఖ్యంగా సాహిత్య వేత్తల ఇంటిపేర్ల వెలుగుతో చదివితే ఎక్కడినుంచి కృష్ణా, గోదావరి నదులతో పాటే సంస్కృతి ప్రవహించిందో అర్థమవుతుంది.

నోరి నరసింహశాస్త్రి తిక్కన కాలం గురించి రాసిన 'రుద్రమదేవి' నవలలో మనుమసిద్ధి రాజ్యంలో కరణాలుగా పనిచేసే విశ్వబ్రాహ్మలు నమ్మె చేస్తే తెలంగాణ నుంచి గణపతిదేవుడు కరణాలను పంపించాడని రాస్తాడు. మనుమసిద్ధి రాజ్యాన్ని తిక్కన కోరికపై గణపతిదేవుడే నిలబెట్టాడనేదయితే అందరికీ తెలిసిన చరిత్రే. కందుకూరు, చిలకమర్రి, చిలకమర్తి, దేవులపల్లి, దేవరకొండ, రాచకొండ ఈ గ్రామాలన్నీ నల్లగొండ జిల్లాలోనివే. (ఒక్క రాచకొండ విశ్వనాథ శాస్త్రి మాత్రం తన పూర్వీకులది రాచకొండ అని భావావేశంతో ప్రకటించడమే కాకుండా ఆ మట్టిని స్పృశించాలనే కోరికతోనే నల్లగొండ సాహిత్యాభిమానుల ఆహ్వానాన్ని మన్నించి వచ్చి ఆ ఊరికి వెళ్లి చూసి తన్మయుడయ్యాడు.)

బ్రిటిష్ ఇండియాతో సంబంధం లేకుండా గ్రామ స్థాయి రెవెన్యూ వ్యవస్థను గోల్కొండ ప్రభువుల కాలంలో రూపొందించిన మహామంత్రులు అక్కన్న, మాదన్నలు. మహామంత్రుల ప్రస్తావన వచ్చింది గనుక, యుగంధరుడైనా విద్యారణ్యులయినా కాకతీయుల అస్థానంలో వాళ్లే. శ్రీకృష్ణదేవరాయలు హంపీ విజయనగరం రాజధానిగా సువిశాల తెలుగు ప్రాంతాన్ని ఏలిన కన్నడ ప్రభువు. ఆయన మహామంత్రి తిమ్మరుసు. అది వేరే కథ.

రెండు వేల సంవత్సరాలు, మరీ ముఖ్యంగా కాకతీయులు, రెడ్డి రాజులు మొదలుకొని అసఫ్‌జాహీ పాలన వరకు నాలుగు వందల ఏళ్లకు పైచిలుకు, బ్రిటిష్ ఇండియాలో ఆంధ్ర, రాయలసీమలు కలిసేదాకా పరిపాలన, చరిత్ర, సంస్కృతి,

సాహిత్యం, భాష - తెలంగాణ కేంద్రంగా వ్యాపించాయని ఆంధ్రప్రదేశ్ స్వర్ణోత్సవాలు గుర్తు చేసుకుంటున్నాయా?

అసలు తెలుగు జాతి ఒకటైన భాషా సాంస్కృతిక భావ స్ఫూర్తినుంచి ఈ స్వర్ణోత్సవాలు జరుపుకుంటున్నామా - రాజకీయార్థిక ప్రాబల్యంనుంచా?

ఆంధ్రప్రదేశ్ అనే పేరును అంగీకరించడంలోనే తెలుగుభాషా సంస్కృతుల ప్రతిపత్తిని మనం కోల్పోయాం. ఇది హిందీమాట. నెహ్రూ పెట్టిన పేరు. తెలుగు అజంత భాష. విశాలాంధ్రలో పాలకులకు కమ్యూనిస్టు భావన కనిపించింది. ఆదిరాజు వీరభద్రరావు చారిత్రక ఆధారంతో చెప్పిన తెలంగాణ పాలకులకు ప్రత్యేక తెలంగాణ నీడ భయాన్ని పెట్టింది. (తెలుగుదేశం పార్టీ పాలనలో శాసనసభలో తెలంగాణ అనే మాట వాడొద్దని సభాపతి, ముఖ్యమంత్రి శాసించారు. ఈ స్వర్ణోత్సవాలు ప్రారంభమయ్యాకనే ఒక చోట వై ఎస్ ఆర్ తెలంగాణ అనొద్దు - వెనుకబడిన ప్రాంతాలు అనండి అని అసహనం చూపాడు. స్వర్ణోత్సవాల్లో చరిత్ర విస్మరించబడిందనడానికి ఇంతకన్నా దాఖలా కావాలా?) తెలుగుదేశం కేంద్రం ఒప్పుకునేదికాదు - భారతదేశంలో మరొక దేశం ఉండడానికి వీలు లేదు గనుక - ఇప్పుడయితే అది పార్టీ పేరు అయి తొమ్మిదిన్నర సంవత్సరాల చంద్రబాబు పాలన తర్వాత పీడకలగా మిగిలింది. తెలుగునాడు తమిళనాడు వలె అనిపిస్తుందేమో గానీ దక్షిణాదిలో ఏర్పడిన భాషా రాష్ట్రాలన్నీ క్రమంగా తమ ప్రాచీన చరిత్రను, సంస్కృతిని, భాషను గుర్తు చేసుకొనే పేర్లలోకి మారిపోయాయి. తమిళనాడు, కర్ణాటక, కేరళగా ఏర్పడిన ట్రివాన్కూర్-కొచ్చిన్ సంస్థానాలు (మద్రాసు ప్రావిన్సునుంచివిడివడిన ప్రాంతాలు, మైసూరు రాష్ట్రంనుంచి విడివడిన ప్రాంతాలు) ఇప్పుడు అందమైన మలయాళం పేరుతో (సంస్కృతమణి ప్రవాళ భాషలో) కేరళం అని పిలుచుకుంటున్నాయి. పోర్చుగీసు వాసన వదులుకోని కొంకణి గోవాగ మిగిలిపోయినట్లు, ఎరువు తెచ్చుకున్న శకారాంత హిందీనామంతో ఇవ్వాళ మనం ఆంధ్రప్రదేశ్ స్వర్ణోత్సవాలు జరుపుకుంటున్నాం.

2. ఆంధ్రప్రదేశ్ స్వర్ణోత్సవాల్లో అందరికన్నా అగ్రతాంబూలం పొట్టి శ్రీరాములుకు లభిస్తున్నది. ఆత్మత్యాగం చేసిన అమరజీవికి ఆయన ఖ్యాతి దక్కవలసిందే గానీ అది ఆంధ్ర రాష్ట్ర సందర్భంలో - ఆంధ్రప్రదేశ్ సందర్భంలో కాదు. మనకు ఇష్టం ఉన్నా లేకున్నా ఆ కీర్తి దక్కవలసిన వాళ్లు - అది చారిత్రకంగా తప్పు నిర్ణయమా, సరియైందా అన్న దానితో సంబంధం లేకుండా చూసినప్పుడు పుచ్చలపల్లి సుందరయ్య, రావి నారాయణరెడ్డిల నాయకత్వంలో కమ్యూనిస్టు పార్టీ, వావిలాల గోపాలకృష్ణయ్య, ముఖ్యమంత్రిగా ఈ నిర్ణయంపై సంతకం చేసిన బూర్గుల రామకృష్ణారావు. భాషా, సాహిత్య, సాంస్కృతిక ప్రభావాలరీత్యా చూస్తే శ్రీశ్రీ, కాళోజీ, దాశరథి, అరసం, అఖిలాంధ్ర రచయితల సంఘంగా మారిన తెలంగాణ రచయితల సంఘం, రావి నారాయణరెడ్డితో పాటు వీరతెలంగాణనే కాని వేరు తెలంగాణను బలపరచని సినారె, పి.వి. నరసింహారావులు. నీలం సంజీవరెడ్డిని, ఆంధ్ర ప్రాంత నాయకులను ఎలాగూ తలచుకుంటూనే ఉన్నారు. అయితే ఆంధ్ర రాష్ట్రం ఏర్పడడంలోనే రాయలసీమ ప్రజలకు భయాలు అనుమానాలు పొటమరించాయి. అందుకే శ్రీబాగ్ ఒడంబడిక. అందుకే కర్నూలు రాజధాని. కర్నూలు రాజధాని అయినా, ఆంధ్ర రాష్ట్రమైనా ఒక మధ్యంతర ఏర్పాటే అని, ఎట్లాగూ భాషా రాష్ట్రాలు ఏర్పడి, ఆంధ్రప్రదేశ్ ఏర్పడి హైదరాబాదు అప్పనంగ అందివచ్చే రాజధాని అవుతుందని ఆంధ్ర పాలక వర్గాలకు తెలుసు. అందుకే కర్నూలులో 1953 నుంచి 56 దాకా నిండా మూడేళ్లు రాష్ట్రం ఉన్నా విశ్వవిద్యాలయం లేదు, హైకోర్టు లేదు, విమానాశ్రయం లేదు, సచివాలయం మొదలైన వాటికి పక్కాభవనాలు లేవు. టంగుటూరి ప్రకాశం ఒక తాత్కాలిక ఏర్పాటు, కర్నూలు ఒక తాత్కాలిక ఏర్పాటు, ఆంధ్ర రాష్ట్రమే ఒక తాత్కాలిక ఏర్పాటు - సుస్థిర స్థానానికి పాలకవర్గాలకు ఒక మెట్టు.

కనుక ఆ మెట్టుగా ఉపయోగపడినందుకా ఇంతగా పొట్టి శ్రీరాములు స్మరణ. ఆయన ఇవ్వాళ ఆంధ్ర రాష్ట్రానికి పరిమితమైన, నెల్లూరులో సంస్మరించుకోదగిన నాయకుడు కాదు. హైదరాబాదులో నడిబొడ్డున సచివాలయం ముందు ఆయన విగ్రహం ఉంటుంది. తెలుగు విశ్వవిద్యాలయం ఆయన పేరు మీద ఉంటుంది. మాడపాటి హనుమంతరావు, ఆదిరాజు వీరభద్రరావు, సురవరం ప్రతాపరెడ్డి, బూర్గుల రామకృష్ణారావు, పుచ్చలపల్లి సుందరయ్య, వావిలాల గోపాలకృష్ణయ్యల కన్నా అఖిలాంధ్ర భావనకు పొట్టి శ్రీరాములు ఎట్లా ప్రతీక అవుతాడో కొంచెం నిరపేక్షగా (ఆబ్జెక్టివ్‌గా) ఆలోచించండి.

ఇది ఒక చోట మాత్రమే కనిపిస్తున్న వివక్షకాదు - గ్రంథాలయోద్యమం ప్రారంభమైంది తెలంగాణలో కొమర్రాజు లక్ష్మణరావు, ఆదిరాజు వీరభద్రరావు, అకినేపల్లి జానకిరామారావులతో - కృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం, శబ్దానుశాసనాంధ్ర, రాజరాజనరేంద్ర భాషానిలయాలతో. (పాపం, అనాడు ఆంధ్ర ప్రాంతంనుంచి లేదా మహారాష్ట్ర నుంచి వచ్చి ఇక్కడ నిజాం వ్యతిరేక తెలుగు ఆత్మాభిమానంతో ఆంధ్రోద్యమం తెచ్చిన వాళ్లకు తెలంగాణ పట్ల వివక్ష లేకపోవడమే కాదు వాళ్ల కార్యరంగమే తెలంగాణ అయింది. గ్రంథాలయోద్యమం తలచుకున్నది రాజరాజనరేంద్ర, కృష్ణదేవరాయలను, నన్నయ్యలనే). అటు ఆంధ్ర ప్రాంతంలో గాడిచర్ల హరిసర్వోత్తమరావు వంటి వాళ్లు జాతీయోద్యమకాలంలో గ్రంథాలయోద్యమం నిర్వహించారు. కాని హైదరాబాదులోని కేంద్ర గ్రంథాలయంలో (అశోక్‌నగర్, చిక్కడపల్లి) విశ్వనాథ సత్యనారాయణ విగ్రహం పెడతారు. విశ్వనాథ సాహిత్య సమావేశ స్థలం ఏర్పాటు చేస్తారు. కాలికి బలపం కట్టుకుని దేశోద్ధారక గ్రంథమాల పేరు పెట్టుకొని చరిత్ర, సాహిత్య ప్రచారానికి పూనుకున్న వట్టికోట ఆళ్వారుస్వామి కూడ గుర్తురాదు.

ఉస్మానియా విశ్వవిద్యాలయం పేరు, సాలార్జంగ్ మ్యూజియం పేరు మింగలేక మిగిల్చిన పేర్లుగా కనిపిస్తున్నాయి.

3. ఈ స్వర్ణోత్సవాలు నిర్వహిస్తున్న వారికి - బ్రిటిష్ ఇండియా కాలంలోనే వాళ్లకు విశ్వాస పాత్రుడైన స్నేహితుడుగా ఉంటూనే మీర్ ఉస్మాన్ అలీఖాన్ విశ్వవిద్యాలయ, ఉన్నత న్యాయస్థాన, సచివాలయ స్థాయిలో ఒక ప్రాంతీయ భాషను అధికార భాష చేసాడని తెలుసా? అది ఉర్దూ. పాలకవర్గ ప్రయోజనమే అనుకుంటే పర్షియా భాషను, అరబిక్ భాషను చేసి ఉండవచ్చు. ఇంగ్లీషు వాళ్ల మెప్పుకోసం ఇంగ్లీషునే చేసి ఉండవచ్చు. ఉస్మానియా యునివర్సిటీని, హైకోర్టును ఏర్పాటు చేసాడు. ఏభై ఏళ్లయినా తెలుగు, ఉర్దూలను అధికార భాషలుగా గుర్తిస్తున్నా మనకివ్వాల్టికీ విశ్వవిద్యాలయ, ఉన్నత న్యాయస్థాన స్థాయిలో ఇంగ్లీషే మాధ్యమంగా ఉంది. ఆ మాటకొస్తే న్యాయస్థానాల్లోనైతే జిల్లా స్థాయిలో కూడ ఇంగ్లీషే మాధ్యమం. మండలస్థాయి న్యాయస్థానాలుకూడ తెలుగులో తీర్పు చెప్తున్నట్లు లేదు. మరొక వైపు హైకోర్టు స్వర్ణోత్సవాలు జరుపుకుంటున్నది. ఇవి హైకోర్టు స్వర్ణోత్సవాలు కావు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు స్వర్ణోత్సవాలు. ముందే చెప్పినట్లుగా అప్పనంగా అందివచ్చిన హైదరాబాదు రాష్ట్ర హైకోర్టు 1956లో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అయింది. కాని ఉర్దూ స్థానంలో అక్కడ తెలుగు రాలేదు. ఎందుకు రాలేదు? మరింత గర్వంతో జరుపుకుంటున్న స్వర్ణోత్సవాల్లో ప్రధాన న్యాయమూర్తులు, ముఖ్యంగా అడ్వొకేట్ జనరల్‌లు అందరూ ఆంధ్ర ప్రాంతం వాళ్లే కదా. తెలంగాణేతరులే కదా. తెలంగాణ వాళ్లకంటే తెలుగు రాదాయే. ఆంధ్ర భాషాభిమానం లేదాయే. ఉర్దూ భాషా దాసులయిరి. మరి ఈ ఆంధ్ర న్యాయం హైకోర్టులో తెలుగును ఎందుకు ప్రవేశపెట్టలేక పోయింది?

4. ముఖ్యమంత్రి వై ఎస్ రాజశేఖరరెడ్డి ఢిల్లీ ఆంధ్రభవన్‌లో జరిగిన స్వర్ణోత్సవాల్లో మాత్రం తెలంగాణలో ఆంధ్రమహాసభను ప్రస్తావించాడు గానీ రాష్ట్రంలో ఆయన గానీ, ఆయన నాయకత్వంలోని ప్రభుత్వంగానీ, మీడియాగానీ ఆంధ్రమహాసభ, రావి నారాయణరెడ్డి, మఖ్దూమ్ మొహియొద్దీన్‌ల నాయకత్వంలోని కమ్యూనిస్టు పార్టీ పాత్రను ప్రస్తావించడంలేదు.

ఈ వివక్ష ఎంత దూరం పోయిందంటే శ్రీశ్రీ "ఆంధ్ర రాష్ట్ర ఆగమనం / అసత్యం కాజాలని చారిత్రక వాగ్దానం / మన చరిత్రాత్మక నిరంతరాందోళన / చరితార్థమయిందీనాడు" అని ఆంధ్ర రాష్ట్రం ఏర్పడినపుడు రాసిన కవితను ప్రస్తావించిన మీడియా అదే శ్రీశ్రీ "ఏర్పడింది మంత్రివర్గ / మేడు తలల పాం / నిలవనీడలేని చోట / నేల విడిచి సాం" అని రాసిన 'ఫస్టాబర్' అనే వ్యంగ్య కవితను, 'ప్రాసక్రీడ'లో ఇంకెన్నో ఇటువంటి వ్యంగ్యాస్త్రాలను ఉద్దేశపూర్వకంగానే వదిలేసింది.

అది అలా ఉంచి శ్రీశ్రీతో పాటు, శ్రీశ్రీ కన్నా ఎక్కువగా అఖిలాంధ్ర ఏర్పడాలని ఉద్యమించిన కాళోజీని ఆయన 1968 నుంచి ప్రత్యేక తెలంగాణ వాది అయ్యాడు గనుక ప్రభుత్వమూ, మీడియా ఈ స్వర్ణోత్సవాల కాలంలో నిషేధించినట్లున్నది.

కాళోజీ 'నా గొడవ' మొదటి భాగంలో అకారం నరసింగం గుడిలో విశాలాంధ్ర తీర్మానం చేసే సభకు శ్రీశ్రీని తీసుకొని పోవడానికి హనుమకొండ నుంచి వరంగల్ దాకా తాను నాన్‌ముల్కీ గోబ్యాక్ వాదుల నుంచి ఎటువంటి నిరసన ఎదుర్కోవాల్సి వచ్చిందో, నిరసనకారులు రాళ్లు విసురుతుంటే జట్కాలో తానెట్లా శ్రీశ్రీని జాగ్రత్తగా సభాస్థలికి చేర్చి తామిద్దరి సంతకాలతో తీర్మానం ఎట్లా తయారు చేసి ప్రకటించాడో కాళోజీ కళ్లకు కట్టినట్లు చిత్రించాడు.

'నా గొడవ'ను అలంపురం సభల్లో ఆవిష్కరిస్తూ శ్రీశ్రీ కాళోజీని నిఖిలాంధ్ర కవి అన్నాడు. అంతేకాదు అందరూ యుద్ధరంగంనుంచి పారిపోయినపుడు నిలిచి పాడి పోరాడిన ఫ్రెంచి కవి లూయీ అరగాన్ తో కాళోజీని పోల్చాడు. అయితే ఈనాటి అత్యధిక సంఖ్యాక తెలంగాణ బుద్ధి జీవులు, సాహిత్య జీవులకు భ్రమలు తొలగినట్లే, వీళ్లకన్నా చాల ముందే కాళోజీకి అఖిలాంధ్ర భ్రమ తొలగిపోయింది. కాని 'ఆంధ్రప్రదేశ్' ఏర్పడడంలో ఆయన పాత్ర గానీ, దేవులపల్లి రామానుజరావు, దాశరథిల పాత్రగానీ విస్మరించదగినవేనా? 'నా తెలంగాణ కోటి రతనాల వీణ' అన్న దాశరథియే 'ముక్కోటి ఆంధ్రులం ఒక్కటై ఉండాలి' అన్నాడు. 'మహాంధ్రోదయం' కావ్యమే రాసాడు. అఖిలాంధ్రమేర్పడాలని కోరుకున్నాడు. ఆయనకు కలిగిన విషాదమేమిటి?

ఆంధ్రప్రదేశ్ ఏర్పడినాక చెళ్లపిళ్ల వెంకటశాస్త్రి, శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రి, విశ్వనాథ సత్యనారాయణ తర్వాత (వెంగళరావు ముఖ్యమంత్రిగా ఉన్నపుడు) తెలంగాణ నుంచి ఒకేఒక్క మొట్టమొదటి ఆస్థాన కవి అయ్యాడు దాశరథి. కాని ఆ తర్వాత 1983లో ఎన్టీఆర్ ఆస్థానకవి పదవి రద్దు చేసాడు. దాశరథి హైకోర్టుకు పోతే పిఏచౌదరిగారు ప్రజాస్వామ్యంలో ఆస్థానకవి పదవి ఏమిటని ఎద్దేవా చేస్తూ కొట్టేసాడు. చివరకు 'ఈనాడు' ప్రతిరోజూ ముఖ్యమంత్రి అంజయ్య భాషను యథాతథంగా రాస్తూ అది తెలుగు కానట్లు వెక్కిరిస్తుంటే దాశరథి 'అంజయ్య మాట్లాడేదే తెలుగుభాష' అనాల్సి వచ్చింది. దాశరథి సంస్కృతాంధ్ర, ఉర్దూ పాండిత్యం ఎవరూ ప్రశ్నించలేనంత అసాధారణమైంది అయినా గజ్జల మల్లారెడ్డి 'అంజయ్య భాషే అసలు తెలుగట' అని వెక్కిరించాడు. అప్పుడు చేకూరి రామారావు వంటి భాషా శాస్త్రవేత్త అంజయ్యదీ తెలుగే, దాశరథి, గజ్జల మల్లారెడ్డిదీ తెలుగే అని జోక్యం చేసుకోవాల్సి వచ్చింది.

కాని మళ్లీ ఈ భాషా శాస్త్రవేత్తకు కాళోజీ, తెలుగు పట్ల ఆయన తెలంగాణవాదంపట్ల చిన్నచూపు. ఆయన మాతృభాష తెలుగా, మరాఠీయా అన్నంత వివక్ష.

భాషా సాహిత్యాల విషయంలో తెలుగు భాషను అధికార భాష చేయాలని ఏర్పడిన సంఘాలు, కాపాడుకోవాలని ఏర్పడిన సంఘాలు, ఆంధ్ర భాషోద్యమాలు చేపట్టిన సంఘాలు అన్నీ ఈ వివక్షతోనే కొనసాగుతున్నాయి. చివరికీసంవత్సరం ప్రతిభా పురస్కారాలు ప్రకటించిన తెలుగు విశ్వవిద్యాలయానికి కవిత్వం, కథ, నవల, నాటక ప్రక్రియల్లో తెలంగాణ నుంచి రచయితలే కనిపించలేదు.

5. ఆంధ్రప్రదేశ్ స్వర్ణోత్సవాలలో వివక్షకు గురవుతున్న వాళ్లలో స్త్రీలు, దళితులు, ముస్లింలు ఉన్నారు. దుర్గాబాయి దేశ్‌ముఖ్ గానీ (మద్రాసులో కూడ 1930ల నాటికే ఆంధ్ర పతాకను ఎగురవేసిన ధీశాలి), గొప్ప సంఘసేవకురాలు, డాక్టరు, సాహిత్యవేత్త అచ్చమాంబగానీ, అటువైపు సంగెం లక్ష్మీబాయి, ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ, సూర్యదేవర రాజ్యలక్ష్మి (ఈమె తెలుగుదేశం అని పత్రిక కూడ నడిపింది) వంటి వాళ్లు ఇటువైపు గుర్తుకు రాలేదు. ఇంక కమ్యూనిస్టు పార్టీలోని వీరనారుల గురించి చెప్పనక్కర్లేదు - పాలకుర్తి ఐలమ్మ మొదలు మల్లు స్వరాజ్యం వరకు. స్త్రీల విస్మరణ గురించి కొండవీటి సత్యవతి న్యాయమైన ఆగ్రహంతోనే గుర్తు చేసారు.

కమ్యూనిస్టు పార్టీ నాయకులుగా మగ్దూం మొహియుద్దీన్, రాజ బహదూర్ గౌర్‌లు అలా ఉంచి కులీకుతుబ్‌షా ప్రభువు తెలుగు సాహిత్యానికి, సంస్కృతికి చేసిన సేవలు, మతసామరస్యానికి చేసిన కృషి, కళారాధనలు స్వర్ణోత్సవాలు స్మరించుకోవాల్సిన అంశాలు కావా? అవి తెలుగుజాతి వికాసానికి తోడ్పడలేదా? భాగ్యరెడ్డి వర్మ మొదలు ఎందరో దళిత నాయకులు, సంఘసంస్కర్తలు, సాహిత్యవేత్తలు, కళాకారులు, తెలుగు సంస్కృతి వికాసానికి చేసిన సేవలు కనీసం ప్రస్తావనకైనా వస్తున్నాయా? ఇంక ఆదివాసుల గురించయితే వాళ్లు దేశపటంలో ఉన్న స్పృహనే ఉండదు. విశాఖ మన్నెంలో విష జ్వరాలతో వేలాదిమంది చనిపోయిన వాస్తవాలు ఇంకా చేదుగా మిగిలి ఉండగానే ఈ స్వర్ణోత్సవాలు జరుగుతున్నాయి. అక్కడ గున్నమ్మ మొదలు, గోదావరి ఏజెన్సీలో ద్వారబంధాల చంద్రయ్య దాకా తలచింది లేదు. అల్లూరి సీతారామరాజును తలచుకుంటారుగానీ నిజాం విముక్తి సాయుధ పోరాటం నిర్వహించిన కొమురంభీం మాత్రం గుర్తుకురాడు. వాస్తవానికి రాజ్యాంగం ఐదవ షెడ్యూలులో చేర్చిన ఆదివాసులకు స్వయంప్రతిపత్తి మొదలు స్వరాష్ట్రం ఏర్పరచుకునే వరకు ఉన్న హక్కును గుర్తించడం ప్రతి ప్రజాస్వామ్యవాది కర్తవ్యం. కాని ఆదివాసుల గ్రామాలు 300 దాకా మునిగిపోయి అమెరికాలోని రెడ్ ఇండియన్ల వలె ఆదివాసుల జాతి, సంస్కృతి అంతరించే పోలవరం ప్రాజెక్టును డెల్టా సంపన్నుల ప్రయోజనం కోసం, విశాఖ-కాకినాడ పారిశ్రామిక కారిడార్ ప్రయోజనం కొరకు చేపట్టడమే అసలు స్వర్ణోత్సవాలు జరుపుకుంటున్న పాలక వర్గాల స్వార్థప్రయోజనం.

6. తెలంగాణలోనే ఆంధ్ర మహాసభతో ప్రారంభమై వికసించిన విముక్తి ఉద్యమం నక్సల్బరీ, శ్రీకాకుళాల తర్వాత మళ్లీ జగిత్యాల, సిరిసిల్ల విప్లవోద్యమాలతోనే తెలంగాణను రాజకీయ, సాహిత్య, కళ, సాంస్కృతిక కేంద్రంగా మలచింది. ఈ విప్లవోద్యమానికి, రాజకీయ, సాంస్కృతిక రంగాల్లో నాయకత్వం ఇస్తున్న తెలంగాణయే విస్మృతికి గురికావడం అసంకల్పితంగా జరుగుతున్న పనికాదు. ఉద్దేశపూర్వకంగానో, కుట్రపూరితంగానో జరుగుతున్నదే. ఎందుకంటే ప్రాచీన సాహిత్యం గురించి మాట్లాడినపుడు కూడ మార్గ పద్ధతిలో ఉన్న కవుల ప్రస్తావన వచ్చినంతగా, దేశి సంస్కృతి గురించి, ప్రత్యామ్నాయ సాహిత్యోద్యమాన్ని చేపట్టిన పాల్కురికి సోమనాథుని ప్రస్తావన రానేరాదు. పండితారాధ్య చరిత్రము, బసవపురాణం రాసిన పాల్కురికి సోమనాథుడు పాలకులకు 'తెలంగాణ కవే'. ప్రజాకవి మొదలు పద్మవిభూషణ వరకు ప్రజలనుంచి, కేంద్ర ప్రభుత్వంనుంచి గుర్తింపు పొందినా స్వర్ణోత్సవ పాలకులకు కాళోజీ నిషిద్ధ కవియే, నిన్న విశాలాంధ్ర కోసం పోరాడిన అఖిలాంధ్ర కవి అయినప్పటికీ.

నిషేధం ప్రస్తావన వచ్చింది గనుక ఒక పోలిక గుర్తుకు వచ్చింది. 1975లో ముఖ్యమంత్రిగా ఉన్న జలగం వెంగళరావు హైదరాబాదులో ప్రపంచ తెలుగు మహాసభలు జరిపాడు, చాల ఆర్భాటంగా. ఆయన ఏనుగు అంబారీపై నగరంలో ఊరేగుతుంటే అప్పటి సాంస్కృతిక శాఖ కార్యదర్శి రాజ్యంసిన్హా పైన హెలికాప్టర్ నుంచి ఆయనపై పూలజల్లులు కురిపించింది. అయితే అప్పటికే 1974 మేలో ఆరుగురు విప్లవ రచయితలపై సికిందరాబాదు కుట్రకేసు పెట్టి జైల్లో పెట్టారు. కనుక ప్రపంచ తెలుగు సభల ముందు శ్రీశ్రీ నాయకత్వంలో బయట ఉన్న విప్లవ రచయితలు ఎంటి ఖాన్, చెరబండరాజు, కాశీపతి, లోచన్ మొదలైన 11 మంది నిరసన ప్రదర్శన జరిపితే అరెస్టు చేసి బొల్లారం పోలీసు స్టేషన్‌లో ముప్పై ఆరు గంటలు నిర్బంధించారు.

ఇపుడీ స్వర్ణోత్సవాలకు ఆరువారాల ముందు విరసంను నిషేధించి విరసం సంస్థాపక కార్యవర్గ సభ్యుడు వరవరరావును, విరసం ప్రస్తుత అధ్యక్షుడు కళ్యాణరావును ప్రజా భద్రతా చట్టం కింద అరెస్టు చేయడమే కాకుండా ఎనిమిది అక్రమ కేసుల్లో ఇరికించి స్వర్ణోత్సవాలనాటికి బెయిలుపై కూడ బయటికి రాకుండా జాగ్రత్త పడ్డారు. విరసం తెలుగు సాహిత్య సాంస్కృతిక సంఘమే. ఆంధ్రప్రదేశ్ పరిధిలో పనిచేసేది. చంద్రబాబు చరిత్రను తిరస్కరిస్తే, రాజశేఖరరెడ్డి చరిత్రతోపాటు సాహిత్యాన్ని కూడ నిరాకరించి నిషేధ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ స్వర్ణోత్సవాలు జరుపుతున్నాడు.

పోతిరెడ్డిపాడు వివాదం గురించి రాస్తూ డాక్టర్ ఎంవి రమణారెడ్డి ఒక వ్యాసంలో తెలంగాణలో గోదావరి జానెడు దూరం ప్రవహించదుకానీ అంతా తెలంగాణలోనే ప్రవహించినట్లు హక్కులడుగుతున్నారు అని రాసాడు. (నిజానికి గోదావరి ఉత్తర తెలంగాణ జిల్లాలన్నింటా అంటే ఆదిలాబాదు, నిజామాబాదు, కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాలన్నిటి గుండా ప్రవహిస్తుంది.) అట్లే నదుల పరీవాహక ప్రాంతం అని హక్కు అడగడం అర్థరహితం అని మరో వ్యాసంలో రాసాడు. శ్రీశైలం రాయలసీమ-కోస్తా జిల్లాల సరిహద్దులో ఉందన్నాడు.

భూగోళాన్ని కూడ మార్చేస్తున్న విద్యావంతుల ఈ కొత్త సిద్ధాంతాలను కూడ చూస్తుంటే ఈ స్వర్ణోత్సవాల కాలంలో చరిత్ర విస్మరణ, వివక్ష అంత ఆవేదన చెందాల్సిన విషయాలు కావేమోనని, గుండె చెరువు చేసుకోవడం కన్నా గుండె రాయి చేసుకోవడమే మంచిదేమోనని అనిపిస్తున్నది.

❑

ఆంధ్రప్రదేశ్ - మహిళల స్థితిగతులు

సి. ఉమాదేవి

మానవ పరిణామక్రమంలో మార్పు అనివార్యం. మార్పు అందించిన సత్ఫలితంగా ప్రగతిబావుటా నెగురవేయగలగడం మనిషి శ్రమకు నజరానా. మానవుడు అంచెలంచెలుగా ఎదిగిన వైనం తెలుసుకోవాలంటే మనిషి చరిత్రే ఆధారం. అయితే ఏ వ్యవస్థ గురించి తెలియాలన్నా, మానవ జీవనశైలి అవగత మవాలన్నా ఆకాశంలో సగం అని చెప్పబడే స్త్రీల స్థితిగతులను వివరించనిదే సంపూర్ణత సంతరించుకోదు. స్వర్ణోత్సవాలు జరుపుకుంటున్న ఆంధ్రప్రదేశ్‌లో సామాజిక, ఆర్థిక, రాజకీయ తదితర రంగాలలో మహిళాభివృద్ధి ఏ మేరకు జరిగిందో పరికించాలి. అయితే ఒక్క మాటలో చెప్పాలంటే ఏ కోణంలో పరిశీలించినా ఒక అడుగు ముందుకేస్తే రెండడుగులు వెనుక బడుతున్న వైనం ప్రస్ఫుటమవుతోంది. మన రాష్ట్రం యాభై వసంతాలు పూర్తి చేసుకుంటున్నా తప్పని పరిస్థితి ఇది. ఇక విషయంలోకి వద్దాం.

స్త్రీ జీవన విధానంలో స్వాతంత్ర్యం వచ్చాక కూడా స్వాతంత్ర్యానికి పూర్వం వున్న పరిస్థితులకు భిన్నంగా ఏ అద్భుతం జరగలేదు. అడవులలో జంతుజాలం సైతం స్వేచ్ఛగా సంచరిస్తాయి. స్వేచ్ఛావాయువులను శ్వాసిస్తాయి. అయితే ఆడపిల్ల పుట్టుకే ఒక ప్రశ్నార్థకంగా మారసాగింది. భ్రూణహత్యలు పెరిగాయి. పురుషుల స్త్రీల నిష్పత్తిలో సమతుల్యం కొరవడి ఆందోళనకు దారితీస్తోంది. కన్యాశుల్కం స్థానే వచ్చిచేరిన వరకట్న వేధింపుల పుణ్యమా అని ఆంధ్రప్రదేశ్ ఎన్నో వరకట్న చావులను నమోదు చేసుకుంది. బ్రతకగలమా లేదా అనే బ్రతుకు భయం ఆడపిల్లతో పాటు పెరిగి పెరిగి మర్రి వృక్షంలా శాఖోపశాఖలయింది. అడుగడుగునా అవాంతరాల అంతరాయాల నడుమ ఆడ శిశువు బాల్యం వీడి ఎదగడం నేర్చుకుంది. కాని బాల్య వివాహాల బారినపడి పసిమొగ్గలు వసివాడుతున్నాయి. ప్రభుత్వం అమలు చేసే నిర్బంధవిద్య శాసనరూపేణా చక్కటి తీర్మానమైనా, ఆడపిల్లలు చదువుకునే అవకాశాన్ని తల్లిదండ్రులే తుంచేసిన వైనం ఆంధ్రప్రదేశ్‌లో విద్యాసంస్థల 'డ్రాప్ అవుట్స్' చిట్టాలు తెలుపుతున్నాయి. గణాంక వివరాలు పోల్చిచూసుకోవడానికే మిగిలాయి. పేదరికంలో మగ్గుతున్న, చదువుకోని ఆడపిల్లలు పనిపిల్లలుగా అవతారం ఎత్తారు. పట్టణ ప్రాంతాల్లో చదువుకునే బాలికల సంఖ్య పెరిగి అక్షరాస్యతలో స్వల్ప వృద్ధి కనబడసాగింది. అమ్మాయిల గొంతుకలు విచ్చుకోసాగాయి. కాని విచ్చుకునే ఆ గొంతులకు గొళ్లెం వేసే హస్తాలు పెరిగాయి. ఈవ్ టీజింగ్ వెర్రితలలు వేసి పరోక్షంగా అమ్మాయిల ఆత్మహత్యలకు కారణమయ్యాయి. అమ్మాయిలపై యాసిడ్ పూతలు, కిరోసిన్ స్నానాలు, కత్తుల కరతాళ నృత్యాలు కలవరపరుస్తూనే వున్నాయి. స్త్రీలలో అభద్రతాభావం ఇప్పటికీ పోలేదు.

అమ్మాయి కాస్తా గృహిణి అవతారం ఎత్తింది. చదువుకున్న మహిళలు ఉద్యోగాలలో ప్రవేశించారు. తరాలు మారినా, ఉద్యోగాలనాశ్రయించినా, అక్కడా తప్పని లైంగిక వేధింపులు, లైంగిక వివక్ష, మగువలను మానసికంగా, శారీరకంగా బాధిస్తున్నాయి. రాష్ట్రాభివృద్ధిలో అతివలు కూడా చేయి వేసారు. మానవవనరులు నిరర్థకం కాకుండా వినియోగింపబడిన స్త్రీల శక్తియుక్తులు రాష్ట్ర మహిళలను ఊర్ధ్వముఖంగా నిలబెట్టాయి. అయితే వేతనాలలో సమానత్వం పూర్తి స్థాయిలో అమలుకావడం లేదు. కాని సమానత్వం అంటూ 'నైట్ షిఫ్ట్'లు పెట్టడం మహిళా ఉద్యోగుల భద్రతను ప్రశ్నిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో స్త్రీలు అదిఇది అనిగాక 'ముదితల్ నేర్వగరాని విద్యకలదె ముద్దారనేర్పినన్' అన్న సూక్తిని నిజం చేస్తున్నారు. కళ్యాణకట్ట దాకా కదం తొక్కిన కాంతలు వృత్తిలో లింగవివక్షపై గాక స్త్రీలకు స్త్రీలే వుండాలి అన్న నినాదాన్ని వినిపిస్తున్నారు. పని సరళిని గమనిస్తే పట్టణ మహిళ గురించి మనం తెలుసుకునే అవకాశం ఎక్కువ. కాని వాస్తవానికి గ్రామీణ మహిళ పని పరిధి చాలా విస్తృతం.

వ్యవసాయరంగంలో, చేనేతరంగంలో, కుటీర పరిశ్రమలలో స్త్రీ భాగస్వామ్యం ఎన్నతగినది. నాట్లు వెయ్యడం, పాడి పరిశ్రమ, కోళ్ల పెంపకం, చేనేతలో, అద్దకంలో స్త్రీలు తమ చేదోడువుందని నిరూపిస్తున్నారు. అంతటా తామేనన్నట్లు ఎన్నో కుటీర పరిశ్రమలలో స్త్రీలు ఉపాధి పొందుతున్నారు. ప్రభుత్వం డ్వాక్రా గ్రూపుల ద్వారా స్త్రీల ఆర్థిక పరిస్థితికి ఊతమిచ్చింది. పురుషుడితో బాటు కుటుంబ నిర్వహణలో స్త్రీ భాగస్వామ్యం నానాటికి పెరుగుతోంది.

స్త్రీలను ప్రభావితం చేయడంలో సాహిత్యం పాత్ర చిన్నదేమీ కాదు. అరవ దశకంలో వచ్చిన మాస, పక్ష, వార పత్రికలలో మహిళా శీర్షికలు వంట-వార్పు, కుట్లు-అల్లికలు, అలంకరణ, పిల్లల పెంపకం వంటి వాటికే ప్రాధాన్యం ఇచ్చాయి. కాలక్రమేణా ప్రవేశించిన ప్రత్యేక శీర్షికలు పై అంశాలు కాక స్త్రీల సమస్యలకు సలహాలు, కెరీర్ అభివృద్ధికి సూచనలు, వ్యక్తిత్వ వికాసానికి తోడ్పాటునందించసాగాయి. రచయిత్రుల తరంగా డెబ్బయి, ఎనభైల మధ్యకాలాన్ని ఉటంకించినా మహిళా జర్నలిస్టులు మీడియారంగాన పూర్తి స్థాయిలో ప్రవేశించలేకపోయినా 1985 తరువాత కొంతవరకు తమ ఉనికిని చాటుకున్నారు.

ఇక మహిళలేర్పరచుకున్న మహిళా సంఘాల విషయానికొస్తే

వాస్తవానికి మహిళా సభకు శ్రీకారం చుట్టిన 'ఆంధ్రమహిళా సభ' స్ఫూర్తే ఎన్నో మహిళా సభల ఆవిర్భావానికి మార్గదర్శిని అని చెప్పక తప్పదు. ఆ స్ఫూర్తినందుకున్న ఎన్నో మహిళా సంఘాలు స్త్రీలలో చైతన్యాన్ని కలిగిస్తూ, అభివృద్ధికి దోహదపడుతున్నాయి. స్త్రీల ఉద్యమాలు పెరిగాయి. సారా నిషేధం మొదలుకుని గృహహింస వరకూ విషయమేదైనా గళం కలిపి గర్జిస్తున్నారు. 1975 అంతర్జాతీయ మహిళా సంవత్సరంగా ప్రకటించబడింది. రాష్ట్ర స్థాయిలో కూడా స్త్రీ విద్యపై ఒక ఉపసంఘం ఏర్పాటైంది. మహిళాలోకం తమకంటూ ఓ లోకం వుందని తెలుసుకోసాగారు. 1980 నుండి స్త్రీవాద ఉద్యమాలు వూపందుకున్నాయి. ఆందోళన దిశగా స్త్రీ శక్తి ముందుకు కదిలింది. ఆలోచనకు అంకురార్పణ జరిగింది. ఈ ఆలోచన స్త్రీలలో అవగాహన పెరగడానికి, నిద్రాణమైవున్న స్త్రీ శకం ప్రారంభానికి హేతువైంది.

1988లో స్త్రీలకు చట్టరీత్యా ఆస్తిహక్కు కల్పించబడింది. అయితే చట్టాల పట్లే అవగాహన లేని స్త్రీలు ఎలా లబ్ధి పొందగలరు? పట్టణ మహిళలు, చదువుకున్న మహిళలపై కాక మహిళా సంఘాల దృష్టి గ్రామీణ స్త్రీలు, నిరక్షరాస్యులైన మహిళలపై ప్రసరించాలి. ప్రభుత్వం, మహిళా సంఘాలు సమన్వయ ప్రణాళికలతో గ్రామీణ స్త్రీల జీవన సరళిని మెరుగుపరచాలి. మీడియా పత్రికల ద్వారా, ఛానెళ్ల ద్వారా స్త్రీలకు అవగాహనా కార్యక్రమాలు, చర్చావేదికలు నిర్వహిస్తూ రాష్ట్ర మహిళాభివృద్ధికి ఇతోధికంగా పాటుపడుతున్నా ఇంకా తగినంత ఒకళింపు స్త్రీలలో కలగడంలేదు. ఒకప్పుడు స్త్రీ రిపోర్టర్లను వేళ్లమీద లెక్కించగలిగేవారు. కాని నేటి యువతులు మేటి మహిళా రిపోర్టర్లుగా అత్యంత ప్రతిభావంతంగా తమ విధులను నిర్వహిస్తున్నారు.

1995లో బీజింగ్‌లో జరిగిన అంతర్జాతీయ మహిళా కాన్ఫరెన్స్ మహిళా సాధికారతపై దృష్టి సారించింది. ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న స్త్రీ చైతన్యం ఆంధ్రప్రదేశ్‌లో కూడా కదలికలు కలిగిస్తోంది. అయితే ఇవి చిన్నపాటి ప్రకంపనలను మాత్రమే కలిగిస్తున్నాయి. మహిళలలో పాతుకుపోయిన మూఢాచారాలను, భయాలను కూకటివేళ్లతో పెకిలించగలగాలి. కేవలం వేళ్లమీద లెక్కింపదగిన స్త్రీలు కొందరు సాధించిన విజయాలను పదే పదే పలుకుతూ, స్త్రీలు ముందుకడుగేస్తున్నారని కళ్లు విప్పార్చుకుని చూసే సగటు మహిళలు తమ జీవనసరళిని సమీక్షించుకుని ప్రభుత్వమందించిన అవకాశాలను అందుకుని తమ హక్కులను కాపాడుకునే మార్గంలో పయనించాలి. నేటి గ్రామీణ మహిళలు స్వయం సహాయక బృందాలుగా ఏర్పడి స్త్రీల ఆర్థిక స్థితి, కుటుంబ పరిస్థితులను తమకు తామే చక్కబెట్టుకునే నైపుణ్యాన్ని సంతరించుకుంటున్నారు. అత్యాచారాల నివారణ, దురాచారాల ఖండన, ప్రపంచీకరణ దుష్ఫలితాలపై నిరసన చూపగలిగితేనే స్త్రీలలో అసలైన ఎదుగుదల కనబడుతుంది. అంతేకాదు పోటీ ప్రపంచంలో పురుషుడితో సమానంగా స్త్రీ అన్ని రంగాలలో పోటీ పడాలి.

2001వ సంవత్సరం మహిళా సాధికారత సంవత్సరంగా ప్రకటించబడింది. అన్ని రంగాలలో మహిళాభివృద్ధి, ఆర్థిక, రాజకీయ రంగాలలో నిర్ణయాధికారం, ఆర్థిక, సామాజిక, రాజకీయ, సాంస్కృతిక రంగాల్లో మహిళలకు సమానహక్కులు, స్త్రీ విద్య, ఆరోగ్యం, ఉపాధి రంగాలలో అవకాశాలను కలిగించడం, మహిళా వివక్షతను రూపుమాపే దిశగా న్యాయ వ్యవస్థను బలోపేతం చేయడం వంటివి లక్ష్యాలుగా ఏర్పడ్డాయి. ఎన్నో అవకాశాలను అందించగల ఈ లక్ష్యాలు మాత్రం అన్నీ వర్ధించిన విస్తరిలా భ్రమింపజేస్తున్నాయి. మహిళలకు సమాన హక్కులు స్థానే మహిళాసాధికారత అంటూ పదేపదే వల్లెవేయడం మహిళల సంపూర్ణాభివృద్ధిని సాధించి వారిని ప్రగతిపథంలోకి నడిపించగలదా? వరకట్న నిషేధం చట్టమే, బాల్యవివాహాల రద్దు చట్టమే. ప్రతి ఒక్కరిలో ఆత్మావలోకనమనేదే లేదు. ఇక దీనికి బదులాగా అవగాహనా లోపమే కనబడుతుంటే దురాచారాలకు చరమగీతమెన్నడో ఎవరు చెప్పగలరు? వాస్తవానికి తన కుటుంబం నడుమనైనా స్త్రీకి సాధికారత వుందా? అని ప్రశ్నించుకుంటే పురుషుడి కన్న తమ స్థానం తక్కువే అని తమను తాము శృతి చేసుకునే మహిళల సంఖ్య తగ్గనంతవరకు అభివృద్ధి నత్తనడకే! సాధికారత హుళక్కే!

ప్రభుత్వం స్త్రీ సాధికారతకు మద్దతుగా గ్రామ పాలనలో స్త్రీలకు రిజర్వేషన్లు కల్పించింది. అయితే ఆచరణలో మాత్రం అధికారం తండ్రిదో, అన్నదో లేదా భర్తదో అవుతుంది. ఎన్ని పథకాలు రచింపబడ్డా అవి స్త్రీల అభివృద్ధిని రచింపలేవు. లింగ సమానత్వం అంటూ రాజ్యాంగం ప్రతిపాదించినా స్త్రీ మాత్రం లింగ వివక్షకు గురవుతూనేవుంది. అంతెందుకు 1996లోనే ప్రవేశపెట్టబడిన మహిళా రిజర్వేషను బిల్లు పొదిగే వరకేగాని గుడ్డు నుంచి పిల్ల బయటకు రావడం ఎన్నడో? ఏది ఏమైనప్పటికీ ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలలో స్త్రీలు అధికశాతం గెలవడం ఆంధ్రప్రదేశ్‌లో స్త్రీ సువర్ణాధ్యాయంగా చెప్పవచ్చు. రిజర్వేషన్లు వస్తే చాలదు. సాదాసీదా మహిళల జీవనంలో మార్పు రావాలి. ఈ మార్పు అభివృద్ధిని పెంపొందించాలి. అన్నిటికన్న ముఖ్యంగా అక్షరాస్యత పెరగాలి. ఉద్యమాల లక్ష్యం నెరవేరేదాక సన్నగిల్లకూడదు. అసభ్య ప్రకటనలకు, అశ్లీల చిత్రాలకు స్త్రీని వస్తువుగా వినిమయం చేసే వ్యవస్థ నుండి స్త్రీని వెలుపలికి తీసుకుని రావాలి. పరిపాలన, మార్కెటింగ్, ఐ.టి వంటి రంగాలలో స్త్రీల నైపుణ్యాన్ని పెంచి ప్రతిభావంతులను ప్రోత్సహించాలి.

కరణం మల్లీశ్వరి నిలిపిన వరువు, సానియా మీర్జా విజయకేతనాలు భుజాన మోస్తూ ఆనందిస్తే లాభంలేదు. మహిళల ఆలోచనల్లో మార్పు రానంతవరకు, వచ్చిన మార్పును స్వీకరించలేనంతవరకు ఎన్ని వసంతాలు గడిచినా, స్వర్ణోత్సవాలు జరుపుకున్నా ఇంతేసంగతులు.

❑

రాష్ట్ర ఆర్థికం : నాడు - నేడు

జె. శివరాం

అక్షరక్రమంలో అగ్రగామిగా వున్న ఆంధ్రప్రదేశ్ నలభై వసంతాలు పూర్తి చేసుకొని 1 నవంబరు 2005న 50వ వసంతంలోకి అడుగిడుతోంది. ఈ సందర్భంగా ప్రభుత్వపరంగానే కాక పలు సంస్థలు కూడ తమ వంతు బాధ్యతగా రాష్ట్ర అభివృద్ధి గురించి నివేదికలు విడుదల చేయనున్నాయి.

రాష్ట్రం ఈ యాభై సంవత్సరాల కాలంలో ఆర్థికంగా ఎంత వరకు పురోగతి చెందింది తెలుసుకోవాలంటే ప్రభుత్వం అధికారికంగా విడుదల చేసిన "ద్రవ్య పరిస్థితి" గురించిన గణాంకాలతో విశ్లేషించాలి.

ప్రభుత్వం ద్రవ్య పరిస్థితిని నాలుగు భాగాలుగా విభజించవచ్చును. అవి 1) కేంద్రం నుండి బదలాయింపబడే వనరులు, 2) రాష్ట్ర సొంత వనరులు, 3) ప్రజావ్యయం, 4) మిగిలివున్న ప్రజా రుణం.

కేంద్రం నుండి బదలాయింపబడే వనరులు :

కేంద్రం నుండి బదలాయింపబడే వనరులు రెండు రకాలు. అవి కేంద్ర పన్నులలో వాటా, గ్రాంట్లు, విరాళాలు. కేంద్రం నుండి లభించే పన్నుల వాటా రాష్ట్రం మొత్తం రెవెన్యూ రాబడిలో 1956-57 సంవత్సరంలో 13.1 శాతం వుండగా 1982-83వ సంవత్సరంలో 22 శాతానికి పెరిగింది. రాష్ట్రం అవతరించిన నాటి నుండి 1982-83 సంవత్సరం వరకు కాంగ్రెసు పార్టీకి పెట్టని కోటగా వుంది. 1983వ సంవత్సరంలో సినిమా ప్రపంచం నుండి నందమూరి తారక రామారావు రాజకీయ అరంగేట్రం చేసి తెలుగుదేశం పార్టీని స్థాపించి 1983వ సంవత్సరంలో బ్యాలట్ యుద్ధంలో గెలిచి రాష్ట్రంలో అధికార పగ్గాలు చేపట్టడం జరిగింది. 1983-84 సంవత్సరంలో మొత్తం రాష్ట్ర రెవెన్యూ రాబడిలో కేంద్రం నుండి లభించిన పన్నుల వాటా 20.9 శాతం వుండగా 1988-89 సంవత్సరంలో 19 శాతానికి తగ్గిపోయింది. 1989 సంవత్సరంలో రాష్ట్రంలో తిరిగి కాంగ్రెసు పార్టీ అధికార పగ్గాలు చేపట్టడం జరిగింది.

1989-90లో కేంద్ర ప్రభుత్వం నుండి లభించిన పన్నుల వాటా మొత్తం రాష్ట్ర రెవెన్యూ రాబడిలో 20.1 శాతం వుండగా 1994-95 సం॥లో 21.4 శాతం కు పెరిగింది. 1994 సంవత్సరం చివరిలో జరిగిన ఎన్నికలలో ఎన్.టి.రామారావు నాయకత్వంలో తెలుగుదేశం పార్టీ ఘనవిజయం సాధించి రాష్ట్ర అధికార పగ్గాలు 12 జనవరి 1995న చేపట్టినా ప్రతిఘాతుక విప్లవం ద్వారా నారా చంద్రబాబునాయుడు అప్పటి ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావుని త్రోసిరాజని 1 సెప్టెంబరు 1995న రాష్ట్ర ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టారు. తొమ్మిది సంవత్సరాలకాలం అధికారంలో వుండటమే కాకుండా కేంద్రంలో యుడిఎ ప్రభుత్వానికి, ఎన్‌డిఏ ప్రభుత్వం మనుగడకు ప్రముఖ పాత్ర పోషించి రాజకీయ చక్రం తిప్పిన ఘనత చంద్రబాబుకే దక్కింది. ఆయన హయాంలో కేంద్రం నుండి రాష్ట్రానికి లభించిన పన్నుల వాటా రాష్ట్ర మొత్తం రెవెన్యూ రాబడిలో 1995-96 సంవత్సరంలో 25.95 శాతం వుండగా 2003-04 సంవత్సరంలో 18.86 శాతానికి పడిపోయింది. కేంద్రం నుండి లభించే పన్నుల వాటా 1956-57 సంవత్సరంలో రు.5 కోట్లు వుండగా 1982-83లో రు.361 కోట్లకు పెరిగి ఈ 27 సంవత్సరాల కాంగ్రెసు పాలనలో 15.86 శాతం కాంపౌండ్ అభివృద్ధి రేటు నమోదయింది. 1983-84 నుండి 1988-89 వరకు తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో 15.47 శాతం కాంపౌండ్ అభివృద్ధి రేటు నమోదయింది. తరువాత కాంగ్రెసు ప్రభుత్వ హయాంలో కేంద్రం నుండి లభించిన పన్నులలో 1989-90 నుండి 1994-95 వరకు 15.40 శాతం కాంపౌండ్ అభివృద్ధి రేటు నమోదు కాగా, కేంద్ర ప్రభుత్వ మనుగడకు ప్రాణవాయువులాగా పనిచేసిన చంద్రబాబు హయాంలో 1995-96 నుండి 2003-04 వరకు కేంద్రం నుండి లభించిన పన్నులలో 7.81 శాతమే కాంపౌండ్ అభివృద్ధి రేటు నమోదయింది.

పట్టిక - 1

రెవెన్యూ రాబడిలో అభివృద్ధి రేటు

కాల వ్యవధి	కేంద్రపన్నుల్లో వాటా	రాష్ట్ర సొంత పన్నులు	సొంత పన్నేతర రాబడి	సహాయా నుదానం	మొత్తం రాష్ట్ర రెవెన్యూ రాబడి
1956-83	15.86	14.09	13.12	16.19	14.45
1983-89	15.47	16.47	18.25	13.67	16.24
1989-95	15.40	12.36	17.19	19.47	14.38
1995-04	7.81	16.06	12.25	12.68	13.11
2004-06	5.54	15.42	2.87	20.61	12.45

సహాయ అనుదానం - విరాళాలు కేంద్రం నుండి రాష్ట్రానికి లభిస్తాయి. 1956-57 సంవత్సరంలో సహాయ అనుదానం విరాళాలు రాష్ట్రానికి రు.2 కోట్లు లభించగా 1982-83 సంవత్సరంలో రు.210 కోట్లు లభించాయి. మొత్తం ఈ 27 సంవత్సరాల కాలంలో సహాయ అనుదానంలో 16.19 శాతం కాంపౌండ్ అభివృద్ధి రేటు నమోదు కాగా 1983-84 నుండి 1988-89 వరకు తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో 13.67 శాతం కాంపౌండ్ అభివృద్ధి రేటు

నమోదయింది. కాంగ్రెసు ప్రభుత్వ హయాంలో 1989-90 నుండి 1994-95 వరకు 17.47 శాతం కాంపౌండ్ అభివృద్ధి రేటు నమోదయింది. తరువాత చంద్రబాబు హయాంలో ఈ అభివృద్ధి రేటు 12.68 శాతానికి పడిపోయింది.

మొత్తం మీద కేంద్రం నుండి బదలాయింపబడిన వనరులలో అభివృద్ధి రేటు 1956-57 నుండి 1982-83 వరకు 15.95 శాతం వుండగా 1983-84 నుండి 1988-89 వరకు 14.77 శాతం అభివృద్ధి రేటు నమోదు కాగా తరువాత కాంగ్రెసు ప్రభుత్వ హయాంలో 1989-90 నుండి 1994-95 వరకు 16.97 శాతం కాంపౌండ్ అభివృద్ధి రేటు నమోదయింది. చంద్రబాబు హయాంలో 1995-96 నుండి 2003-04 సంవత్సరం వరకు కేంద్రం నుండి రాష్ట్రానికి బదలాయింపబడిన వనరులలో 9.72 శాతమే కాంపౌండ్ అభివృద్ధి రేటు నమోదయింది. 2004-05 సంవత్సరానికి సంబంధించి సవరించిన అంచనాలు, 2005-06 సంవత్సరానికి బడ్జెట్ అంచనాల గణాంకాలు మనకు లభ్యమవుతున్నాయి. 2005-06 సంవత్సరంలో కేంద్రం నుండి లభించిన పన్నులు 2004-05 సంవత్సరంలో పోలిస్తే 5.5 శాతం అభివృద్ధి రేటు నమోదు కాగా, సహాయ అనుదానం, విరాళాలలో 20.6 శాతం. మొత్తం మీద కేంద్రం నుండి రాష్ట్రానికి బదలాయింపబడే వనరులలో 11.4 శాతం అభివృద్ధి రేటు నమోదయింది.

రాష్ట్ర సొంత వనరులు :

రాష్ట్రానికి లభించే రెవెన్యూ రాబడులు రెండు రకాలు. అవి సొంత పన్నుల ద్వారా రాబడి, పన్నేతర రాబడి. సొంత పన్నుల ద్వారా రాష్ట్రానికి లభించిన రాబడి 1956-57 సంవత్సరంలో రు.23 కోట్లు వుండగా హెచ్చుతగ్గులతో 1982-83 సంవత్సరంలో రు.808 కోట్లకు పెరిగి ఈ 27 సంవత్సరాల కాలంలో మొత్తంమీద 14.09 శాతం కాంపౌండ్ అభివృద్ధి రేటు నమోదయింది. 1983-84 సంవత్సరం నుండి 1988-89 వరకు సొంత పన్నుల ద్వారా రాబడిలో 16.47 శాతం అభివృద్ధి రేటు నమోదు కాగా కాంగ్రెసు ప్రభుత్వ హయాంలో 1989-95 వరకు 12.36 శాతమే కాంపౌండ్ అభివృద్ధి రేటు నమోదయింది. కాగా తిరిగి తెలుగుదేశ ప్రభుత్వ హయాంలో 1995-96 నుండి 2003-04 వరకు 16.6 శాతం కాంపౌండ్ అభివృద్ధి రేటు నమోదయింది. అనగా మొత్తం మీద తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ప్రజల మీద అధికాధికంగా పన్నుల భారం మోపినట్లు అవగతమవుతోంది ఈ అధికార గణాంకాల ప్రకారమే. బడ్జెట్ అంచనాల ప్రకారం 2005-06 సంవత్సరంలో సొంత పన్నుల ద్వారా రాష్ట్రానికి లభించే రాబడిలో 15.4 శాతం అభివృద్ధి రేటు నమోదవుతోంది.

పన్నులు కాని రాబడి అనగా పన్నేతర రాబడి రాష్ట్రానికి ముఖ్యంగా నాలుగు రకాలు. అవి వడ్డీల వసూళ్ళు, సాధారణ సేవలు, సామాజిక సేవలు, ఆర్థిక సర్వీసులు. మొత్తం మీద సొంత పన్నేతర రాబడి 1956-57 సం॥లో రు.8 కోట్లు వుండగా 1982-83 సం॥లో రు.260 కోట్లకు పెరిగి మొత్తం మీద ఈ 27 సంవత్సరాల కాలంలో 13.12 శాతం కాంపౌండ్ అభివృద్ధి రేటు నమోదయింది. 1983-84 నుండి 1988-89 వరకు సొంత పన్నేతర రాబడిలో 18.25 శాతం కాంపౌండ్ అభివృద్ధి రేటు నమోదు కాగా 1989-90 నుండి 1994-95 వరకు 17.19 శాతం అభివృద్ధి రేటు నమోదయింది. 1995-96 నుండి 2003-04 వరకు సొంత పన్నేతర రాబడిలో అభివృద్ధి రేటు 12.25 శాతమే అనగా దీన్నిబట్టి కూడ తెలుగుదేశం ప్రభుత్వం సొంత పన్నుల ద్వారా రాబడి మీద దృష్టిసారించినట్లు అవగతమవుతోంది. 2005-06 సంవత్సరంలో సొంత పన్నేతర పన్నుల ద్వారా రాష్ట్రానికి లభించే రాబడిలో 2.87 శాతం అభివృద్ధి రేటు నమోదవుతోంది.

మొత్తం మీద రాష్ట్రానికి సొంత వనరుల ద్వారా లభించిన రాబడి 1956-57 సంవత్సరంలో రు.31 కోట్లు వుండగా 1982-83 సంవత్సరంలో రు.1068 కోట్లకు పెరిగి ఈ 27 సంవత్సరాల కాలంలో 13.80 నుండి 1988-89 వరకు 16.96 శాతం అభివృద్ధి రేటు నమోదు కాగా 1989-90 నుండి 1994-95 వరకు కాంగ్రెసు పార్టీ హయాంలో 13.72 శాతం కాంపౌండ్ అభివృద్ధి రేటు నమోదయింది. తిరిగి చంద్రబాబు హయాంలో 1995-96 నుండి 2003-04 వరకు సొంత వనరుల ద్వారా రాబడిలో 15.12 శాతం అభివృద్ధి రేటు నమోదయింది. 2005-06 సంవత్సరంలో అంతటి క్రితం సంవత్సరంతో పోలిస్తే 12.9 శాతం సొంతవనరులలో పెరుగుదల వుండబోతోంది.

పట్టిక - 2

ఆంధ్రప్రదేశ్‌లో ప్రజావ్యయం (అభివృద్ధి రేటు శాతం)

కాల వ్యవధి	రెవెన్యూ పద్దు	మూలధన పద్దు	మొత్తం ప్రజావ్యయం
1956-83	14.09	10.34	12.73
1983-89	14.76	0.63	10.77
1989-95	14.52	7.86	17.24
1995-2004	12.91	15.59	13.63
2004-06	11.72	2.19	9.53

మొత్తం రాష్ట్ర రెవెన్యూ రాబడి :

రాష్ట్రంలో మొత్తం మీద రెవెన్యూ వసూళ్ళు 1956-57 సంవత్సరంలో రు.38 కోట్లు వుండగా 1982-83 సంవత్సరంలో రు.1639 కోట్లకు పెరిగి మొత్తం మీద 14.45 శాతం కాంపౌండ్ అభివృద్ధి రేటు నమోదయింది. 1983-84 నుండి 1988-89 వరకు 16.24 అభివృద్ధి రేటు నమోదు కాగా 1989-90 నుండి 1994-95 వరకు 14.78 శాతం, 1995-96 నుండి 2003-04 వరకు 13.11 శాతం అభివృద్ధి రేటు నమోదయింది. 2005-06 సంవత్సరంలో అంతటిక్రితం సంవత్సరంతో పోలిస్తే సొంత వనరులలో అభివృద్ధి రేటు 12.4 శాతం వుంటుందని అంచనా.

ప్రజావ్యయం :

రెవెన్యూ పద్దు క్రింద ప్రజావ్యయం రాష్ట్రంలో 1956-57 సంవత్సరంలో రు.38.02 కోట్లు వుండగా క్రమక్రమంగా పెరిగి 1982-83 సం॥లో రు.1506 కోట్లకు పెరిగి ఈ 27 సంవత్సరాల కాలంలో 14.09 శాతం కాంపౌండ్ అభివృద్ధి రేటు నమోదయింది. 1983-84 నుండి 1988-89 వరకు ఈ రెవెన్యూ పద్దు క్రింద ప్రజావ్యయంలో అభివృద్ధి రేటు 14.76 శాతం వుండగా 1989-90 నుండి 1994-95 వరకు 14.52 శాతం కాంపౌండ్ అభివృద్ధి రేటు నమోదయింది. కాగా చంద్రబాబు హయాంలో రెవెన్యూ పద్దు క్రింద ప్రజావ్యయంలో 12.91 శాతమే అభివృద్ధి రేటు నమోదయింది. కాగా ప్రజావ్యయం మూలధన ఖాతా క్రింద బట్వాడా 1956-57 సంవత్సరంలో రు.32.43 కోట్లు వుండగా హెచ్చు తగ్గులతో 1982-83 సంవత్సరంలో రు.426.63 కోట్లుగా వుంది.

మొత్తం మీద ఈ 27 సంవత్సరాల కాలంలో మూలధన ఖాతా క్రింద చెల్లింపుల 10.34 శాతం కాంపౌండ్ అభివృద్ధి రేటు నమోదయింది. 1983-84 సంవత్సరం నుండి 1988-89 వరకు మూలధన ఖాతా క్రింద ప్రజావ్యయంలో 0.63 శాతం మాత్రమే కాంపౌండ్ అభివృద్ధి రేటు నమోదయింది. 1989-90 నుండి 1994-95 వరకు ఈ పద్దు క్రింద 27.86 శాతం కాంపౌండ్ అభివృద్ధి రేటు నమోదు కాగా 1995-96 నుండి 2003-04 వరకు 15.59 శాతమే అభివృద్ధి రేటు నమోదయింది. 2005-06 సంవత్సరంలో అంతటిక్రితం సంవత్సరంతో పోలిస్తే రెవెన్యూ పద్దు క్రింద ప్రజావ్యయంలో 11.72 శాతం పెరుగుదల వుండబోతుండగా మూలధన ఖాతా క్రింద 2.2 శాతమే పెరుగుదల వుంటుందని అంచనా.

మొత్తం మీద రాష్ట్రంలో ప్రజావ్యయంలో 1956-57 నుండి 1982-83 వరకు 12.73 శాతం అభివృద్ధి రేటు నమోదు కాగా 1983-84 నుండి 1988-89 వరకు 10.77 శాతం, 1989-90 నుండి 1994-95 వరకు 17.24 శాతం కాంపౌండ్ అభివృద్ధి రేటు నమోదు కాగా 1995-96 నుండి 2003-04 వరకు 13.63 శాతమే అభివృద్ధి రేటు నమోదయింది. 2005-06 సం॥లో రాష్ట్ర ప్రజావ్యయంలో 9.5 శాతమే పెరుగుదల వుంటుందని అంచనా.

మిగిలివున్న ప్రజారుణం :

భారత రాజ్యాంగం ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం ఆ రాష్ట్ర సంచిత నిధి హామీగా దేశంలో అంతర్గతంగా రుణాలు పొందే అవకాశం వుంది. దీనికి సంబంధించిన గరిష్ట పరిమితులను శాసనసభ ఎప్పటికప్పుడు చట్టాల ద్వారా విధించవచ్చు. ఐతే అటువంటి పరిమితుల్ని విధించే చట్టాన్ని శాసనసభ ఇంతవరకు చేయలేదు. రాష్ట్ర ప్రభుత్వ అప్పుల భారం ఇంతింతై వటుడింతై అన్నట్లు వేగంగా పెరిగి పోతోంది. గత ఐదు దశాబ్దాలుగా అప్పు పెరగటమే గాని తరుగులేదు. మిగిలివున్న ప్రజారుణం రాష్ట్రంలో 1956-57 సంవత్సరంలో రు.117.99 కోట్లు కాగా 2003-04 సంవత్సరంలో చంద్రబాబు హయాంలో రు.58,770 కోట్లకు పెరిగింది. 2005-06 సంవత్సరం బడ్జెట్ అంచనాల ప్రకారం రు.76,520 కోట్లకు ప్రజారుణం పెరగబోతోంది. 2003-04 సంవత్సరం వరకు మిగిలి వున్న ప్రజారుణంలో సింహభాగం కేంద్ర ప్రభుత్వం నుండి తీసుకున్న రుణాలే. (ఇందులో ప్రపంచ బ్యాంకు నుంచి తీసుకున్న రుణం కూడా వుంది). 2005-06 సంవత్సరం బడ్జెట్ అంచనాల ప్రకారం మొత్తం మిగిలివున్న ప్రజారుణంలో సింహభాగం అనగా 30.49 శాతం చిన్న మొత్తాల పొదుపు-భవిష్యనిధి నుండి తీసుకోగా, బహిరంగ మార్కెట్ల నుండి 29.7 శాతం, కేంద్ర ప్రభుత్వం నుండి 22.6 శాతం వున్నట్లు అధికార గణాంకాలు తెలుపుతున్నాయి.

పై విశ్లేషణ వల్ల తేలేదేమిటంటే రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోవటమే కాకుండా ఆర్థిక ఇబ్బందులలో కూరుకు పోయినట్లుగా గోచరిస్తోంది. ఈ సంక్షోభం నుండి బయట పడాలంటే అభివృద్ధేతర వ్యయాన్ని తగ్గించుకోవాలి. రాష్ట్ర సొంత రెవెన్యూ పన్నుల రాబడిలో 75 శాతం జీతభత్యాలకే ఖర్చు చేయటం జరుగుతోంది. రాష్ట్ర జనాభాలో 1.7 శాతం వున్న ఉద్యోగుల మీద మూడు వంతుల రాష్ట్ర సొంత పన్నుల నుంచి లభించే రాబడిని జీతభత్యాలుగా ఖర్చు చేయటం జరుగుతోంది. ఇక ఈ స్థితిలో రాష్ట్రంలో అభివృద్ధి ఎలా జరుగుతుంది? కాబట్టి ప్రస్తుతం రాష్ట్రంలో వున్న కాంగ్రెసు ప్రభుత్వం గత 49 సంవత్సరాల "ప్రజా ఆర్థికాన్ని" దృష్టిలో పెట్టుకొని, సింహావలోకనం చేసుకొని అనవసర ఖర్చులకు తావివ్వకుండా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మెరుగు పరుస్తారని ఆశిద్దాం. ❑

ప్రభుత్వ కార్యక్రమాలు - అభివృద్ధి : ఒక అవగాహన

డా. ముదునూరి భారతి

1. మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత పార్లమెంటరీ ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికల ప్రక్రియ ద్వారా ప్రజలచే ఎన్నుకోబడిన కాంగ్రెసు పార్టీ హయాంలో, ఆ పార్టీ నాయకుడు నెహ్రూ నేతృత్వంలో, మహల్‌నోబిస్‌చే రూపొందించబడిన పంచవర్ష ప్రణాళికల ఆధారంగా దేశ ప్రగతికి ఒక లక్ష్యాన్ని, ఒక దిశని నిర్దేశిస్తూ అనేక ప్రజాహిత ప్రణాళికలు (పబ్లిక్ పాలసీలు), దానికి అవసరమైన కార్యక్రమాలు రూపొందించబడ్డాయి. దేశ ఆర్థిక ప్రగతికి వ్యవసాయ, పరిశ్రమ రంగాలు రెండూ అభివృద్ధి చెందాలనే ఉద్దేశ్యంతో మొట్టమొదటగా ఒరిస్సాలో హిరాకుడ్ డ్యాం, రూర్కేలాలో ఉక్కు కర్మాగారం నిర్మించారు. పెద్ద డ్యాంలు కట్టడం ద్వారా వ్యవసాయరంగంలో అనూహ్యమైన మార్పులు సాధ్యమౌతాయని, దాని వలన నియంత్రిత సాగునీటి సదుపాయం వచ్చి అధిక దిగుబడి వస్తుందని, అంతేగాక డ్యాం వలన లభించే విద్యుత్తు, రవాణా సౌకర్యాలు మొదలైన ఉపయోగాలు సమాజ అభివృద్ధికి తోడ్పడతాయనీ ఒక ఉద్దేశం. అలాగే పరిశ్రమల అభివృద్ధికి మూలమైన ఉక్కు తయారీకి భారీ కర్మాగారాల నిర్మాణం, దానితో వచ్చే ఉపాధి సౌకర్యాలు ఇవన్నీ కలిసి సమాజాన్ని అభివృద్ధి చేస్తాయనే ఒక భావన దీనికి మూలం. ఆర్థిక అభివృద్ధికి కావలసిన మౌలిక సదుపాయాలు సమాజపరంగా భూమి, విద్యుత్తు, నీరు, రవాణా సౌకర్యాలు కల్పించి వాటి రాయితీలు ఇవ్వటం లాంటి ప్రణాళికలు రూపొందితే, వృత్తిపరంగా కావలసిన విద్య, ఆరోగ్యం, ఇంటి వసతి కల్పించే మరికొన్ని ప్రణాళికలు వచ్చాయి. ఆర్థిక అభివృద్ధి, దానికి కావలసిన మౌలిక సదుపాయాల అభివృద్ధితో ప్రణాళికలు సరిపెట్టుకోకుండా సమాజంలో ఉండే అనేక అసమానతలు - ప్రాంతీయ (కోస్తా, ఆంధ్ర, తెలంగాణా), సామాజిక (దళితులు, గిరిజనులు), ఆర్థిక (గొప్ప, బీద), జెండరు (స్త్రీ, పురుషులు) నిర్మూలించే ఉద్దేశంతో కూడా కొన్ని ప్రణాళికలు రూపొందించబడ్డాయి. ఇవే కాకుండా సమాజ అభివృద్ధికి ఆటంకంగా కనిపించే పేదరికం, దీని ప్రభావం వారి విద్య, ఆరోగ్యం, ఉపాధి రంగాల మీద ఉండటంతో ఆ నీడలను తొలగించటానికి ప్రాథమిక స్థాయిలో సంపూర్ణ అక్షరాస్యత సాధించటానికి అనేక పథకాలు, గ్రామీణ ప్రాథమిక అరోగ్య కేంద్రాలు, గ్రామీణ ఉపాధి పథకాలు రూపొందించబడ్డాయి. యాభై సంవత్సరాలలో ఈ పథకాలు సమాజంలో తెచ్చిన వెలుగులు, దాని ద్వారా వచ్చిన చీకట్ల ప్రభావాన్ని ఇవి అమలులో తీసుకుని వచ్చిన ఫలితాల ద్వారా విశ్లేషించి చూస్తే ప్రతి రంగంలోను కూడా ఈ పథకాలు కొంత వెలుగుని ఇచ్చినా కూడా ఇవి అనుకున్న లక్ష్యాన్ని చేరలేకపోయాయని, పథకం ఊహించిన, ఆశించిన లక్ష్యానికి, సమాజంలో అది అమలు చేయటం ద్వారా సాధించిన లక్ష్యానికి చాలా తేడాలు వచ్చాయని అర్థమవుతుంది.

అభివృద్ధి పథకాలలో ముఖ్యమైన అంశమయిన డ్యాం నిర్మాణం వలన రావలసిన ఉపయోగాలు (పంటపొలాల విస్తీర్ణం పెరగటం, పంట దిగుబడి పెరగటం, విద్యుదుత్పాదన పెరిగి పరిశ్రమలు పెరగటం, ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయటం లాంటివి) వచ్చాయా లేదా అనే దానిమీద వాదోపవాదాలు ప్రక్కన పెట్టినా కూడా, డ్యాం వలన నిర్వాసితులైన వారి స్థితిగతులను చూస్తే డ్యాం వైఫల్యం కొట్టవచ్చినట్లు కనిపిస్తుంది. మా సర్వేలో అప్పటి హీరాకుడ్ డ్యాంలోను, ప్రస్తుతం కట్టే ఇంద్రావతి డ్యాంలో కూడ, నిర్వాసితుల పునరావాస వసతులు పూర్తికాక పోవటం, పునరావాసానికి ఒక స్పష్టమైన పథకం ఇంతవరకూ రూపొందకపోవటం, నిర్వాసితుల వనరులకు విలువ కట్టే పద్ధతులలో విభేదాలు, నష్టపరిహారం చెల్లించటంలో సందిగ్ధత, గమనించటం జరిగింది. ఇదే పరిస్థితి పరిశ్రమల రంగంలో కూడ కన్పిస్తుంది. ఆంధ్రరాష్ట్ర అవతరణానంతరం 'విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు' అనే ఉద్యమ ఫలితంగా సాధించిన విశాఖ ఉక్కు కర్మాగారం స్థాపనలో కూడా ఈ వైరుధ్యం కనిపిస్తుంది. విస్పష్టమైన ప్లానింగ్‌తో ఉక్కు తయారీని అంచలంచెలుగా పెంచుతున్న ఉక్కు ఫ్యాక్టరీ అధిష్టానవర్గం తన ఫ్యాక్టరీ నిర్వాకం ద్వారా నిర్వాసితులైన కుటుంబాలకు సరియైన పునరావాసం కల్పించటంలో విఫలమైంది. ప్రస్తుత కాలంలో కూడా అభివృద్ధి పథకాలు (పోలవరం డ్యాం అయినా, నాగార్జునసాగర్ వద్ద న్యూక్లియర్ ప్లాంట్ అయినా) ఏవైనా వాటి నిర్మాణానికి ప్రజల నుండి వ్యతిరేక స్పందన రావటం వీటి వైఫల్యానికి సూచికలుగా నిలుస్తాయి. అభివృద్ధి పథకాల తరువాత ఇంకొక ప్రధాన అంశంగా భూసంస్కరణలకు సంబంధించి ఎన్నో ప్రణాళికలు వస్తూనే ఉన్నాయి. స్వాతంత్ర్యం వచ్చిన దగ్గర నుండి, అంటే మొదటి పంచవర్ష ప్రణాళికలో చోటు చేసుకున్న భూసంస్కరణలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. భూగరిష్ట పరిమితి చట్టం, జమీందారీ జాగీర్దారీ రద్దు, మధ్య దళారీల రద్దు, కౌలుదారీ చట్టాలు, ల్యాండ్ సెటిల్‌మెంట్స్, దున్నేవారికే భూమి.. ఇలా ఎన్నో వస్తూనే ఉన్నాయి. ఇవి అమలులో విఫలమయ్యాయని వీటిని ఆచరణలో పరిశీలించిన నిపుణులు చెబుతూనే ఉన్నారు. దానికి కారణాలుగా రాజకీయ ఆకాంక్ష లేకపోవటం, అధికారుల నిర్లక్ష్యం, నిరాసక్తత, అమలు చేసే ఉద్యోగుల అసమర్థత, లంచగొండితనం ఇలా ఎన్నో కారణాలు. భూసంస్కరణలు అసంపూర్తిగా మిగిలిపోయాయని చెప్పటానికి 2004 అక్టోబరులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, నక్సలైట్ల మధ్య ఆర్భాటంగా, విస్తృత ప్రచారంతో జరిపిన చర్చలు, ఈ చర్చల సందర్భంగా భూమి సమస్య మళ్ళీ ముందుకు రావటం ఒక

నిదర్శనంగా చూడవచ్చు. భూసంస్కరణలు ముఖ్యంగా పేద రైతులకు అవసరమైన భూపంపక రూపంలో పరిష్కారం కోరే సమస్యగా ముందుకు రావడం, రెండు విడతలు (26 జనవరి, 2005న, 15 ఆగస్టు, 2005న) ప్రభుత్వం పేద ప్రజలకు 3.6 లక్షల ఎకరాల భూమిని పంచటం, తిరిగి ఇంకొక లక్ష ఎకరాల వరకు భూమిని పంచటానికి కావలసిన ప్రయత్నాలు ముమ్మరంగా చేస్తామని చెప్పడం జరిగింది. భూసంస్కరణలకు సంబంధించి అనేక ప్రణాళికలు చేపట్టినా కూడా సమాజంలో భూమి సమస్య పరిష్కారం కాకపోవడంతో చర్విత చర్వణంగా అది మళ్ళీ మళ్ళీ తలెత్తుతూనే ఉంది. మిగతా రంగాలలో కూడా పథకాలు అనుకున్న లక్ష్యాలు సాధించలేకపోతున్నాయని చెప్పటానికి పేదరిక నిర్మూలన పథకాలు మార్పులు చెందుతూ కొత్త కొత్త రూపాలు పొందటం, విద్యారంగంలో అందరికీ విద్య కోసం పథకాలు అమలు చేస్తున్నా కూడా అక్షరాస్యతలో సమాజంలో ఉన్న అసమానతలన్నీ ప్రతిఫలించటం, పేదలకు రుణసహాయం కోసం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మైక్రోఫైనాన్స్ పథకం కూడా అమలులో విఫలమయ్యాయని పరిశీలకులు అభిప్రాయపడటం ఉదాహరణలుగా చూడవచ్చు. యాభై ఏళ్లకు పైగా పంచవర్ష ప్రణాళికలు అమలవుతున్నా కూడా గ్రామీణ ప్రజల ఉపాధి సమస్య తీరలేదని మరో గ్రామీణ ఉపాధి గ్యారంటీ పథకం రూపొందించటం లాంటివన్నీ కూడా పథకాలు, వాటి లక్ష్యాలు మంచివే అయినా పథకాలు అమలులో విఫలమవుతున్నాయని అందుకు అమలులో లోపం కారణంగా గుర్తించటం జరుగుతోంది. ఇలా విఫలమవటానికి కారణం అమలులోకి కుదించి చూడకుండా, అవగాహన లోపంగా అంటే, ఆచరణసాధ్యంకాని లక్ష్యంగల పథకంగానో, లేక సమాజ గమనానికి (లక్ష్యానికి) పథకం యొక్క లక్ష్యానికి పొంతన లేకపోవడంగా కూడా చూడాలని ప్రతిపాదించటమే ఈ వ్యాసం ముఖ్య ఉద్దేశ్యము. ఈ సందర్భంలో ప్రజాహిత కార్యక్రమాలు అంటే ఏమిటి? ఇవి ఎలా రూపొందించబడతాయి. అనే ప్రశ్నలకు సమాధానం చూడాలి.

2. వ్యక్తి తనకు తానుగా అన్ని అవసరాలను తీర్చుకోలేనప్పుడు వాటి కొరకు తాను భాగస్థుడైన సముదాయం మీద ఆధారపడటం జరుగుతుంది. ఆ సముదాయం వ్యక్తుల అవసరాలు తీర్చే క్రమంలో కొన్ని పథకాలు రూపొందుతాయి. ఇవి సముదాయం మొత్తం మీద ప్రభావం చూపే డ్యాంలు, కర్మాగారాలు, మౌలికసౌకర్యాలు, సాంకేతిక శక్తి, మార్కెట్లకు సంబంధించిన పథకాలు కొన్ని అయితే వ్యక్తి కేంద్రంగా వారి విద్య, ఆరోగ్యం మొదలైన వాటిని మెరుగుపరిస్తే వ్యక్తి బలపడటమే కాకుండా సమాజం మొత్తం మెరుగుపడుతుందనే భావనతో వచ్చేవి కొన్ని పథకాలు ఉంటాయి. ప్రజల అవసరాలు తీర్చే ఈ పథకాలు ప్రజాహిత పథకాలని (పబ్లిక్ పాలసీ) అర్థం చేసుకోవచ్చును.

ఈ పథకాల పుట్టుకకి మూలం మూడు రకాలుగా చూడవచ్చును. మొదటిది పార్లమెంటరీ ప్రజాస్వామ్య పద్ధతిలో రూపు తీసుకొనేవి, రెండవది ప్రపంచ బ్యాంకు నిర్దేశకత్వంలో శాసించబడేవి, మూడవది ప్రజా ఉద్యమాల బలంతో కాని ప్రేరణతోగాని కొన్ని రూపొందించబడతాయి. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో వ్యక్తి తన జీవితగమనాన్ని నిర్దేశించగలిగే హక్కును ఓటు ద్వారా ఒక సముదాయానికి ఇచ్చివేస్తారు. కాని సముదాయం ఒక అమూర్తభావన అవడంతో సముదాయపు నేతృత్వం (ఒక వ్యక్తి లేక వ్యక్తుల కలయిక) ఈ బాధ్యతని స్వీకరిస్తుంది. ఈ క్రమంలోనే మనకు ఒక ప్రధానమంత్రి, ఒక పార్లమెంటు, ఒక ముఖ్యమంత్రి, ఒక శాసనసభలాంటి వ్యవస్థలు ఏర్పడ్డాయి. ఈ నాయకత్వం తనకుండే ప్రాపంచిక జ్ఞానం ఆధారంగా సమాజానికి ఒక దిశని నిర్దేశించటం జరుగుతుంది. స్వాతంత్ర్యానంతరం మన దేశంలో నేతలకు ఈ జ్ఞానం ఒక సోషలిస్టు దేశమైన రష్యాలో విజయవంతంగా జరిగిన ప్రయోగాల అనుభవాల నుండి, పెట్టుబడిదారీ దేశాలైన అమెరికా, ఇంగ్లాండు అనుభవాల నుండి గ్రహించటం జరిగింది. ఈ జ్ఞానం ఆధారంగా, మన దేశంలో మహల్‌నోబిస్ వంటి నిపుణుల సలహాలతో దేశ అభివృద్ధికి ఒక దిశ, దానికి అవసరమైన ప్రజాహిత పథకాలు రూపొందాయి. దీనికి ఉదాహరణగా అమెరికాలోని టెనెసీవాలీ ప్రాజెక్ట్‌కు అనుకరణగా హిరాకుడ్ డ్యాం, రష్యాలో ఉక్కు కర్మాగారానికి అనుకరణగా రూర్కేలా ఉక్కు కర్మాగారాలను చూడవచ్చును. ఇవి అప్పటికే ఆ దేశాలలో విజయవంతమయ్యాయి. కాబట్టి ప్రపంచమంతటా కూడా అమలు చేయవచ్చునని, అందుచేత మనదేశంలో కూడ వీటి వలన అనుకున్న ఫలితాలను సాధించగలమనే ఊహ దీనికి ఆధారం. ఈ క్రమంలోనే మన దేశంలో పెద్ద డ్యాంలు, భారీ పరిశ్రమలు నెలకొల్పబడ్డాయి. ఇప్పటికి కూడా మన ముఖ్యమంత్రిగారికి చైనాలో మూడు గోర్జెస్, ఇజ్రాయిల్‌లో నూతన వ్యవసాయ పద్ధతుల లాంటివి మన రాష్ట్రంలో కూడా ప్రవేశపెట్టాలనే ఉత్సాహం ఉంది. అభివృద్ధి చెందిన దేశాలలో ఉపయోగపడిన సాధనాలను మన దేశానికి నమూనాగా ఎంచుకొని వాటికనుగుణంగా పథకాలను రూపొందించటం జరిగింది. పథకాలకు మూలం ఇక్కడి నాయకత్వానికి అభివృద్ధి మీద ఉండే అవగాహన. ఇక రెండవది ప్రపంచ బ్యాంకు అభివృద్ధి చెందవలసిన దేశాలకు సూటిగా నిర్దేశించే సూత్రాలలో చూడవచ్చును. మానవ ప్రపంచమంతా ఒకటేనని, ఈ ప్రపంచంలో ఒక దేశంలో అభివృద్ధికి సంబంధించిన ప్రయోగాలు సఫలంగా జరిగి ఆ దేశం అభివృద్ధి చెందిన దేశంగా మారిపోయిందని, అభివృద్ధికి చెందిన జ్ఞానమంతా తమ దగ్గరే ఉందని, ఈ జ్ఞానాన్ని మిగతా దేశాలు మక్కికిమక్కి అనుసరిస్తే ఇవి కూడా అభివృద్ధి చెందుతాయని ఒక భావన. ఇక్కడ అభివృద్ధి అంటే సాంకేతిక సమస్య మాత్రమేనని, దానికి కావలసిన సాంకేతిక జ్ఞానం, పెట్టుబడికి కావలసిన ఆర్థిక స్తోమత తమవద్ద ఉన్నాయని, తగిన నేతృత్వం ఉంటే పేద దేశాలకు కావలసిన ధన, సాంకేతిక సహాయం తాము చేస్తామని ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థలు చెపుతాయి. ఐ.టి రంగం మనకు ఇలాగే

వచ్చిపడింది. పార్లమెంటరీ ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నుకోబడిన నేతృత్వమైనా, ప్రపంచబ్యాంకు నిర్దేశించే మార్గాన్ని అనుసరించే నేతృత్వమైనా, పథకాలకు ఆధారం బాహ్య ప్రపంచంలోనే గుర్తించడం జరిగింది. రష్యాలో ఉండే ఉక్కు కర్మాగారం లాంటిది మన దేశానికి కావాలనే ప్రధానమంత్రి అయినా, ప్రపంచంలో ఉండే మంచి అంతా మా రాష్ట్రానికే కావాలనే ముఖ్యమంత్రి అయినా, పథకాలకు ఆధారం బయటి దేశాలలోనే చూసుకున్నారు. ఈ రెండవ క్రమానికి పరాకాష్ట మన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్ 2020 చూస్తే అర్థమౌతుంది. ఆంధ్రప్రదేశ్ మీద అవగాహనే తక్కువయినా కూడా, ప్రపంచబ్యాంకు ఆదేశాల కనుగుణంగా ఆంధ్రప్రదేశ్‌కి లక్ష్యాన్ని నిర్ధారించే నిపుణుల ద్వారా, మన రాష్ట్రాన్ని వ్యవసాయ ప్రాధాన్యత నుండి పరిశ్రమలు, సేవలు ప్రాధాన్యతగా ఉండే రాష్ట్రంగా మార్చటం కోసం, అంటే ఒక నిర్దిష్ట మార్గంలో అభివృద్ధి చెందటం కోసం (చైనా, కొరియా దేశాలలో ఇప్పటికే ఈ క్రమం జయప్రదం అయింది కాబట్టి, వాటిని అనుకరించటం) ఇంకా అమెరికాలో వయోజన విద్య, బ్రెజిల్ ఆరోగ్య విధానాలు, కొరియా ఇరిగేషన్, చిలీ విద్యుత్ విధానాలు, థాయిలాండ్ పౌల్ట్రీ, ఇజ్రాయిల్ హార్టికల్చర్, సింగపూర్‌లో కన్‌స్ట్రక్షన్, ప్రస్తుతం రాజకీయంగా మారిన ఇజ్రాయిల్ వ్యవసాయానికి నమూనాగా కుప్పంలో కాంట్రాక్టు వ్యవసాయ పద్ధతులు, నాలెడ్జి కారిడార్‌కి స్టాన్‌ఫోర్డ్, మసాచుసెట్స్ - ఇవన్నీ మా రాష్ట్రానికే కావాలనేది విజన్ 2020. ప్రపంచ బ్యాంకు నిర్దేశించే ఈ పథకాలు రాజకీయాలకు అతీతంగా, పాలకులు ఎవరైనా సరే, ఆర్థిక ప్రగతిని చూసే పద్ధతి. ఒక్క మాటలో చెప్పాలంటే మన సమాజపు అవసరాల కనుగుణంగా, మన నిపుణుల సూచనలతో ఒక అభివృద్ధి మార్గం, దానికి సరిపడ్డ ప్రజాహిత పథకాలు రూపొందించే కంటే, ప్రపంచ అవసరాల కనుగుణంగా ప్రపంచ నిపుణుల సూచనలతో, అభివృద్ధి చెందిన దేశాల మార్గాన్ని అనుసరిస్తూ దానికనుగుణంగా పథకాలు రూపొందించుకోవటమన్నమాట. ఇంక మూడవ మూలం ప్రజా ఉద్యమాలలో చూడవచ్చును. ప్రజలు తమ అవసరాల సాధన కోసం ఉద్యమాలు చెయ్యడం వలన ప్రభుత్వం వీటికి స్పందించటం వలన కొత్త పాలసీలు రూపొందటం కాని, పాతవాటిలోనే మార్పులు రావటంకాని జరుగుతుంది.

ఆంధ్రప్రదేశ్ చరిత్ర పరిశీలించినట్లయితే, 'విశాఖ ఉక్కు, ఆంధ్రుల హక్కు' అనే నినాదంతో జరిగిన ఉద్యమం ద్వారానే మనకు విశాఖలో ఉక్కు ఫ్యాక్టరీ రూపొందింది. ఇందులో ఉక్కు ఉత్పత్తి గణనీయంగా పెరిగిందని గణాంకాలు చెబుతున్నా, ఈ అభివృద్ధి పథకం ఫలితంగా ఏర్పడిన నిర్వాసితుల రూపంలో ఉండే నీడలను నిర్లక్ష్యం చేయడంతో భారీ పరిశ్రమలు సమాజ అభివృద్ధికి మార్గం అని చెప్పే లక్ష్యాన్ని సమాజం చేరుకోలేకపోయింది. ఇదే పరిస్థితి పెద్ద డ్యాంలలో కూడా ఉండటంతో వీటికి వ్యతిరేకంగా ఉద్యమాలు సాగుతూనే ఉన్నాయి. ప్రస్తుతం పోలవరం డ్యాం విషయంలో కూడ ఇదే పరిస్థితి ఉంది. డ్యాం వ్యతిరేక ఉద్యమం వలన నిర్వాసితులు, మహిళా, దళిత, ఆదివాసీ ఉద్యమాల వలన సమాజంలో ఇప్పటి వరకూ చీకటిలో ఉన్న వీరిని వెలుగులోకి తెచ్చి సమాజపు చేతనలో భాగమయ్యేటట్లు చేసాయి. ఈ ఉద్యమాల ప్రభావం వలన వీరి సంక్షేమం కోసం కొన్ని పథకాలు రాక తప్పలేదు. ఆంధ్రదేశంలో ఉద్యమాలు అనంగానే ఇంకొక ముఖ్యమైన ఉద్యమం గురించి చెప్పక తప్పదు. నిరుపేద మహిళల సారథ్యంలో సాగిన సారా వ్యతిరేక ఉద్యమం. సారాని నిషేధించాలని మహిళలు చేసిన పోరాట ఫలితంగా, ఎన్నికల్లో నెగ్గిన ఎన్.టి.ఆర్ తన పదవీ స్వీకార సమయంలోనే సారా నిషేధ చట్టం, రెండు రూపాయలకు కిలో బియ్యం పథకాలకు సంతకం చెయ్యటం జరిగింది. కాని కొంతకాలం తరువాత రెవెన్యూ లోటు అనే కారణం చూపించి వీటిని రద్దు చెయ్యటం కూడ జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తోన్న అభివృద్ధి మార్గాన్నీ ప్రశ్నిస్తున్న బలమైన ఉద్యమంగా నక్సలైటు ఉద్యమాన్ని గుర్తించవచ్చును. ప్రస్తుతం అనుసరిస్తోన్న అభివృద్ధి మార్గంలో వెలుగులు ఉన్నా, చీకటి కూడా విధిగా ఈ వెలుగుని అనుసరిస్తోందనీ, ఈ చీకట్లను అభివృద్ధి వలన నష్టపోయే ప్రజలలో గుర్తించి వీరి కేంద్రంగా అభివృద్ధి పథాన్ని నిర్వచించాలని చెప్పేది నక్సలైటు ఉద్యమం. ఈ ఉద్యమం ప్రభావంగానే రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే భూసంస్కరణలు మరో మలుపు తిరిగాయి. మొదటి రెండు పద్ధతులలో ప్రజాహిత పథకాలకు మూలం బాహ్యప్రపంచంలో చూడటం, వారిని అనుసరిస్తూ పోతే పేద దేశాలు అభివృద్ధి చెందుతాయనటంలో, అంతర్లీనంగా అభివృద్ధికి ఒకే ఒక మార్గం ఉంటుందనే భావన ఉంది. మూడవ పద్ధతిలో పథకాలకు మూలం సమాజపు అంతర్గత అవసరాలలో గుర్తించటం జరుగుతుంది. మూలం ఏదైనా కూడా పథకాలు అమలు చేయబడే నేపథ్యం గురించిన అవగాహన చాలా అవసరం.

3. ప్రతి సమాజం తనకవసరమైన ఉత్పత్తులను తనకు లభ్యమయ్యే వనరులనువయోగించుకొని వస్తూత్పత్తి చేసుకుంటుంది. ఈ వనరులలో ముఖ్యమైనవి మానవశ్రమ, భూమి,పెట్టుబడి, ఉత్పత్తికవసరమైన జ్ఞానంగా గుర్తించవచ్చును. ఈ వనరులలో కొన్ని ప్రకృతిలో లభించేవి అయితే, సమాజం తయారు చేసుకునేవి మరికొన్ని. ఈ వనరులన్నీ సమాజంలో ఒకే సమయంలో 'కొరత' లేకుండా సమృద్ధిగా అందుబాటులో ఉండవు. నిర్దిష్ట స్థల, కాల పరిమితులలో ఒక్కొక్క సమాజంలో, అప్పటికి ఉన్న జ్ఞానం ఆధారంగా, వీటిలో ఒక వనరు మిగతా వనరులతో పోల్చితే, ఉత్పత్తులు పెంచటానికి అడ్డంకిగా, కొరతగా ఉండటంతో ఇది అధిక ప్రాధాన్యతని సంతరించుకొంటుంది. 'కొరత' గా ఉన్న ఈ ప్రధాన వనరు కేంద్రంగా, దీని ఆధారంగా, మిగిలిన వనరులను, ఉపయోగించుకునే విధంగా ఒక సమీకరణ సూత్రం తయారవటంతో వ్యక్తుల మధ్య సంబంధాలు ఏర్పడతాయి. ఈ క్రమంలో ఉత్పత్తిలో హెచ్చుతగ్గులు రాకుండా సక్రమంగా జరగటానికి కొన్ని వ్యవస్థలు, సమాజం స్థిరంగా ఉండటానికి వ్యవస్థలోని వ్యక్తులు ఆచరించవలసిన విధులు, శిక్షార్హమైన చేయకూడని పనులు, వ్యక్తుల మధ్య సంబంధాలు ఏర్పడతాయి.

ఇవన్నీ కలిపి ఆ సమాజానికి ఒక రూపు, ఒక కట్టడి తయారవుతాయి. ఈ కట్టడి సమాజంలోని వ్యక్తుల ఆలోచనలకు, ఆచరణకు, సృజనాత్మకతకు ఒక నేపథ్యం ఇస్తుంది. అంటే ఒక వ్యక్తి నిర్దిష్ట సమాజంలో భాగమైనపుడు ఆ వ్యక్తి ఆలోచనలకు ఈ నేపథ్యం ఒక పరిధిని, పరిమితిని ఇస్తుంది. ఈ నేపథ్యంలో ఒక వ్యక్తి ఆలోచన - ఆచరణక్రమంలో వస్తున్న గమనానికి, సమాజపు గమనానికి, మరొక రకంగా చెప్పాలంటే వ్యక్తి ఆశించే గమనానికి, సమాజ నేతృత్వం యొక్క అవగాహన ఆధారంగా వస్తున్న గమనానికి లంకె కుదిరితే వ్యక్తి, సమాజం ఒకదానినొకటి ప్రభావితం చేస్తూ అభివృద్ధి చెందుతాయి. సమాజపు కట్టడి విలువలు వృత్తిలో కూడ ప్రతిఫలిస్తాయి. ఇక్కడ నేతృత్వం అమలు చేసే పథకాలు సమాజానికి ఒక దిశని నిర్దేశిస్తాయి.

వనరు 'కొరత' ద్వారా సమాజాన్ని గుర్తించే క్రమంలో మానవశ్రమ ప్రాధాన్య సమాజం, (దీన్ని ప్రస్తుత ఆదివాసీ సమాజంలో చూడవచ్చును), భూమి ప్రాధాన్య సమాజం (వ్యవసాయం మీద ఆధారపడే పేద దేశాలు) డబ్బు ప్రాధాన్య సమాజం (పరిశ్రమల ప్రాధానంగా ఉండే అభివృద్ధి చెందిన దేశాలు-ఇక్కడ సైన్సు, టెక్నాలజీ బాగా అభివృద్ధి చెందటం, దాని ద్వారా ఉత్పత్తులు పెరగటంతో దీనికి ఒక విశిష్టత అబ్బింది) ఇంకా జ్ఞాన ప్రాధాన్య సమాజం. బహుశ మార్క్స్ ప్రతిపాదించిన ప్రిమిటివ్ కమ్యూనిజమ్, భూస్వామ్య సమాజం, పెట్టుబడిదారీ సమాజం, సోషలిజం అనే సమాజ విభజనతో 'కొరత' ఆధారంగా ప్రతిపాదించిన సమాజ విభజనకి సారూప్యత ఉండవచ్చును. ప్రతి సమాజానికి ఒక ప్రత్యేకమైన కట్టడి, విలువలు, వ్యక్తికి ప్రత్యేకమైన నేపథ్యం ఏర్పడతాయి. మొదటి రెండు సమాజాలు అభివృద్ధి చెందవలసినవి గాను, చివరి రెండు అభివృద్ధి చెందిన సమాజాలుగాను గుర్తింపు పొందాయి. ప్రపంచంలో డబ్బు ప్రాధాన్య సమాజాలు వచ్చిన తరువాత పేద దేశాలలో 'ప్రజాహిత' ప్రణాళికలకు ప్రాముఖ్యత పెరిగింది. అవే ప్రణాళికలను అనుసరించటం వలన అభివృద్ధి సాధ్యమనే భావన కూడా బలంగానే వచ్చింది. అంతే కాకుండ ఒక సమాజకట్టడి ప్రతిఫలించే విలువలకు, ప్రజాహిత ప్రణాళికలు ప్రతిపాదించే విలువలకు సమన్వయం కుదిరితే ప్రణాళికలు జయప్రదమౌతాయి. అలా కాకుండా వీటి మధ్యన ఘర్షణ ఉంటే ప్రజాహిత ప్రణాళికలు అమలులో విఫలమౌతాయి. ఇక్కడ కొన్ని ఉదాహరణలు చూద్దాం. కుటుంబ నియంత్రణ అనే ప్రజాహిత ప్రణాళికని ఎంచుకుందాం. పేదరికం, నిరక్షరాస్యత, అనారోగ్యం లాంటి ఎన్నో నష్టాలకు మూలకారణంగా అధిక జనాభాని ప్రభుత్వం గుర్తించి కుటుంబ నియంత్రణ పథకం, దానికి అనుబంధ కార్యక్రమాలను అమలులోకి తెచ్చింది. ప్రభుత్వం శ్రమ ప్రాధాన్య ఆదివాసీ సమాజంలో కుటుంబ నియంత్రణ అమలు చేయటానికి ప్రయత్నిస్తే, ఇక్కడ 'శ్రమ చేసే మనిషికి' విలువ ఉంది కాబట్టి కుటుంబంలో మరొక సభ్యుడు అంటే మరొక శ్రామికుడుగా లాభదాయకం కాబట్టి కుటుంబ నియంత్రణ పథకం ఇక్కడ వైఫల్యం చెందుతుంది. అలా కాకుండా డబ్బు ప్రాధాన్య సమాజంలో పుట్టిన మనిషి శ్రామికుడుగా ఎదగటం ఖర్చుతో కూడిన పని కాబట్టి కుటుంబ నియంత్రణ పథకం విజయవంతమయ్యే అవకాశం ఉంది. ఇంకొక ఉదాహరణగా మేము ఇంద్రావతి డ్యాం వలన నిర్వాసితులయ్యే వారి గురించి సేకరించిన వివరాలు ఇలా ఉన్నాయి. డ్యాం వలన నిర్వాసితులయ్యే కుటుంబాలకు చాలా ఉదారంగా భూమికి 'విలువ' కట్టి డబ్బు రూపంలో నష్టపరిహారం ఇవ్వడం జరిగింది. ఈ నిర్వాసితులు శ్రమ ప్రాధాన్య సమాజానికి చెందటం మూలాన మానవశ్రమకి విలువ, దానితో ఒనగూడే సామూహిక జీవన విలువలే తప్ప 'డబ్బు'కి విలువ లేకపోవడంతో డబ్బుని పొదుపు చేసుకోవటం, డబ్బుని పెట్టుబడిగా పెట్టి లాభాలు సంపాదించటం లాంటి పనులకు అర్థాలు తెలియకపోవడంతో, గవర్నమెంట్ ఇచ్చే డబ్బు రూపంలో ఉండే నష్టపరిహారాన్ని కూడా సామూహికంగా విందులు, వినోదాలకు ఖర్చు పెట్టి, బయట ప్రపంచంలో చులకనయ్యారు. అలాగే ఇక్కడ స్త్రీ వ్యవస్థకి కేంద్రం. స్త్రీకి ప్రాముఖ్యత ఉండటంతో, కుటుంబానికి ఇచ్చిన నష్టపరిహారంలో స్త్రీలకు కూడా పురుషులతో సమాన వాటాని ఇచ్చారు. స్త్రీకి విడిగా ఆస్తి హక్కులేని బయట ప్రపంచానికి ఇది విడ్డూరంగానే ఉండవచ్చును కాని వారికి ఇది ఎటువంటి ఒత్తిడులు లేకుండానే స్వాభావికంగానే జరిగిన చర్య.


ఆంధ్రప్రదేశ్‌లో విస్తృత ప్రాచుర్యం పొందిన, సాధన రాసిన 'రాగో' నవలలో శ్రమ ప్రాధాన్య సమాజ విశ్లేషణ, కాళీపట్నం రామారావు గారు రాసిన 'యజ్ఞం' కథలో భూమి ప్రాధాన్య సమాజ విశ్లేషణ మనకు స్పష్టంగా కనిపిస్తాయి. దండకారణ్య ప్రాంతంలో ఒక దళ సభ్యుడైన 'సాధన' రాసిన రాగో నవలలో ఆదివాసీ సమాజపు - వివాహం, కుటుంబ వ్యవస్థ, పితృస్వామ్యపు విలువలు మనకు అర్థమౌతాయి. ఈ నవలలో ఆర్థికపరంగా స్త్రీకి ప్రాముఖ్యత ఉన్నా, స్త్రీకి 'ఖాయిదాలు' (సాంప్రదాయాలు) పేరిట కొన్ని కఠిన నియమనిబంధనలు (ముఖ్యంగా తనకు నచ్చిన వరుణ్ణి ఎంపిక చేసుకోవటంలో) ఉంటాయనీ, వాటికి ఎదురు తిరిగితే కమ్యూనిటీ తీవ్రంగా కొట్టి, తిట్టి, శిక్షించి వెనక్కు తేవటం చూస్తాం. స్త్రీని వివాహమాడే సందర్భంలో ఆమె తండ్రికి 'జీవసారె' (కన్యాశుల్కం) ఇవ్వడంలో ఉద్దేశ్యం పెండ్లి వలన ఆ కుటుంబం శ్రమ చేసే వ్యక్తిని కోల్పోతుందనీ, ఒక వేళ కన్యాశుల్కం ఇవ్వలేకపోతే ఇల్లరికం వచ్చి తన శ్రమని ఉచితంగా ఇవ్వడం అనే 'లామ్' వివాహ పద్ధతి ఉండే శ్రమ ప్రాధాన్య సమాజాన్ని సాహిత్య రూపంలో వివరించటం ఈ నవలలో చూడవచ్చును. రాగో ఈ ఖాయిదాలను ఎదిరించి దళంలో చేరి నాయకురాలుగా ఎదిగే క్రమంలో శ్రమ ప్రాధాన్య సమాజం, దాని విలువలు, ఆ కట్టడి విధించే నియమాలు గురించి వివరణ ఈ నవలలో కన్పిస్తుంది.

కాళీపట్నం రామారావు గారు రాసిన 'యజ్ఞం' కథలో భూమి ప్రధాన సమాజం గురించి అర్థం చేసుకోవచ్చును. కథలో అప్పల్రాముడు పంచాయితీలో చెప్పిన మాటలలోనే సుందరపాలెం గ్రామ గత చరిత్రని చెబుతూ, 'అందరికీ అంతో ఇంతో సెక్క,

ముక్కా ఉండేవి. పొలం దున్నుకుని బ్రతికేవారు. కూలి చేసుకోవటం, భూములు దున్నుకోవటం, పొలంలో రైతులంతా వరి, గంటి, చోడి, జొన్న లాంటి తిండిగింజలే పండించేవారు. అందరికీ తిండి, గుడ్డముక్కలుండేవి. ఏదైనా మిగిలితే బంగారం, వెండి కొని ఆడోళ్ళ మెడకి తగిలించేవోరు. దానాలు, ధర్మాలు చేసేవోరు.. ఇక్కడ వర్తకం పంటలు, పొగాకు వర్తకం, యేరుశనగ, గోగులు వచ్చాయి. పంటల గురించిసావుకార్లు చెప్పేవారు. ఇచ్చిపుచ్చుకోవడాలు దినుసుల్లోనే, క్రమంగా లెక్కలన్నీ రూపాయల చెలామణిలోకి మారాయి. ధరలు ఎప్పుడు పడి ఎప్పుడు లేస్తాయో రైతుకు తెలియని స్థితి. క్రిందున్న సావుకార్లు పైకి, పైనున్న రైతు క్రిందకి... రెక్కలు ముక్కలు చేసుకున్నా కూడా కడుపు నిండని స్థితి. క్రమంగా అప్పుడూ, అప్పుడూ పొలం అమ్మడం జరిగింది... అయిస్కూలు పెట్టించినా, రోడ్లు, ఎలక్ట్రిసిటి, పపింగు మిషన్లు, కాఫీ హోటళ్ళు, కిల్లీ బడ్డీలు... ఇలా వట్నంలో ఏ సదుపాయాలున్నాయో అవన్నీ గ్రామానికి తేవడంతో కొందరి బతుకులు బుగ్గి, ఆ బుగ్గిలెల్లి మరికొందరికి బువ్వపుడతాయి. భూమి అమ్మి అయినా సరే తను సావుకారు దగ్గర చేసిన అప్పును తీర్చివేస్తాననే తండ్రి అప్పల్రాముడు, భూమిని నసేమిరా అమ్మటానికి ఒప్పుకోని తన కొడుకునే నరికివేసిన సీతారాముడు భూమి ప్రాధాన్య సమాజపు కట్టడి ఎలా ఉంటుందో, దానితో డబ్బు ప్రాధాన్య వ్యాపార పంటలు రావటం, దానితో పాటే వచ్చిన సంక్షోభం వివరిస్తుంది.

4. ప్రతి సమాజానికి అందుబాటులో ఉన్న వనరులతో ఉండే ప్రాధాన్యత మూలాన దానికి ఒక కట్టడి, ఒక నేపథ్యం రూపుతీసుకుంటుంది. ప్రజల అవసరాలను తీర్చే లక్ష్యంతో సమాజపు నేతృత్వం కొన్ని ప్రజాహిత పథకాలను ప్రవేశపెడుతుంది. ఈ క్రమంలో వేరొక నేపథ్యంలో విజయవంతమైన అభివృద్ధి పథకాలను, అభివృద్ధికి ఒకే ఒక మార్గం ఉంటుందనే భావనతో, ప్రజాహిత పథకాలుగా నిర్ద్వంద్వంగా, విచక్షణారహితంగా ఇంకో నేపథ్యంలోఅదే లక్ష్యాలను సాధించే ఉద్దేశ్యంతో ప్రవేశపెట్టడం వలన అవి నిరుపయోగంగా మారి విఫలమయ్యే అవకాశముంటుంది. ఈ పథకాల వలన కొంత వెలుగు వచ్చినా, లక్ష్యాన్ని కొంత సాధించగలిగినా, ఈ క్రమంలో కొంతమంది చీకటిలోకి నెట్టబడతారు. చీకటిలోంచి వీరు వెలుగులోకి వచ్చినపుడే సమాజం రూపాంతరం చెందే అవకాశం ఉంటుంది. దీనికి ముఖ్యంగా సమాజపు నేపథ్యం ఏమిటి? ఇది ప్రతిఫలించే విలువలు, లక్ష్యాలు ఏమిటి? పథకాలుప్రతిపాదించే లక్ష్యం, విలువలు ఏమిటి? ఈ రెంటికి పొంతన ఉందా లేదా అనే విషయాలు గమనించాలి. అంతేకాకుండా పథకాలు ప్రతిపాదించే లక్ష్యాన్ని సమాజం చేరుకోగలదా లేక పథకాలు సమాజం ఆశించే లక్ష్యాన్ని తీసుకురాగలవా అనే అంశం మీద కూడ ఒక అభిప్రాయం ఉండాలి. ఒకవేళ పథకాలు విఫలమైతే మొదటి అభిప్రాయం ప్రకారం దానికి కారణం సమాజంలో ఉండే లోపాలలో వెతుక్కుంటే, రెండవ అభిప్రాయం ప్రకారం సమాజ కట్టడికి- పథకాలకు ఉండవలసిన పొంతన గురించిన అవగాహన గుర్తించడం జరుగుతుంది.

ఇంకొక ముఖ్య విషయం- తాత్విక ధోరణిలా కనిపించినా సమాధానం కావలసిన ప్రశ్న. కొత్త సమాజం, కొత్త కట్టడి ఒక రూపు తీసుకుంటూ నిర్మాణం జరిగే క్రమంలో పాత సమాజం, పాత కట్టడి ధ్వంసమైపోతాయా? అంటే నిర్మాణం, విధ్వంసం, అనే ఈ రెండు ప్రక్రియలు ఏకకాలంలోనే జరిగే రెండు ప్రక్రియలా లేక ఇవి రెండు వేరు వేరు సమయాలలో, ఒకదానితో మరొకదానికి సంబంధం లేకుండా విడివిడిగా జరిగే ప్రక్రియలా? ఇటువంటి పరిస్థితిలో కొత్త నిర్మాణం కూడా పాత కట్టడి బలం వలన విధ్వంసంగా మారిపోయే ప్రమాదముంటుందా? ఈ ప్రశ్నల మీద ఒక అభిప్రాయం కావలసి ఉంటుంది. ఇంకొక ముఖ్య విషయం అభివృద్ధికి మార్గం ఏకైక మార్గమా కాదా? ఐ.టి. ప్రాముఖ్యత బలంగా ఉన్న ఈ సందర్భంలో మాజీ ప్రధానమంత్రి దేవెగౌడ దీనికిస్తున్న ప్రాముఖ్యతని ప్రశ్నించటం ద్వారా ఏకైక మార్గం ద్వారానే అభివృద్ధి సాధ్యమనే భావనని ప్రశ్నించినట్లు అర్థం చేసుకోవచ్చును. ❑



ఆదివాసీల అటవీహక్కుల గుర్తింపు బిల్లు - 2005 ఒక పరిశీలన

| గుంటి రవి |

ఇటీవల కేంద్ర ప్రభుత్వ గిరిజన వ్యవహారాల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో 'షెడ్యూలు తెగల అటవీహక్కుల-గుర్తింపు బిల్లు 2005' పేరుతో ముసాయిదా బిల్లును తీసుకురావడం జరిగింది. ఈ ముసాయిదా బిల్లులో బ్రిటిష్ వలస పాలకులు తమ దేశంలోని అటవీ ఆధార పరిశ్రమలకు కావలసిన ముడిసరుకులను తరలించే క్రమంలో అనేక ఆదివాసీ వ్యతిరేక అటవీ చట్టాలను ప్రవేశపెట్టటం వల్లనయితేనేమి, స్వాతంత్ర్యానంతరం అడవులను జాతీయ ఆస్తిగా పరిగణించి దానిని రక్షించుకోవాలనే ఉద్దేశ్యంతో తయారుచేసిన అటవీ విధానం వల్లనయితేనేమి ఇప్పటివరకు ఆదివాసులకు జరిగిన అన్యాయాన్ని 'చారిత్రక' అన్యాయంగా ప్రస్తావించడం జరిగింది.

ఈ ప్రస్తావన అనేక ఆలోచనలకు, సందేహాలకు తావిచ్చి పలు ప్రశ్నలను లేవనెత్తింది. అదేవిధంగా ఈ బిల్లు ముందుకు వచ్చిన సందర్భం కూడా దీనికి అవకాశం కల్పిస్తా వుంది. ఎందుకంటే ప్రపంచీకరణలో భాగంగా శరవేగంగా ముందుకు వస్తున్న సరళీకృత నూతన ఆర్థిక విధానాలు ప్రపంచ సమాజాలన్నింటిలో విస్తారంగా వున్న సహజ వనరులన్నింటినీ అడవులతో సహా కారుచౌకగా వీలయినంత వేగంగా వినియోగించుకోవాలనే ఆకాంక్షలను తెలుపుతున్నాయి. ఇటువంటి అవకాశం కొరకు ఎదురుచూస్తున్న ప్రపంచ బహుళజాతి సంస్థలు సహజంగానే అటవీ ప్రాంత సంపద మీద, వనరుల మీద, విలువైన ముడిపదార్థాల మీద, మరీ ముఖ్యంగా గిరిజన ప్రాంతాల మీద కన్ను వేశాయి. ఇప్పటికే ప్రపంచ బ్యాంక్ మార్గదర్శకత్వంలో, 'సాముదాయక అటవీ యాజమాన్య పథకం', 'వన సంరక్షణ సమితులు' వంటి కార్యక్రమాలు చేపట్టి సహజ వనరులను ప్రయివేటీకరించే ప్రక్రియను అమలుపర్చుతున్న ప్రభుత్వం ఈ తరుణంలో తెచ్చిన ఈ బిల్లు ముసాయిదా సహజంగానే గిరిజనుల అటవీహక్కుల విషయంలో ప్రభుత్వ నిబద్ధతకు సంబంధించి సహజంగానే అనేక అనుమానాలకు - ప్రశ్నలకు అవకాశం కల్పిస్తా వుంది.

గతంలో ఆదివాసీ సముదాయాలకు, అడవులకు సమీపంలో వెలసిన ఆధునిక పరిశ్రమల వల్ల, వాటి వాణిజ్యపరమైన కొత్త అవసరాలవల్లా అడవులపై విపరీతమైన వత్తిడి పెరిగింది. పెరిగిన నూతన పారిశ్రామిక అవసరాలు ప్రభుత్వానికి ప్రధానమైన ఆధారమయ్యాయి. ఈ కారణంగానే విశాలమైన అడవులను ప్రభుత్వం మరెవరూ ప్రవేశించటానికి వీలులేని విధంగా రిజర్వ్ అటవీ ప్రాంతాలుగా ప్రకటించి మొత్తం తన ఆధిపత్యం క్రిందికి తెచ్చుకుంది. అడవుల్లో నివసిస్తున్న ఆదివాసీ సముదాయాలను క్రమంగా అటవీశాఖ వెళ్ళగొట్టడం లేదా అడవిలోకి ప్రవేశం నిరాకరించడమో అమలు చేసింది. అప్పటివరకు అడవినే అన్నింటికీ నమ్ముకొని పూర్తిగా అటవీఉత్పత్తులపైనే జీవితం సాగే ఆదివాసీ సాముదాయాలకు రిజర్వ్ అటవీ విధానం కోలుకోలేని దెబ్బతీసింది. ఈ విధానంతో మొట్టమొదటిసారి అడవిపై ఆదివాసులకు వుండే సాంప్రదాయిక హక్కులకు ఈ విధానం వల్ల సంక్రమించుకున్న ఆధిపత్యానికి మధ్య ఘర్షణ మొదలైంది. ఈ క్రమంలో ఆదివాసులు తమ సమిష్టి హక్కుగా తరాల తరబడి భావిస్తూ వచ్చిన అడవిపై ఆంక్షలు విధించిన ప్రభుత్వాలపై అనేక తిరుగుబాట్లు చేశారు.

ఈ చారిత్రక నేపథ్యంలో ముందుకు వచ్చిన 2005వ ముసాయిదా బిల్లు కూడా ఆదివాసులకు గల అటవీ హక్కులపై షరతు విధించడంలో ప్రభుత్వం వైఖరిని శంకించాల్సి వస్తుంది. అంతేకాకుండా ఇప్పటివరకు అమలులో వున్న అటవీ చట్టాల వల్ల ఉత్పన్నమవుతున్న అపరిష్కృత సమస్యలకు, వైరుధ్యాలకు సరైన పరిష్కార మార్గాలు అన్వేషించకుండానే గిరిజనులకు అడవిపై హక్కులు కల్పిస్తున్నామని చెప్పడం విడ్డూరమే అవుతుంది

ముఖ్యంగా స్వాతంత్ర్యానంతరం మొట్టమొదటిసారి 1952 సంవత్సరంలో ఆమోదించబడిన జాతీయ అటవీ విధానం ఆచరణలో అడవులను సంరక్షించడంలో విఫలమవ్వడమే గాక, ఆదివాసులకు, మైదాన ప్రాంత ప్రజలకు మధ్య సమస్యలను పెంచింది. అదే సందర్భంగా ఇది అటవీయాజమాన్య విధానాలకు, ప్రజావసరాలకు మధ్య వైరుధ్యాల్ని పెంచింది. ఆ తరువాత వచ్చిన 1972 నాటి అటవీ సంరక్షణ చట్టం వన్యప్రాణులు సంచరించే ప్రాంతాలలో నివసించే ఆదివాసీ ప్రజలను బలవంతంగా నెట్టివేసే అధికారాలను ఫారెస్ట్ శాఖకు దఖలు పర్చింది. దాంతో ఆవిధంగా అడవి నుండి తరిమి వేయబడిన గిరిజనుల రీసెటిల్‌మెంట్‌కు సరైన ప్రత్యామ్నాయ మార్గాలు చూడబడలేదు. దీనికితోడు ఈ చట్టంలో రెండురకాల రక్షిత అడవులుగా వర్గీకరించి, అడవులే ఆధారంగా జీవిస్తున్న గిరిజనప్రజలను క్రమంగా అటవీప్రాంతాల నుండి దూరం చేశారు. దీనివల్ల రక్షితప్రాంత అధికార యంత్రాంగానికి,స్థానిక గిరిజన ప్రజలకు మధ్య అనేక సంఘర్షణలు జరుగుతూనే వున్నాయి.

ఈ విధంగా వివిధ రకాల చట్టాల పేర్లతో గిరిజనులను అడవి నుండి దూరం చేస్తూనే నేటి 2005వ ముసాయిదా బిల్లు మరో భయంకరమైన షరతు కూడా విధించింది. అదేమంటే అక్టోబర్ 25, 1980 సంవత్సరం ముందుగా కానీ లేక కేంద్ర ప్రభుత్వ అధికార గెజిట్‌లో ప్రకటించే తేదీకి ముందుగా ఆదివాసీ తెగలు అటవీ భూమిని స్వాధీనంలో వుంచుకొని వుండి వుండాలని చెబుతూ వుంది. అనగా ఇంతకుముందు వున్నవారినే గుర్తించి హక్కులు కల్పిస్తామని బిల్లు పెడుతున్నారు. దీనర్థం 1980వ సంవత్సరం తరువాత నుండి సాగు చేస్తున్న అటవీ భూముల నుండి ఆదివాసులను బలవంతంగా తరిమి వేసే అవకాశం వుంది. ఇప్పటికే ఇలాంటి సంఘటనలు దేశవ్యాప్తంగా చోటు చేసుకుంటున్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే అడవులనుండి గిరిజనులను తరిమివేయడానికి ప్రజా సమ్మతితో చట్టబద్ధతను

కల్పించుకోవడమే. ఈ బిల్లు ముసాయిదాలో అనేక అంశాలు లోపభూయిష్టంగా వున్నాయి. ఈ బిల్లు ద్వారా వన్యప్రాణుల సంరక్షణకు ఇచ్చిన ప్రాధాన్యత మనుషులకు అంటే గిరిజనులకు వారి హక్కులకు ఇవ్వడం లేదు. గిరిజనులకు అడవిపై కనీస అవసరాలు తీర్చుకునే హక్కులు కల్పించబడ్డాయే తప్ప వాణిజ్య పరమైన హక్కులు తిరస్కరించబడ్డాయి. ప్రభుత్వం వాణిజ్య హక్కులను ప్రయివేటు లేదా బహుళజాతి సంస్థలకు దఖలు పర్చే ఉద్దేశ్యంతోనే ఈ విధమైన ముసాయిదాను రూపకల్పన చేసింది.

ఈ ముసాయిదా బిల్లు గ్రామసభకు కొన్ని పరిమితులతోకూడిన అధికారాలను కల్పించింది. ముఖ్యంగా అటవీ సంపదను అవసరాలకు వాడుకోవడం, సంపదను దుర్వినియోగం చేసిన వారిపై ఫిర్యాదు చేయడం వంటి వాటిని గ్రామ సభకు కల్పించింది. కాని గ్రామ సభ నిర్ణయాలు ఆచరణలోకి రావాలంటే పై కమిటీల అనుమతి తప్పనిసరి. గ్రామసభ కంటే ఉన్నత కమిటీలైన సబ్ డివిజన్ కమిటీలు, జిల్లా కమిటీల నిర్ణయాలే చెల్లుబాటు అవుతాయి. ఈ సబ్‌డివిజన్ మరియు జిల్లా కమిటీలలో అటవీ అధికారులు, రెవెన్యూ అధికారులు వుంటారు. మరోవిధంగా చెప్పాలంటే అసలైన విధాన నిర్ణయాలు ప్రభుత్వ అధికారుల చేతుల్లో వుండగా గ్రామసభ నామమాత్రపు ఆమోద సభ మాత్రమే. అనగా గ్రామసభకు అధికారాలను కట్టబెట్టడం ద్వారా గిరిజనులకు అటవీ హక్కులు కల్పించబడ్డాయనేది వాస్తవంలో వట్టి బూటకం మాత్రమే.

ఇప్పటికే గిరిజనుల విధానాలకు సంబంధించి అనేక సందర్భాలలో రెవెన్యూ అధికారులకు, ఫారెస్ట్ అధికారులకు మధ్య వివాదాలున్నాయి. రెవెన్యూ అధికారులు ఇచ్చిన పట్టాలను ఫారెస్ట్ అధికారులు గుర్తించడం లేదు. ఆదివాసులు సాగు చేసుకుంటున్న భూములు చాలావరకు రిజర్వ్ ఫారెస్ట్ క్రిందకు వస్తాయన్న ఫారెస్ట్ అధికారుల వాదన ఫలితంగా గిరిజనులు భూమిమీద హక్కులు కోల్పోతున్నారు. ఈ ముసాయిదా బిల్లు దీనికి పరిష్కారమార్గం చూపించకపోగా ఈ రెండు శాఖల మధ్య వైషమ్యాలు పెరిగే అవకాశం వుంది.

ఈ బిల్లు పేర్కొన్న మరో ముఖ్యమైన అస్పష్ట నిర్ణయం ఏమంటే రాష్ట్రస్థాయిలో ఈ గిరిజనుల హక్కుల చట్టాన్ని పర్యవేక్షించే మానిటరింగ్ కమిటీలో రెవెన్యూ, ఫారెస్ట్ అధికారులతో పాటు పౌర సమాజ ప్రతినిధులుంటారనే విషయాన్ని పొందుపరచారు. పౌర సమాజ ప్రతినిధులంటే - గిరిజన ప్రజా ప్రతినిధులా ? ప్రభుత్వం నామినేట్ చేసే సభ్యులా ? లేదా గిరిజన తెగల పెద్దలా ? అనే విషయాన్ని స్పష్ట పరచాల్సిన అవసరం వుంది.

గ్రామసభకు విధాన నిర్ణయాలలో భాగస్వామ్యము లేకుండా కేవలం ప్రభుత్వ అధికారుల చేతల ద్వారా గిరిజన హక్కులు కాపాడబడతాయనేది ఆచరణలో సాధ్యం కాదనే విషయం తెలిసి కూడా ప్రభుత్వం ఈ ప్రతిపాదన చేయడం గిరిజనుల పట్ల వివక్ష చూపడమే. వన్యప్రాణుల సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ, అడవుల రక్షణ, బయో డైవర్సిటీ వంటి అంశాల మీద గ్రామసభకు గల బాధ్యతను నిర్వహించే క్రమంలో శాసనసభలు అడ్డుపడకుండా వుంటాయా అనే విషయంల్లో ఈ బిల్లు ఒక సందిగ్ధతనే మిగిల్చింది. అదేవిధంగా గ్రామసభ ప్రతిపాదనలను పైఉన్నత స్థాయి కమిటీలైన సబ్ డివిజన్ కమిటీలు, జిల్లా కమిటీలు అంగీకరిస్తాయనే గ్యారంటీ లేదు. ముఖ్యంగా నేటికీ అమలులో వున్న వివిధ చట్టాలు, ఉదాహరణకు 1972 నాటి భారత అటవీ చట్టం, 1980 నాటి చట్టం, 2002 నాటి వన్యప్రాణుల సంరక్షణ చట్టం మొదలైన చట్టాలన్నీ ప్రభుత్వ అధికారులకు తిరుగులేని అధికారాలను కట్టబెట్టాయి.

అదేవిధంగా రిజర్వ్‌డ్ అడవులు, రక్షిత అడవులు, జాతీయ పార్కుల వంటి అంశాల మీద గతంలో లాగా ప్రభుత్వ అధికారగణానికే పెత్తనం వుంటుందా ? లేక గ్రామసభకు సదరు అధికారాలను బదలాయించడం జరుగుతుందా అనే విషయాలపట్ల ఈ బిల్లు అస్పష్టతనే కలిగివుంది. ఈ అంశాలమీద గ్రామసభకు అధికారాలు ఇవ్వడం లేదా ఇవ్వకపోవడం అనే దానిమీదనే గిరిజనుల అటవీ హక్కుల నిజ స్వరూపం తెలుతుంది. దీనిమీద ప్రభుత్వం ఒక స్పష్టమైన వైఖరికి ప్రకటించాల్సి వుంది.

అభివృద్ధి పేరిట ఆదివాసీ ప్రాంతాల్లో నిర్మించబడుతున్న భారీ ప్రాజెక్టులు, డ్యాంలు, గనుల తవ్వకాలు, జాతీయ పార్కుల వల్ల నేటికి సుమారు పది లక్షల గిరిజనులు నిర్వాసితులైనారు. వారికి తగిన ప్రత్యామ్నాయ సదుపాయాలు కానీ, నష్టపరిహారం కానీ, పునరావాస సౌలభ్యం కానీ కల్పించబడడం లేదు. గిరిజనులకు కనీసం ముందుగా సమాచారం ఇవ్వకుండానే బలవంతంగా తరిమివేయడం జరుగుతుంది. ఈ ముసాయిదా బిల్లులో ఆదివాసుల అవసరాలు మేరకు గ్రామ సభ అనుమతితోనే ఇటువంటి నిర్మాణాలు చేపట్టాలనే అంశాన్ని పొందుపరచాల్సిన అవసరం ఎంతైనా వుంది. మరో ముఖ్య విషయమేమంటే గిరిజనుల హక్కులంటే గిరిజనుల సాంప్రదాయక హక్కులుగా భావించాలి. గిరిజనుల అటవీహక్కులు అనగా గిరిజనులకు సాంప్రదాయకంగా అడవిపై హక్కులుగా గుర్తించాలి. ఈ ముసాయిదా బిల్లు గిరిజన సాంప్రదాయక హక్కులకు సంబంధించిన ప్రస్తావన ఎక్కడా చేయలేదు. కాబట్టి ఈ బిల్లులో సాంప్రదాయక హక్కుల చట్టంలో గిరిజన సాంప్రదాయ హక్కులను గుర్తించాలి.

భారత సామాజిక, రాజకీయ వ్యవస్థల్లో అనేక విధాల వివక్షలకు గురవుతున్న అట్టడుగు గిరిజనుల హక్కులకు సంబంధించి పారదర్శకతతో, వివిధ ప్రజాసంఘాలతో, సంస్థలతో గిరిజన సమస్యల పట్ల అవగాహన కల్గిన మేధావులతో సమగ్రపద్ధతుల్లో విస్తృతంగా చర్చించి, జాతీయ ప్రయోజాల నెపంతో ఆదివాసీ ప్రయోజనాలు కాలరాయబడకుండా వుండే సమగ్రమైన చట్టాన్ని రూపొందించాలి.

దాదాపు ఆరు దశాబ్దాల భారతదేశ స్వతంత్ర పాలనలో ఆదివాసీ ప్రజలు అభివృద్ధి పేరిట నిర్వాసితులను చేయడం, నిర్ణయాధికారంలో భాగస్వామ్యాన్ని నిరాకరించడం, గిరిజనులను ఆవాసాల నుండి తొలగింపుకు గురి చేయడం వంటి అన్ని రకాల వివక్షలకు గురియైన క్లిష్ట సమయంలో ఆదివాసీలు తమదైన జీవన విధానాన్ని రూపుదిద్దుకునే ప్రత్యామ్నాయ మార్గాలు అనుసరిస్తున్న క్రమంలో సమగ్రమైన వివరణలతో కూడిన గిరిజన చట్టం రూపొందించాలి.

❑

ఆర్. టి. సి. ని పరిరక్షించడం రాష్ట్ర ప్రజలందరి బాధ్యత

| జె. శ్రీధర్ |

సుదీర్ఘ చరిత్ర కలిగి, అత్యధిక మంది కార్మికులతో (లక్షా ఇరువయి వేలు) దేశంలో గుర్తింపుగల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఎపిఎస్ఆర్టిసి) భవిష్యత్తును రాష్ట్ర ప్రభుత్వం ఏం చేయాలనుకుంటుంది అనేది ఈ మధ్యకాలంలో చర్చనీయాంశమైంది. పదిహేడు నెలల క్రితం ఎన్నికల సందర్భంలో ఆర్టిసిని రక్షిస్తామని వై.యస్.రాజశేఖరరెడ్డి నాయకత్వంలో కాంగ్రెసు పార్టీ ప్రజలకు వాగ్దానం చేసింది. ఈమధ్యకాలంలో ఆర్టిసి కార్మికులు రెండుసార్లు సమ్మె చేశారు. ఏమీ సాధించకుండానే సమ్మెను విరమించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనలు, ప్రతిపాదనలకు ప్రతిబంధకాలు లేకుండా ముందుకు సాగితే సమీప భవిష్యత్తు లోనే ప్రైవేటీకరణ పెనుభూతం ఆర్టిసీని కబళించనున్నది.

రోడ్లు ఆర్టిసి గుత్త సొత్తా, అని ప్రైవేటు ట్రాన్స్‌పోర్టు కంపెనీ ఆసామీ ఎవరైనా ఈ ప్రశ్న వేసి ఉంటే మనం ఆందోళన చెందవలసిన అవసరం లేదు - ముఖ్యమంత్రి వై.యస్. రాజశేఖరరెడ్డి ఈ విధంగా ప్రశ్నించినపుడు మనం కలత చెందకుండా ఎలా వుండగలం. రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ భవిష్యత్తుకు ఈ ప్రశ్న ఒక అపశకునంగా ధ్వనిస్తుంది. ఆర్టిసి ని ఏడు వేర్వేరు సంస్థలుగా విభజించి ప్రైవేటు యాజమాన్యాలకు అప్పగించడానికి, స్వచ్ఛంధ ఉద్యోగ విరమణ పథకం ద్వారా ఉద్యోగులను వదిలించుకోవడానికి, సంస్థఆస్తులకు వెలకట్టి అమ్మి అప్పులు తీర్చడానికి మన పాలకులు పూనుకుంటున్నారు. ఇందుకొక రహస్య నివేదికనుకూడా సిద్ధం చేసుకున్నారు. ప్రపంచబ్యాంకు, బ్రిటన్‌కు చెందిన డిఎఫ్ఐడి ల సహకారంతో ఆడమ్‌స్మిత్ కన్సల్టన్సీలనే విదేశీ సంస్థ ఈ నివేదికను రూపొందించింది. ఆ నివేదిక సూచించిన చర్యలను 2007 నాటికి పూర్తిగా అమలు పరచాలన్నది ప్రభుత్వ సంకల్పం.

ప్రపంచబ్యాంకు కనుసన్నలలో సరళీకరణ విధానాలను చంద్రబాబు ప్రభుత్వం వేగంగా అమలు జరిపింది. ప్రపంచబ్యాంకు ఒప్పందంలో భాగంగా ఆర్టిసి ని ప్రైవేటీకరించడానికి పథకం ప్రకారం చర్యలు చేపట్టింది. 1995లో చంద్రబాబు ముఖ్యమంత్రి పదవి చేపట్టే నాటికి ఆర్టిసి 127 కోట్ల రూపాయలు లాభాలలో వుంది. 1996-97 వరకు లాభాల్లోవున్న ఆర్టిసి, చంద్రబాబు చేపట్టిన అనేక చర్యల వల్ల 1997-98లో దాదాపు 50 కోట్ల రూపాయల నష్టంతో నష్టాలబాటలో పడింది. ఒక్క ఆర్టిసి వాహనాల పైనే అధిక మొత్తంలో పన్నులు వేసే విధంగా మోటారు వాహనాల పన్ను విధానాన్ని చంద్రబాబు ప్రభుత్వం మార్పుచేసింది. దీని ద్వారా 1995-96 నుండి 1999-2000 కాలంలో 1134.68 కోట్ల రూపాయల పన్నులు ఆర్టిసి నుండి వసూలు చేసుకుంది. విద్యార్థులకు, వివిధ వర్గాల ప్రజలకు ఇస్తున్న రాయితీలతో పాటు, జన్మభూమి, రైతుబజార్లు తదితర ప్రభుత్వ పథకాలకై ఇష్టం వచ్చినట్లు చంద్రబాబు ప్రభుత్వం ఆర్టిసిని వినియోగించుకుంది. 1995-96 నుండి 1999-2000 కాలంలో ఈ రూపేణా ఆర్టిసి 405 కోట్ల రూపాయలు ఆదాయాన్ని కోల్పోయింది.

చంద్రబాబు ప్రభుత్వం ఆర్టిసిని ఇలాంటి విపత్కర పరిస్థితులలోకి నెట్టిన స్థితిలోనే ఆర్టిసి కార్మిక సంఘాలు ఆర్టిసి పరిరక్షణకు నడుంబిగించాల్సిన స్థితికి నెట్టబడ్డాయి. ఈ దిశగా 2001లో 24 రోజులపాటు సాగిన చారిత్రాత్మక సమ్మె కొన్ని విజయాలను సాధించింది. కొంతమేరకు పన్నుల భారాన్ని ఆర్టిసి తగ్గించుకోగలిగింది. ప్రభుత్వం నుండి రాయితీల భారాన్ని కొంత రాబట్టుకోగలిగింది. ఇవి పరిమిత విజయాలే అయినప్పటికీ ప్రైవేటీకరణ వైపుగా సాగుతున్న స్పీడుకు ఈ సమ్మె కొంత అడ్డుకట్ట వేయగలిగింది. ఆర్టిసికి సంబంధించిన అనేక విషయాలను ఈ సమ్మె బట్టబయలు చేసింది. సమ్మెలో కార్మికుల ఐక్యత, దృఢదీక్ష ముందు చంద్రబాబు ప్రభుత్వ హైటెక్కు జిత్తులు తలవంచక తప్పలేదు.

శాసనసభ ఎన్నికల ప్రచారంలో రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థను ప్రైవేటీకరించవలసిన అవసరం లేకుండా పరిరక్షిస్తామని కాంగ్రెసు పార్టీ హామీ ఇచ్చింది. అయితే అధికారంలోకి వచ్చిన తరువాత ఆ ప్రభుత్వ అధినేత పూర్తి విరుద్ధ వైఖరిని అనుసరిస్తున్నారు. ఆడమ్‌స్మిత్ కన్సల్టన్సీ రహస్య నివేదిక ఐదవ అధ్యాయంలో ప్రైవేట్ ఆపరేటర్లకు స్టేజి క్యారేజి పర్మిట్లు ఇవ్వాలని పేర్కొనబడింది. ఆర్టిసి ప్రైవేటీకరణ ప్రక్రియను ఏ విధంగా అమలు పరచాలో కాలపట్టికతో సహా సూచించింది. సంస్థలో పనిచేస్తున్న 26,108 మంది ఉద్యోగులను 2007 సంవత్సరం నాటికి నాలుగు విడతలుగా విఆర్ఎస్ ఇచ్చి ఇంటికి సాగనంపాలని ఆ నివేదిక స్పష్టం చేసింది. ఇందుకయ్యే 940.72 కోట్ల రూపాయలను ఆర్టిసికి ప్రభుత్వం అప్పుగా ఇస్తుంది. బస్సు ఒక్కొక్కటి 5 లక్షల రూపాయిలకు విక్రయించి వచ్చే 900 కోట్లు, సంస్థకు చెందిన 212 డిపోలలో 165 నుంచి 175 వరకు అమ్మి, వచ్చే 80 కోట్ల రూపాయలతో ప్రభుత్వ రుణాన్ని తీర్చుకోవచ్చని ఆ రహస్య నివేదిక చెప్పింది. బస్సులు, డిపోలను ఒక్కసారిగా అమ్మకానికి పెడితే గుట్టురట్టవుతుందని, అంచెలంచెలుగా అమ్మాలని కూడా ఆ రహస్య నివేదిక హెచ్చరించింది.

దాదాపు పది సంవత్సరాలుగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న తప్పుడువిధానాలే నేటి ఆర్టిసి నష్టాలకు అసలు కారణం. అధిక పన్నులు, ప్రయాణికుల రాయితీలు తిరిగి చెల్లించకపోవడం, అక్రమ రవాణాను అరికట్టకపోవడం తదితర అనేక విషయాలు నష్టాలకు కారణం. ఆక్యుపెన్సీ రేషియో ఒక్క శాతం తగ్గితే దాదాపు

50 కోట్ల రూపాయలు నష్టం వస్తుందని యాజమాన్యం ప్రకటిస్తున్నది. గత 10 సంవత్సరాలలో ఆక్యుపెన్సీ రేషియో 76 నుండి 60 శాతానికి పడిపోయింది. ఇది తిరిగి ఇటీవల 63 శాతానికి పెరిగింది. మహారాష్ట్రలో ఒక్క కిలోమీటర్‌కు పద్నాలుగు రూపాయల ఆదాయం వస్తుంటే మన ఆర్‌టిసి పదకొండు రూపాయల ఆదాయంతో ఏడవ స్థానంలో వుంది. కాంట్రాక్టు టూరిస్టు క్యారియర్లుగా పర్మిట్లు తీసుకుంటున్న ప్రైవేటు ఆపరేటర్లు వాటిని స్టేజి క్యారియర్లుగా నడుపుతూ కోట్ల రూపాయలు ఆర్‌టిసి ఆదాయానికి గండి కొడుతున్నారు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నులలో కూడా టోకరా కొడుతున్నారు. ఈ వాహనాలు చాలా వరకు చట్ట విరుద్ధంగా ప్రయాణికులను తిప్పుతున్నాయి. ఉద్దేశపూర్వకంగానే ప్రభుత్వం వీటిని నియంత్రించేందుకు చర్యలు తీసుకోవటం లేదు. సంవత్సరానికి దాదాపు 500 కోట్ల రూపాయల ఆదాయాన్ని దీని వల్ల ఆర్‌టిసి కోల్పోతున్నది.

ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడానికే సంస్కరణలు అని చెబుతున్నారు. అయితే అవి అసలు సంస్థకే ఎసరు పెట్టడానికేనని రహస్య నివేదికను పరిశీలిస్తే అర్థమవుతుంది. ఒక రూటులో బస్సులు సమయపాలన పాటిస్తున్నాయా లేదా అని సంస్థ ప్రధాన కార్యాలయం నుంచే కంప్యూటర్ ద్వారా పరిశీలించడానికి గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్‌ను ప్రవేశపెట్టాలని రహస్య నివేదిక పేర్కొంది. ఇందుకు ఒక్కోబస్సుకు పదమూడు వేల రూపాయలు ఖర్చు అవుతుంది. పర్మిట్లు, లైసెన్సింగ్ విధానం, పన్నులు సరళీకరించడానికై చట్టాలను సవరించి ప్రైవేటు ఆపరేటర్లకు అవకాశాలు కల్పిస్తే వారు ప్రజలకు మంచి సేవలు అందిస్తారని నివేదిక చెప్పింది. మరి ఈ పనులన్నీ చేయడానికి ఆర్‌టిసి వ్యవస్థను సమూలంగా మార్చాలి. కనుక ఆర్‌టిసీని ఏడు లిమిటెడ్ కంపెనీలుగా విభజించాలని నివేదిక సూచించింది. ఇందులో నాలుగు బస్సు ఆపరేటింగ్ కంపెనీలు కాగా మిగతా మూడు వర్క్‌షాపు, ట్రైనింగ్, డైరక్టర్లతో పాటు ప్రత్యేక అధికారాలు ఉంటాయి. సంస్థను విభజించిన తరువాత మినీబస్సులు ప్రవేశపెట్టడంతోపాటు, తక్షణమే 37 బస్ డిపోలు, తిరుపతి వర్క్‌ఫార్మ్‌ను మూసివేయటం, మిగిలిన బస్‌స్టేషన్లలో ప్రైవేటు ఆపరేటర్లను వినియోగించుకోవాలని, బహిరంగ టెండర్ ద్వారా ఆర్‌టిసి ఆస్తులను బహుళజాతి గుత్త సంస్థలకు అప్పగించాలని ఆ రహస్య నివేదిక పేర్కొంది. ప్రైవేటీకరణ ప్రక్రియ అంతా రెండున్నర సంవత్సరాల్లో పూర్తి కావాలని నిర్దేశించింది.

ఆర్‌టిసిపై రాజశేఖరరెడ్డి ప్రకటించిన ప్యాకేజి వట్టి బూటకం. ఆర్‌టిసి వ్యవహారంలో వై. యస్. రాజశేఖరరెడ్డి గంటకో మాట, రోజుకో ప్యాకేజి ప్రకటిస్తూ రాష్ట్ర ప్రజలను తికమక పెడుతున్నారు. మొదట ఆర్‌టిసి ఆస్తులనూ అమ్ముకోమని ముఖ్యమంత్రి సలహా ఇచ్చారు. రెండవరోజు కూడా సమర్థించుకున్నారు. దీనిపై తీవ్ర వ్యతిరేకత రావటంతో మళ్ళీ తెల్లవారే 640 కోట్ల రూపాయల ప్యాకేజిని ప్రకటించారు. ఇందులో కూడా అంకెల గారడీ వుంది. నాలుగు రోజులు తిరగక ముందే 640 కోట్ల రూపాయల ప్యాకేజి రద్దు చేసి తిరిగి కొత్త ప్యాకేజి ప్రకటించారు. మొదటి ప్యాకేజిలో ఎమ్.వి. టాక్సును తగ్గించకుండా మూడు సంవత్సరాల పాటు సంవత్సరానికి 100 కోట్ల చొప్పున రాయితీ ప్రకటించారు. తిరిగి దానికి బదులు ఎమ్.వి. టాక్సును కర్ణాటక తరహాలో ఐదు శాతం, ఏడు శాతంగా నిర్ణయించి 100 కోట్ల రాయితీల ప్రకటనను ఉపసంహరించుకున్నారు. మొత్తం ప్యాకేజి 414 కోట్లుగా ముఖ్యమంత్రి ప్రకటించారు. చివరికి 230 కోట్ల రూపాయల ప్యాకేజిగా తేల్చారు. ఇక రాయితీల మొత్తం ఏ శాఖను ఆ శాఖే చెల్లిస్తుందని ప్రభుత్వం ప్రకటించింది. దీని లోతుల్లోకి వెళ్ళి చూస్తే తీవ్రప్రమాదకరమైన దొంగదెబ్బగా కనబడుతోంది. ఆయా శాఖలు రాయితీల మొత్తాన్ని ఆర్‌టిసి కి చెల్లించకపోతే అనేది ప్రశ్నార్థకం. అలాంటప్పుడు ఆర్‌టిసి పాస్‌లు నిలిపివేస్తుంది. దొడ్డిదారిన పాస్‌లను రద్దు చేయాలనే ప్రభుత్వ కుట్ర దీని వెనుక దాగివుంది. దీని వల్ల దాదాపు డెబ్బయి లక్షల మంది పొందుతున్న 368.5 కోట్ల రూపాయల ప్రయోజనం రద్దుకానుంది. అత్యధికంగా విద్యార్థులు 294 కోట్లు, వికలాంగులు అరవై కోట్లు, జర్నలిస్టులు పదకొండు కోట్లు, స్వాతంత్ర సమరయోధులు మూడు కోట్లు, ఎమ్.పి, ఎమ్.ఎల్.ఏ లు ఇరవైఐదు లక్షల మేర పొందుతున్న ప్రయోజనాలపై కత్తిరింపులు వేయనున్నారు. ఇక ప్రయాణికులను ఎక్కించుకుంటున్న లారీలపై కొరడా ఝులిపిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కానీ అక్రమ రవాణాకు పాల్పడుతున్న ప్రైవేటు బస్సుల గురించి మాత్రం ప్రభుత్వం పట్టించుకోదలచుకోలేదు. ఆర్‌టిసిపై వై.యస్. రాజశేఖరరెడ్డి ప్రభుత్వం ప్రకటించినది తేనెపూసిన కత్తి అని ఆచరణలో రుజువు అవుతుంది.

ఆర్‌టిసి, విద్యుత్తు, సింగరేణి ఏదైతేనేమి ప్రైవేటీకరణ అంశాన్ని కార్మిక సంఘాలు ప్రశ్నించినప్పుడల్లా ఏ ఒక్క కార్మికుడిని ఉద్యోగం నుండి తొలగించబోమనీ, ప్రైవేటీకరణ ఆలోచనే తమకు లేదని ప్రభుత్వం వాదిస్తున్నది. కానీ 1999లో 1,35,540 మంది కార్మికులు ఆర్‌టిసిలో వుండగా అది నేడు 1,17,887కు తగ్గిపోయింది. ఆర్‌టిసిలో దాదాపు ఏడు సంవత్సరాలుగా కొత్తగా రిక్రూట్‌మెంట్ లేదు. రిటైర్ అవుతున్న కార్మికుల స్థానంలో కూడా రిక్రూట్‌మెంట్ లేదు. అద్దె బస్సులను తీసుకోవటం ద్వారా డ్రైవర్ల సంఖ్యను తగ్గిస్తూ వచ్చారు. టిమ్స్ (డ్రైవరే టిక్కెట్లు ఇచ్చే సర్వీసు)లను ప్రవేశపెట్టడం ద్వారా కండక్టర్ల సంఖ్యను తగ్గిస్తూ వచ్చారు. ముందే పేర్కొన్నట్లు కాంట్రాక్టీకరణ, అవుట్ సోర్సింగుల ద్వారా కూడా పర్మినెంట్ కార్మికుల స్థానంలో కాంట్రాక్టు కార్మికులను నియమించేందుకు జీవోనే విడుదల చేసింది. సహజంగా రిటైర్ అయ్యేవారి స్థానంలో కూడా రిక్రూట్‌మెంట్ లేనప్పుడు రిటైర్మెంటు అయ్యేవారి సంఖ్య పెరిగిపోయి శీఘ్రగతిన ఆర్‌టిసి కార్మికుల సంఖ్య తగ్గిపోనుంది. ఒక బస్సుకు కార్మికుల సంఖ్య 11.5 వుండగా ప్రపంచబ్యాంకు షరతుల్లో భాగంగా 6.4కు తగ్గించారు. దీనిని 6కు తగ్గించాలని నేడు కమిటీ సిఫార్సు చేసింది. రాబోయే ఐదు సంవత్సరాలలో 6కు తగ్గించవచ్చునని లెక్కేసి, 10,800 మంది కార్మికులు అదనంగా వున్నారని, వారిని తొలగించా

లని కూడా సిఫార్సు చేసింది. లేని దానిని ఉన్నట్లు కమిటీ లెక్కలు కడితే ఈ సిఫార్సును ప్రభుత్వం తిరస్కరించిందని రవాణామంత్రి ప్రకటించుకున్నారు.

నేడు ఆర్‌టిసి నష్టాలు 1250 కోట్లు దాటాయి. ఏటా 100 కోట్లకు పైగా ఆర్‌టిసి వడ్డీ చెల్లిస్తోంది. యుపిఏ అధికారంలోకి వచ్చిన తరువాత డీజిల్, పెట్రోల్ ధరలు దాదాపు అరడజనుసార్లు పెరిగాయి. దీనితో కూడ ఆర్‌టిసిపై అదనపు భారం పడుతుంది. ఏటా రెండు వందల కోట్లకు పైగా నికర నష్టాలతో, వడ్డీలతో ఆర్‌టిసి నష్టాలు అనతికాలంలోనే వేల కోట్లకు చేర నున్నాయి. పర్మినెంట్ కార్మికుల కన్నా అద్దె బస్సుల ప్రైవేటు కార్మికులు, కాంట్రాక్టు కార్మికులు, అవుట్ సోర్సింగ్ కార్మికుల సంఖ్యే ఎక్కువయ్యే ప్రమాదం పొంచివుంది. ఇవి ప్రభుత్వం పథకం ప్రకారం సృష్టిస్తున్న కృత్రిమ నష్టాలు తప్ప వాస్తవంగా ఆర్‌టిసి నష్టాలలో లేదు. ప్రభుత్వం ప్రకటించిన సిఫార్సులు గానీ, ప్యాకేజి గాని ఆర్‌టిసి పరిరక్షణకు ఉపయోగపడక పోగా ఆర్‌టిసిని మరింతగా డొల్ల చేసి అంతిమంగా ప్రైవేటీకరించడానికి ఉపయోగపడేవే.

కార్మికులు గత్యంతరంలేని పరిస్థితులలో ప్రయోగించే చివరి అస్త్రం సమ్మె. ఈ మధ్య కాలంలో ఆర్‌టిసి సమ్మె రెండు సార్లు ప్రారంభమయింది. ఆర్‌టిసి కార్మికుల డిమాండ్లు, ఆందోళనలు, నోటీసులు, సమ్మెలది ఒకనాటి చరిత్ర కాదు. ఇది నిరంతరం జరిగే కార్మిక కార్యకలాపాలలో భాగం. ఆర్‌టిసిలో పటిష్టమైన కార్మిక సంఘాలు వున్నాయి. అందులో ముఖ్యమైనవి - నేషనల్ మజ్దూర్ యూనియన్, ఎంప్లాయీస్ యూనియన్, ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్, ఎంప్లాయీస్ సంఘ్ - ఇవన్నీ ఇతర సంఘాలు ఏవయినా ఉన్నా ఏదో ఒక రాజకీయ పార్టీకి లేదా సంస్థకు అనుబంధమైనవే. ఈ నాలుగు సంఘాలు కలిసి జెఏసిగా ఏర్పడి పద్నాలుగు డిమాండ్లతో అవి ప్రభుత్వానికి సమ్మె నోటీసు ఇచ్చాయి. సమ్మె ప్రారంభం అయిన తరువాత హైకోర్టు జోక్యం చేసుకొని సమ్మెను తాత్కాలికంగా ఆపింది. ఈ విధంగా సమ్మెలను ఆపడం (హైకోర్టు) అప్రజాస్వామికమైనది. తిరిగి సమ్మె రెండు రోజులు కొనసాగించారు. ప్రజాప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ఆర్‌టిసి కార్మికులు వెంటనే సమ్మె విరమించాలని, లేకుంటే ఎస్మా చట్టంను ప్రయోగిస్తామని రాష్ట్ర హోంశాఖమంత్రి ప్రకటించారు.

'కార్మిక సంఘాలతో ఇక చర్చలు జరిపే ప్రసక్తి లేదు. వారు శాశ్వతంగా సమ్మె చేసినా ఫర్వాలేదు. వంద శాతం బస్సులు నడిపించగలం' అంటూ ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి తీవ్ర వ్యాఖ్యలు, ఆందోళనను ఉధృతం చేస్తామంటూ కార్మిక సంఘాల ప్రకటనలు, రెండురోజుల సమ్మె తరువాత సాయంత్రం వరకు ఇలా ఉన్న పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. రాత్రి పొద్దుపోయాక నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. కార్మికనేతలు ఒక అడుగు దిగిరావడంతో మొదలైన డ్రామా అర్ధరాత్రి వరకూ కొనసాగి చివరికి విద్రోహకరమైన ఒప్పందంను జెఏసి నాయకులు కుదుర్చుకున్నారు.

ఆర్‌టిసి పరిరక్షణ పేరుతో అక్టోబరు 18న జెఏసి నాయకులు ప్రారంభించిన సమ్మె నిష్ఫలమైంది. రెండు రోజుల సమ్మెను ఫణంగా పెట్టి, కార్మికవర్గ ప్రయోజనాలను తుంగలో తొక్కి ప్రభుత్వంతో కార్మిక సంఘనేతలు సమ్మె విరమించుకోవడం అంతిమంగా చార్జీల పెంపుదల పేరుతో ప్రజలపై భారం పడటం మినహా సాధించిందేమీ లేదనే చెప్పాలి. ఈ ఒప్పందంలో కుదిరిన అంశాలన్నీ కార్మికులకు, సంస్థకు సాధారణంగా రావాల్సినవే. ఆర్‌టిసి నష్టాల్లో ఉన్నప్పటి నుంచి డి.ఎ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్లను ఎప్పుడూ సకాలంలో చెల్లించలేదు. ఇంత స్థాయిలో సమ్మె చేసి, చర్చలు జరిపి ఇప్పుడు వాటిని మాత్రమే ఇప్పించడం ద్వారా కార్మిక సంఘాలు సాధించిందేమిటో వాటికే తెలియాలి. రెండు సార్లు సమ్మె చేసినా ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా అదనంగా సాధించుకోలేదన్న అసంతృప్తి కార్మికుల్లో నెలకొన్నది. జెఏసి నేతలు ప్రస్తావించిన పద్నాలుగు డిమాండ్లలో వేతన సవరణ, 1,350 కోట్ల అప్పులు, డీజిల్‌పై అమ్మకం పన్ను తగ్గింపు, ఎమ్.వి. టాక్స్ మరోశాతం తగ్గించడం వంటివి ప్రధానమైనవి. అయితే వీటికి ప్రభుత్వం ఒప్పుకోలేదు. ఇంతకంటే ఇవ్వడం సాధ్యం కాదని ముఖ్యమంత్రి తేల్చి చెప్పారు. దీంతో పద్నాలుగు డిమాండ్లను ఆరుకు కుదించారు. అందులో పది శాతం మధ్యంతర భృతి, సంస్థ అప్పుల్లో 50 శాతం ప్రభుత్వం భరించడం, ఎమ్.వి. టాక్స్ ఒక శాతం తగ్గింపు, డీజిల్ పన్ను 4% తగ్గింది. వృత్తి పన్ను తగ్గింపు ఉన్నాయి. ఇందులో వృత్తి పన్ను తగ్గింపును పరిశీలిస్తామన్న హామీ మినహా ఏ ఇతర డిమాండ్‌ను ప్రభుత్వం పట్టించుకోలేదు. కార్మికులకు మామూలు పద్ధతిలో చెల్లించే డి.ఎ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్‌ల చెల్లింపు వంటి సాధారణ అంశాలకు నేతలు సంతృప్తి చెంది సమ్మె విరమించుకున్నారు. జెఏసి నేతలు సమ్మెను నీరుగార్చి, కార్మికుల నిజమైన డిమాండ్లను నెరవేర్చ డంలో పూర్తిగా విఫలమయ్యారు.

ఆర్‌టిసి పరిరక్షణ అనే డిమాండ్ ఆర్‌టిసి కార్మికుల కంటే రాష్ట్ర ప్రజలకే ఎక్కువగా అవసరం. ఆర్‌టిసి కార్మికులకు కూడా ప్రైవేట్ రంగంలో కంటే ప్రభుత్వరంగంలోనే సాపేక్షికంగా మెరుగైన సౌకర్యాలు వుంటాయి. ప్రపంచబ్యాంకు డైరెక్షన్‌లో ప్రభుత్వరంగ సంస్థలన్నింటిని ఒక్కొక్కటిగా ప్రైవేటీకరించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శీఘ్రగతిన ప్రణాళికలు అమలు చేస్తున్నాయి. నేటి ఆర్‌టిసి సమ్మె విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అవలంభించింది అదే కావున ఆర్‌టిసి కార్మికులు, రాష్ట్ర ప్రజలు మరింత అప్రమత్తంగా వుంటూ ఆర్‌టిసిని ప్రైవేట్ పరం కాకుండా పారా హుషార్‌తో వుండవలసిన కర్తవ్యం వుంది. ఆర్‌టిసి పరిరక్షణకై రాష్ట్ర ప్రజలు, ఆర్‌టిసి కార్మికులు ఐక్యంగా ఉద్యమించాలి. అందుకని సామాజిక, రాజకీయ మార్పుకై పోరాడే అన్ని పార్టీలు, సంస్థలు, ట్రేడ్ యూనియన్లు, మేధావులు ఈ కర్తవ్యాన్ని చేపట్టాలి. ఇది ఒక్క ఆర్‌టిసికే పరిమితం కాదు. అన్ని రకాల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగాల సర్వీసుల పట్ల కూడా ఇలాంటి సామాజిక, రాజకీయ, చారిత్రక కర్తవ్యం చేపట్టాలి. ఒక రంగం మరొక రంగానికి సంఘీభావ ఉద్యమాన్ని చేపట్టవలసిన కర్తవ్యం మనందరి బాధ్యత. ❑

గవర్నర్ అధికారాలు - నేటి స్థితి

వై. భాను అశోక్‌వర్ధన్

దేశానికి మొదటి వ్యక్తి రాష్ట్రపతి అయితే, రాష్ట్రానికి మొదటి వ్యక్తి గవర్నర్. రాష్ట్రపాలనా విషయంలో గవర్నర్ కీలక పాత్ర పోషిస్తారు. రాష్ట్రపతి, ప్రధానమంత్రి సలహాను అనుసరించి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిని సంప్రదించి ఆ రాష్ట్రానికి గవర్నర్‌ను నియమించటం సంప్రదాయం. గవర్నర్ కేంద్ర ప్రభుత్వ ప్రతినిధిగా వ్యవహరిస్తారు. సాధారణంగా గవర్నర్ పదవీకాలం 5 సంవత్సరాలు. అయితే, రాష్ట్రపతి విశ్వాసాన్ని పొందినంతకాలం పదవిలో కొనసాగుతారు. రాష్ట్ర గవర్నర్ జీతభత్యాలను ఆ రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుంది. గవర్నర్ నివసించే నివాస గృహాన్ని రాజ్‌భవన్ అంటారు. గవర్నర్‌కు సంబంధించిన ఇతర ఖర్చులను కూడా రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుంది.

గవర్నర్ అధికారాలు :

భారత రాజ్యాంగంలో రెండవ అధ్యాయంలో 153 నుండి 162 వరకు గల అధికరణాలు రాష్ట్ర గవర్నర్‌ను గురించి వివరిస్తున్నాయి. రాష్ట్ర కార్యనిర్వాహణాధికారమంతా గవర్నర్ చేతిలోనే ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వ వ్యవహారాలన్ని గవర్నర్ పేరుమీదే జరుగుతాయి. రాష్ట్ర ప్రభుత్వ కార్యనిర్వహణ బాధ్యత గవర్నర్‌దే. 7వ రాజ్యాంగ సవరణ ప్రకారం ఒక వ్యక్తిని రెండు కంటే మించిన రాష్ట్రాలకు గవర్నర్‌గా నియమించవచ్చు.

రాష్ట్ర గవర్నర్‌కు కొన్ని కీలకమైన అతి ముఖ్యమైన అధికారాలున్నాయి. అవి

1. కార్యనిర్వాహణాధికారం 2. శాసన నిర్మాణాధికారం 3. ఆర్థిక అధికారాలు 4. న్యాయాధికారాలు 5. విచక్షణాధికారాలు

1. కార్యనిర్వాహణాధికారం : గవర్నర్ అధికారాలలో కార్య నిర్వాహణాధికారం కీలకమైనది. గవర్నర్ రాష్ట్ర ప్రభుత్వ అధిపతి. గవర్నర్ మంత్రిమండలి సలహాననుసరించి పరిపాలనను కొనసాగించినప్పటికీ, కొన్ని సమయాలలో స్వతంత్ర ప్రతిపత్తితో నేరుగా రాష్ట్రపతిని సంప్రదిస్తారు. అంతేకాక శాసనసభలో అధిక సంఖ్యాబలం ఉన్న రాజకీయ పార్టీ నాయకుడిని రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయమని ఆహ్వానిస్తారు. మెజారిటీ ఉన్న రాజకీయ పార్టీ నాయకుడిని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిగా నియమిస్తారు. ముఖ్యమంత్రి సలహాననుసరించి ఇతర మంత్రులను నియమిస్తారు. అలాగే ముఖ్యమంత్రి సలహాపై రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్‌లను, రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమీషన్ సభ్యులను, అడ్వకేట్ జనరల్‌ను, వివిధ కార్పొరేషన్ అధ్యక్షులను గవర్నరే నియమిస్తారు. శాసనసభ సమావేశాలు లేనప్పుడు ప్రభుత్వ కార్యనిర్వహణకు కావలసిన అత్యవసర ఉత్తర్వులు కూడా గవర్నరే జారీ చేస్తారు.

2. శాసన నిర్మాణాధికారం : గవర్నర్ శాసనసభను నిర్వహించడం, వాయిదా వేయడం లేక రద్దు చేయడం వంటి విధులను నిర్వహిస్తారు. శాసనసభ వార్షిక ప్రారంభ సమావేశంలో ఉభయ సభల సంయుక్త సమావేశంలో ప్రసంగిస్తారు. రాష్ట్ర శాసనసభ ఆమోదించిన బిల్లులను గవర్నర్ ఆమోదిస్తేనే చట్టాలవుతాయి. అవసరమని భావిస్తే కొన్ని బిల్లులను రాష్ట్రపతి అనుమతి కొరకు పంపుతారు. కరువు కాటకాలు, జాతీయ పండుగల సందర్భంలో గవర్నర్ రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు.

3. ఆర్థిక అధికారాలు : గవర్నర్‌కు ఆర్థిక అధికారం చాలా కీలకమైనది. ఆయన అనుమతితోనే రాష్ట్ర ఆర్థిక బిల్లును శాసన సభలో ప్రవేశ పెట్టాలి. ప్రతి సంవత్సరం ఎకౌంటెంట్ జనరల్ రాష్ట్ర ఆర్థిక నివేదికను గవర్నర్‌కు సమర్పిస్తారు. ఆయన దానిని శాసనసభ ముందు ఉంచుతారు.

4. న్యాయాధికారాలు : రాష్ట్ర గవర్నర్ న్యాయమూర్తులతో పదవీ స్వీకార ప్రమాణం చేయిస్తారు. న్యాయస్థానాలు విధించిన శిక్షను తగ్గించటానికి లేదా పూర్తిగా రద్దు చేయటానికి గవర్నర్‌కు అధికారం ఉంది. కానీ మరణ శిక్షను రద్దుచేయజాలరు.

5. విచక్షణాధికారాలు : శాసనసభలో మెజారిటీ లేదన్న అభిప్రాయం దృఢపడినప్పుడు గవర్నర్ మంత్రిమండలిని రాజీనామా చేయమని లేదా మెజారిటీ నిరూపించుకోమని ముఖ్యమంత్రిని కోరవచ్చును. మంత్రిమండలి మెజారిటీ కోల్పోయినపుడు రాష్ట్ర శాసనసభను రద్దుపరిచి కేంద్రపాలన విధించమని గవర్నర్ రాష్ట్రపతిని కోరవచ్చు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు సంబంధించిన సమాచారాన్ని సేకరించి రాష్ట్రపతికి నివేదిక పంపుతారు. రాజ్యాంగంలో 356వ నిబంధన ప్రకారం రాష్ట్రంలో పాలన రాజ్యాంగబద్ధంగా లేదనే విషయాన్ని తెలుపుతూ రాష్ట్రపతి పాలన విధించమని కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేయవచ్చు.

గవర్నర్ పాత్ర : గవర్నర్ పదవి చాలా క్లిష్టమైనది. అటు రాష్ట్రపతితో, ఇటు ముఖ్యమంత్రితో సత్సంబంధాలు ఏర్పరుచుకోవాలి. కేంద్ర ప్రభుత్వంలో, రాష్ట్ర ప్రభుత్వంలో వేరువేరు పార్టీలు అధికారంలో ఉన్నపుడు గవర్నర్ పాత్ర చాలా క్లిష్టంగా ఉంటుంది. ప్రతిపక్ష

పార్టీ బలంగా ఉన్న ప్రస్తుత కాలంలో గవర్నర్ పాత్ర మరింత క్లిష్టమైనదిగా తయారయింది.

గవర్నర్ పదవి ఒక మంచి హుందా గల పదవిగా ఉండాలని 1949లో కొద్దిమంది మేధావులు అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో రాజ్యాంగవిహిత బాధ్యతలను నిర్వర్తించే గవర్నర్ రాష్ట్రపతి ప్రతినిధి. కేంద్ర మంత్రిమండలి సలహాననుసరించి గవర్నర్ నియామకం సాగటంతో అనవసరమైన వివాదాలకు దారితీస్తాయని అమెరికా పద్ధతిలో గవర్నర్ పదవికి ఎన్నికలుండాలని 1949వ సంవత్సరంలో రాజ్యాంగ పరిషత్ తొలుత భావించింది. గవర్నర్ పదవికి ఎన్నికలుంటే రాజకీయాలకు లాకులెత్తినట్లు ఉంటుందని రాజకీయాలతో సంబంధం లేని ఉన్నతులనే గవర్నర్‌గా నియమించాలని, ప్రధానమంత్రి సూచన మేరకే గవర్నర్ నియామకం జరిగినా మచ్చలేని సహచరులకే గవర్నర్ పదవి దక్కుతుందనిఅభిప్రాయపడడం జరిగింది. కానీ గవర్నర్ పదవి రాజకీయాలకు అతీతంగా ఉండాలంటే పదవీ విరమణ చేసిన సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులను నియమించాలని ఆనాడే కొద్దిమంది అభిప్రాయపడ్డారు. కానీ రాజ్యాంగ పరిషత్ అభిప్రాయపడినట్లుగానే గవర్నర్ నియామకం జరుగుతుంది. మొదట్లో రాజకీయాలకు తావు లేకుండా గవర్నర్లను నియమించినా రెండు, మూడు దశాబ్దాల నుండి గవర్నర్ పదవులకు రాజకీయరంగు పులుముకోవడం స్పష్టంగా కనిపిస్తుంది. కేంద్ర ప్రభుత్వంలో ఒక పార్టీ అధికారంలో ఉన్నపుడు నియమించిన గవర్నర్లను వేరొక పార్టీ అధికారంలోకి రాగానే తొలగించడం మొదలయింది.

కొన్ని దశాబ్దాల క్రితం కేంద్రంలో అధికారంలో ఉన్న నేషనల్ ఫ్రంట్ హయాంలో దేశ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా, మూకుమ్మడిగా 17 మంది గవర్నర్లను రాష్ట్రపతి రాజీనామా కోరటం అందరిని ఆశ్చర్యపరిచింది. తరువాత వచ్చిన ప్రభుత్వాలు కూడా ఇదే సంప్రదాయాన్ని అనుసరిస్తూ వచ్చాయి. ఇందిరాగాంధీ ప్రధానిగా ఉన్న సమయంలో రాష్ట్రంలో వేర్వేరు పార్టీలు అధికారంలో ఉన్నపుడు ఇందిర ప్రభుత్వం గవర్నర్లను ప్రభుత్వ ఏజెంట్లుగా చూడటం మొదలు పెట్టింది. గవర్నర్లను రాజ్యాంగ ప్రతినిధులుగా చూడకుండా ప్రభుత్వ ఏజెంట్లుగా చూడటంతో అసలు సమస్య మొదలయిందని కొందరి అభిప్రాయం. 1998లో ఎన్‌డిఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినపుడు మిజోరాం, గుజరాత్, గోవా, ఉత్తరప్రదేశ్ గవర్నర్లచే రాజీనామా చేయించింది. దీనికి కారణం అప్పట్లో ఉన్న ఆపద్ధర్మ ప్రభుత్వం వీరిని నియమించిందనీ అందుకే వీరిని తొలగించవలసి వచ్చిందనీ చెప్పుకొచ్చింది.

రాజ్యాంగంలో గవర్నర్ ఎంపికకు కొన్ని అర్హతలున్నాయి. కానీ ప్రస్తుత రాజకీయపార్టీలు ఆ అర్హతలను ఏమాత్రం ఖాతరు చేయటం లేదు. 2001వ సంవత్సరంలో కేంద్రంలో ఎన్‌డిఏ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో డిఎమ్‌కె, ఏడిఎమ్‌కె పార్టీల మధ్య విభేధాల వలన గవర్నర్‌ను తొలగించటంతో దేశంలో గవర్నర్ పాత్రపై పెద్ద చర్చ జరిగింది. ఎన్‌డిఏ కూటమిలో భాగమైన డిఎమ్‌కె తమిళనాడులో జరిగిన ఎన్నికలలో ఓటమి చవిచూడవలసి వచ్చింది. ఆ సమయంలో ఏడిఎమ్‌కె అధికారంలోకి వచ్చింది. డిఎమ్‌కె, ఏడిఎమ్‌కె మధ్య వ్యక్తిగత కారణాల వలన కరుణానిధిని అర్థరాత్రి జయలలిత అరెస్టు చేయించింది. ఆ సమయంలో ఆ రాష్ట్ర గవర్నర్‌గా వ్యవహరించింది ఎవరో కాదు, విద్యావంతురాలు సమర్థురాలైన న్యాయమూర్తిగా పేరుపొందిన ఫాతిమా బీవీ. కరుణానిధి అరెస్టు తరువాత రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితులు క్షీణించాయని ఆ పరిస్థితులపై గవర్నర్ స్వతంత్రంగా ఒక అవగాహనకు రాలేకపోయారనే నెపంతో ఆమెను తొలగించటం జరిగింది.

తరువాత కేంద్రంలో అధికారంలోకివచ్చిన యుపిఏ ప్రభుత్వం కూడా దీనికంటే భిన్నంగా ఏమీ లేదు. అధికారంలోకి రాగానే గత ప్రభుత్వం నియమించిన గోవా, ఉత్తరప్రదేశ్, హర్యానా, గుజరాత్ గవర్నర్లను కేంద్ర హోంశాఖ సూచనలను ఖాతరు చేయలేదన్న కారణంతో తొలగించటం జరిగింది. దీనిపై ప్రధాన ప్రతిపక్షమైన ఎన్‌డిఏ పార్లమెంట్ లోపల, వెలుపల ఒక యుద్ధమే చేసింది.

గత సంవత్సరం యుపిఏ ప్రభుత్వం తమిళనాడు గవర్నర్‌ను తొలగించటం జరిగింది. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి కేంద్ర హోంశాఖను తొలగింపుకు గల కారణాలు కోరగా గవర్నర్ ఒక సందర్భంలో టీ పార్టీ యివ్వలేదన్న కారణంతో తొలగించవలసి వచ్చిందని తెలియచేశారు. టీ పార్టీ యివ్వకపోతే రాష్ట్రంలో అత్యున్నతమైన గవర్నర్‌ను తొలగించే పరిస్థితి నెలకొందంటే మన ప్రభుత్వాలు ఏ స్థాయికి దిగజారాయో అర్థం చేసుకోవాలి. ఇది ఒక దురదృష్ట సంఘటన.

కొన్ని నెలల క్రితం జార్ఖండ్‌లో ఎన్నికల్లో మెజారిటీరాని రాజకీయపార్టీ నాయకులు రాత్రికి రాత్రే రాజ్‌భవన్‌లో రాజకీయ మంతనాలు జరపటంతో గవర్నర్ మెజారిటీ రాని రాజకీయ పార్టీని ప్రభుత్వం ఏర్పాటు చేయమని ఆహ్వానించి ఆ రాజకీయ పార్టీ నాయకుడిని ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయించి ఆ రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేయించారు. దీనితో మెజారిటీ ఉన్న బిజెపి తన అభ్యర్థులతో ఢిల్లీ వెళ్ళి రాష్ట్రపతి ముందు తమ బలాన్ని నిరూపించుకుంది. ఇది దేశంలో ఒక పెద్ద సంచలనమయింది.

ఈ పరిస్థితులన్నింటికీ కారణం ప్రధాన రాజకీయ పార్టీలన్నీ మంత్రి పదవులు రాని వారిని, రాజకీయ పార్టీల సీనియర్ నాయకులను ఒక రాష్ట్రంలో ముఖ్యమంత్రి పదవిని ఆశించి భంగపడిన వ్యక్తులను, రాజకీయ పార్టీల పెద్దలను, రాజకీయ పార్టీల కూటమితో అనుబంధం ఉన్న సంస్థల పెద్ద పెద్ద నాయకులను గవర్నర్ పదవులలో కూర్చోబెట్టటం అని ప్రజల అభిప్రాయం. దీనికి తోడు కేంద్రంలో ఒక ప్రభుత్వం అధికారంలో ఉన్నపుడు రాష్ట్రంలో వేర్వేరు పార్టీలు అధికారంలో ఉన్నపుడు కేంద్ర ప్రభుత్వం గవర్నర్లను తమ పార్టీకి చెందిన వారిని నియమించి కేంద్ర ప్రభుత్వ ఏజెంట్లుగా చూస్తుంది. ఇంతే కాకుండా కేంద్రంలోనూ - రాష్ట్రంలోనూ ఒకే పార్టీ అధికారంలో ఉన్నపుడు

ప్రతిపక్షాలకు అవకాశం యివ్వకుండా ముఖ్యమంత్రితో కలిసి రాష్ట్రంలో తమ పార్టీని బలోపేతం చేయటానికి ఆ పార్టీ సీనియర్ నాయకులను గవర్నర్లుగా నియమిస్తుంది.

ఇటీవల సుప్రీంకోర్టు 'రాజ్‌భవన్‌లు రాజకీయ నాయకులకు కార్యాలయాలుగా మారాయని' సంచలన ప్రకటన చేసిందంటే రాజ్‌భవన్‌లు ఏ పరిస్థితుల్లో ఉన్నాయో అర్థం చేసుకోవాలి. ఈ సమయంలో కొన్ని రాజకీయ పార్టీలు గవర్నర్ వ్యవస్థనే రద్దు చేయమనటం గమనార్హం.

గవర్నర్ వ్యవస్థను రాజకీయ రంగుల నుండి బయటకు తీసుకురావాలంటే రాజ్యాంగ సవరణ ద్వారానే సాధ్యం. రాజకీయాలతో సంబంధం లేకుండా ఉన్నత విద్యావంతులు, మంచి వ్యక్తులకు గవర్నర్ పదవిని అప్పగించాలి. గవర్నర్ పదవిలో 5 సంవత్సరాలు కచ్చితంగా కొనసాగాలి. రాష్ట్రపతి విశ్వాసాన్ని పొందినంతకాలం పదవిలో గవర్నర్ కొనసాగాలన్న పద్ధతి ప్రస్తుతం కొనసాగుతోంది. "రాష్ట్రపతి విశ్వాసాన్ని పొందినంత కాలం" అనే పదానికి కూడా కొంతమంది అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. గవర్నర్ కచ్చితంగా రాజకీయాలతో సంబంధం లేకుండా ఉండాలంటే పదవీ విరమణ చేసిన న్యాయమూర్తులను, ఐ.ఎ.ఎస్, ఐ.పి.ఎస్ అధికారులను గవర్నర్ పదవులలో నియమించాలి. వారు ముఖ్యమంత్రులకు సరియైన సమయంలో సరియైన సలహా ఇవ్వగలరు. రాష్ట్రపాలన సులభతరం చేయగలరు.

❑

(7వ పేజీ తరువాయి)

గత నాలుగేళ్లుగా ప్రశ్నించని వాళ్లు ఇవ్వాళ ఒక్కసారిగా బహిరంగంగా బయటపడడంలో బయట శక్తుల ప్రోద్బలం ఉందని ఎవరైనా ఊహిస్తే తప్పేం లేదు. ప్రశ్నలు సంధించిన వాళ్లెప్పుడు ఈ అంశాలను పార్టీలో అంతర్గతంగా చర్చించిన వాళ్లు కాదు. ప్రతిఘటించిన దాఖలాలు లేవు. ఈ సంక్షోభం సైద్ధాంతిక సంక్షోభమూ కాదు, ఉద్యమ ఆచరణకు సంబంధించినదీ కాదు. వ్యక్తిగత ఆకాంక్షలలోంచి ఉత్పన్నమైనదే. సెకండరీ అంశాలుగా ముందుకు రావాల్సిన ప్రశ్నలు ప్రాథమిక అంశాలుగా మారడం వల్లనే ప్రజలు ఉద్యమాభిమానులు చికాకు పడ్తున్నారు. పరస్పర వ్యక్తిగత దూషణలు ఉద్యమాన్ని పలుచన చేస్తున్నాయన్న వాస్తవాన్ని ఇరు పక్షాలు గమనించడంలేదు.

అసమ్మతివాదులు గుర్తించవలసినదేమిటంటే తాము లేవనెత్తిన అంశాలు ఏ పద్ధతిలో లేవనెత్తాలి అన్నది. అది పార్టీ అంతర్గత విషయం అయినపుడు అవి అంతర్గతంగానే చర్చించుకోవాలి. శత్రువుతో మాత్రమే బహిరంగ యుద్ధాన్ని చెయ్యాలన్న కనీస ఇంగితాన్ని వారు ప్రదర్శించడం లేదు. అంతర్గతంగా కూడా పరిష్కరించుకోలేనపుడు, పార్టీలో పనిచేయడం సాధ్యం కానపుడు వారు పార్టీని, పార్టీ ద్వారా లభించిన పదవులను వదులుకొని ప్రజల్లోకి రావాలి. అప్పుడు మాత్రమే వారి చిత్తశుద్ధిని ప్రజలు ఆమోదిస్తారు. అంతదాకా వారు బయటిశక్తుల ప్రలోభాలకి లొంగిపోయి ప్రవర్తిస్తున్నారన్న మాటని నమ్మక తప్పదు.

ఇక టిఆర్ఎస్ అధిష్ఠానం కూడా వారు లేవనెత్తిన అంశాలను చిత్తశుద్ధితో విశ్లేషించుకోక తప్పదు. ఉద్యమ ఆచరణలోని లోపాలను, ఉద్యమ వ్యూహాల వైఫల్యాలని కూలంకషంగా చర్చించుకొని ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పంథాని ఎంచుకోవాలి. తెలంగాణ సాధనలోనే కాదు తెలంగాణ రాష్ట్ర పునర్‌నిర్మాణంలోనూ ప్రజల నిర్మాణాత్మక భాగస్వామ్యాన్ని పెంపొందించే విధంగా ప్రత్యామ్నాయ వ్యూహాన్ని రూపొందించుకుంటే సెకండరీ అంశాలు మరుగున పడిపోయి ప్రజల ఆకాంక్షలు ప్రాథమిక అంశాలుగా ముందుకు వస్తాయి. అసమ్మతి దానికదే సమసిపోతుంది. ఈ చారిత్రాత్మక కృషిలో టిఆర్ఎస్‌తో పాటూ టిఆర్‌సిసి ఇతర తెలంగాణ శక్తులన్నీ భాగస్వాములైతే చరిత్ర వారిని అభినందిస్తుంది. లేదంటే వారు ద్రోహులుగా, చరిత్ర హీనులుగా మిగిలిపోతారు. ప్రజల్లో విముక్తి ఆకాంక్ష ఉన్నది గనుక ఈరోజు కాకున్నా రేపైనా ప్రజలు మరో ప్రత్యామ్నాయ రాజకీయశక్తిని పునర్‌నిర్మించుకొని ముందుకు సాగుతారు.

❑

(11వ పేజీ తరువాయి)

కానీ వారు ఫ్యూడల్ భావజాలంను తమ ఆధిపత్య భావజాలంగా మారడం వలన నూతన ఉత్పత్తి శక్తులకు మరింత అవరోధంగా మారింది. మైదాన గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయ వాణిజ్య సంబంధాలలో వికృత రూపమైన పెట్టుబడిదారీ సంబంధాలు ఏర్పడి మధ్యతరగతి, ధనిక రైతుల్లో ఒక సెక్షన్ ప్రభుత్వ వ్యవసాయ విధానం వలన తమ చరాస్తులను కూడ కోల్పోయి, అప్పుల బాధలు తాళలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఈ 58 సంవత్సరాల స్వా(హా)తంత్ర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సాధించిన అభివృద్ధి నూతన ఉత్పత్తి శక్తులను అభివృద్ధి చెందనివ్వకుండా సామ్రాజ్యవాదుల దోపిడీని రక్షించడమే.

భూస్వామ్య సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటం ద్వారానే నూతన ఉత్పత్తి శక్తులు అభివృద్ధి చెందుతాయి. ఆదివాసీ ప్రాంతాలలో స్వయం ప్రతిపత్తి సాధించడం ద్వారానే వ్యవసాయ-పారిశ్రామిక అభివృద్ధిని సాధించగలం. అంతేగానీ బాక్సైట్ గనుల తవ్వకాల వలన గానీ, పోలవరం లాంటి ప్రాజెక్టుల నిర్మాణం ద్వారా గానీ ఆదివాసీ ప్రాంతాలు అభివృద్ధి అనేది పచ్చిబూటకం. పాలకవర్గాల ప్రచారాన్ని త్రిప్పికొడుతూ, ఆదివాసీ ప్రజావ్యతిరేకమైన ప్రాజెక్టు నిర్మాణాలకు, బాక్సైట్ గనుల తవ్వకాలకు వ్యతిరేకంగా, ఆదివాసీ స్వయం ప్రతిపత్తికై ఐక్యంగా ఉద్యమించాల్సిన సమయమిది.

❑

మట్టి ఆరోగ్యమే మనిషి ఆరోగ్యం!

డి.వి. రామకృష్ణారావు

మట్టి ఆరోగ్యంగా ఉందా! మట్టి ఆరోగ్యం ఏంటి? మట్టి లోంచి మనకు తయారవుతున్న పదార్థాలు, మట్టిలో మనం కలుపుతున్న వ్యర్థ పదార్థాలు, మట్టి, నీరు, గాలి ఆరోగ్యం ఎలా ఉంది? అనే ప్రశ్నలు మనం ఈ రోజు సూటిగా వేసుకుని వాటికి జవాబులు నిజాయితీతో కనుక్కోవలసిన అవసరం ఎంతైనా ఉంది. గత దశాబ్ద కాలంగానూ, మరీ ముఖ్యంగా ఈ మధ్య వరుసగా సంభవించిన సునామీ, భూకంపాలు, తుఫానులు విపరీతమైన వర్షాలు,ఎండలు, చలి ఎక్కడో గతి తప్పిన ఋతుక్రమం మనకు కనబడుతుంది.

మట్టిని తీసుకుంటే బొగ్గు, ఇనుము, పెట్రోలియం, సహజ వాయువులు, నీరు, రకరకాల ఖనిజ పదార్థాలూ, రేడియో ధార్మిక పదార్థాలూ లోహాలు, అలోహాలు, ఇలా నూటపది రకాల మూలకాలను మన అవసరాల కోసం తవ్వి తీసుకుంటున్నాం. ఇంకా అనేక మూలకాల గుణగణాలపై పరిశోధనలు జరుగుతూ ఉన్నాయి.

పారిశ్రామిక విప్లవాలు, త్వరితగతిన వచ్చిన మార్పులూ ముఖ్యంగా గత 2-3 శతాబ్దాలుగా చోటుచేసుకున్న శాస్త్ర సాంకేతిక అభివృద్ధి వెలుగునీడలను పునరాలోకించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రకృతితో మనం స్నేహపూర్వక వైరుధ్యంతో సహజీవనం చేయాలేగాని, శత్రువైరుధ్యంగా మన జీవన సంస్కృతి మారకూడదు. సమతుల్యత నియమాలు, న్యూటన్ గతితార్కిక నియమాలు, ఐనిస్టీన్ శక్తినిత్యత్వ నియమాలు ఇలా అనేక చలన సూత్రాలతో మనం ఈ ప్రకృతిని అర్థం చేసుకుని, సహజీవనానికి కావాల్సిన పర్యావరణ అనుకూల విధానాలను అవలంబిస్తే, ఆగి ఆలోచిస్తే తప్ప ఈ భూగోళాన్ని మనం కాపాడుకోలేము.

అలిశెట్టి ప్రభాకర్ అన్నట్లు 'సూది మొనపై ఆవగింజను, తుపాకి బ్యారల్‌పై భూగోళాన్ని మనం నిలబెట్టలేం' అన్న మాటలు సామ్రాజ్యవాద యుద్ధకాంక్ష, ఫలితంగా అది ప్రపంచవ్యాప్తంగా మార్కెట్ కోసం సృష్టించిన యుద్ధాలు వెరసి మనిషి మనుగడకు, మొత్తంగా ప్రకృతికి ఎంతటి నష్టాన్ని కలుగజేస్తాయో మనం చరిత్రను పరిశీలిస్తే అర్థమవుతుంది. మనం మన భవిష్యత్ తరాలకు ఇనుప నాణేలను మాత్రమే ఇద్దామనుకుంటున్నామా? లేక మట్టిలో నాలుగు గింజలు పండే అవకాశాన్ని మిగిల్చి ఆరోగ్యకరమైన నేలను ప్రకృతిని ఇద్దామనుకుంటున్నామా? అనేది స్పష్టంగా ఆలోచించాల్సిన ఒక పరిస్థితికి మనం నెట్టివేయబడ్డాం.

నేను గతంలో ఒక పురుగు మందుల కంపెనీలో పని చేస్తున్నప్పుడు రైతులతో అవసరం ఉన్నా లేకపోయినా పురుగు మందు కొట్టించాలనే 'మార్కెటింగ్' పనిలో ఉన్నాను. ఒక సంవత్సరం పది వేల లీటర్లు అమ్మితే, ఆ మార్కెట్‌లో తర్వాత ఏడాది 15-20 వేల లీటర్ల పురుగుమందు అమ్మాలనే టార్గెట్ నిర్ణయం అయిపోయేది. అంటే ఆ సంవత్సరం వాతావరణం వల్లనో, ఇతర కారణాల వల్లనో పురుగు సహజంగానే తక్కువ ఉన్నప్పటికీ టార్గెట్ మాత్రం ఖచ్చితంగా చేరుకోవాలి. దానికి మా ఏరియా మేనేజర్ 'రైతుల చేత తాగిస్తావో... చేనుపైన కొట్టిస్తావో... టార్గెట్ మాత్రం పూర్తి చేయాలి' అని ఐదు నక్షత్రాల హోటల్‌లో కూర్చోబెట్టి మరీ హెచ్చరించాడు (నిజంగానే ఆ తరువాత 1997 నుంచి రైతులు వ్యవసాయం గిట్టుబాటు కాక వందల సంఖ్యలో ఆత్మహత్యలు చేసుకోవడం కొనసాగుతూనే ఉంది). అప్పటి ఆ అనుభవంతో నాకర్థమయ్యిందేమంటే మనకు అవసరం ఉన్నా లేకున్నా పదార్థాన్ని వినియోగించడం, దుర్వినియోగం చేయడం, ఆ మేరకు పర్యావరణానికి నష్టం చేయడం. నిజానికి రైతులు వాడే పురుగుమందుల్లో 60-70% అనవసరంగాను, విచక్షణారహితంగానూ, పోటీలో భాగంగాను మాత్రమే వాడుతున్నారు. దీనిని మార్కెట్ ప్రేరిత సస్యరక్షణగా (మార్కెట్ ప్రమోటెడ్ స్ప్రేలుగా) చెప్పవచ్చు. గ్రామాల్లోకి పోయి చూసినప్పుడు చాలా అనారోగ్యకరమైన, పర్యావరణ వ్యతిరేకమైన పోటీని మనం గమనించవచ్చు.

కంపెనీలు తమ మందులను విచ్చలవిడిగా వాడిన రైతును 'ఆదర్శరైతు' గా ప్రకటించి బహుమతులు, ప్రోత్సాహకాలు ఇవ్వడాన్ని మనం చూడవచ్చు. 'ఇతనేం రైతు సార్! అతను రోజూ పంపు (పురుగుమందు) కొడతాడు రైతంటే అలా ఉండాలి' అనే మార్కెట్ విలువ బలంగా రైతుల్లో పాతుకపోయింది. ఐతే ఇటువంటి మార్కెట్ సంస్కృతి ఒక్క రైతుల్లోనే కాదు. మొత్తంగా ఒక జీవనవిధానంగా చెలామణి అవుతోంది. కడితే ఫలానా చీరనే కట్టాలి, ఫలానా వాచీనే పెట్టుకోవాలి, ఫలానా సెల్‌ఫోన్‌నే వాడాలి, ఫలానా కారునే కొనాలి... ఇలా... వస్తు భాష, వస్తు వినియోగ భాష మన మాటల్లోకి జీవితంలోకి వచ్చేసింది. ఒక మనిషి అతనికున్న అభిప్రాయాలు, ఆచరించే విలువలూ కాక 'ఫలానా వస్తువు వాడితేనే సంపూర్ణమైన మనిషి' (లేకపోతే మనిషి కానట్టు) అనే మార్కెట్ సంస్కృతి మనని చుట్టేసుకుంది. ఎలా సంపాదించారు అనే దానికన్నా ఎంత సంపాదించారు అనేది ప్రధానమైపోయింది.

అక్రమంగా పురుగు మందులమ్మే ఆ ఉద్యోగం వదిలి పురుగుమందులు వాడకుండా వ్యవసాయం చేయడమెలా? అనే ప్రాజెక్టులో పనిచేసాను. ముఖ్యంగా పత్తి, కంది ఇతర వర్షాధార పంటలపై తెలంగాణా జిల్లాల్లో పనిచేసేక్రమంలో రైతులు సహజంగా ఆచరించే పంటమార్పిడి, మంచి విత్తనం ఎన్నుకోవడం,

వేసవి దుక్కి, వేపకషాయం, గుడ్లను, పురుగును ఏరి నాశనం చేయడం... దీపపు ఎరలు, ఇలాంటి పద్ధతులతోనే పురుగును అదుపులో ఉంచి, పెట్టుబడి తగ్గించి మంచి దిగుబడిని సాధించడం జరిగింది. ఏదో దేశంలో పిల్లలకు సెలవులు వ్యవసాయానికి కీలకదశలో (పూత, కాత దశలో) ఇస్తారని తెలిసింది. ఎందుకంటే పిల్లలంతా వాళ్ల వాళ్ల గ్రామాలకు పోయి రైతులకు చేదోడు వాదోడుగా ఉండి పంటను రక్షించడంలో, పురుగులను ఏరడంలో సహాయ పడతారట.

ఇలాంటి విధానాల వల్ల పిల్లలకు రైతుపైనా, ప్రకృతిపైనా అవగాహన కూడా ఏర్పడుతుంది. భవిష్యత్తుల్లో బాధ్యతగల పౌరులుగా మారడం జరుగుతుంది. పూసినదంతా కాయదు, కాసిన దంతా నిలవదు, నిలిచినదంతా మనకు దక్కదు. ప్రయత్నం మన నుంచి ఉన్నా పురుగులు, పక్షులు, వాతావరణ పరిస్థితులు ఎన్నో ఇతర కారణాలవల్ల వ్యవసాయ దిగుబడి ప్రభావితం అవు తుంది. అయితే ఉన్న పద్ధతులలో ఆరోగ్యకరమైన పద్ధతులను ఆచరించి వీలయినంత ఎక్కువ ఫలసాయాన్ని పొందడం అంతిమ లక్ష్యం.

పురుగుమందు వాడే పద్ధతిలో, పురుగుమందులకు ప్రత్యామ్నాయ పద్ధతులలో గమనించిన అంశం దిగుబడి రెండిం టిలో సమానం. పురుగుమందు వాడడం వలన పర్యావరణానికి, రైతు కుటుంబ ఆరోగ్యం, పశువుల ఆరోగ్యానికి నష్టమై ఖర్చు విపరీతంగా పెరిగింది. రెండో పద్ధతిలో రైతు ఆరోగ్యానికి మేలు జరిగి, పురుగుమందుపై ఖర్చు తగ్గి, ఆదాయం పెరిగింది.

అయితే ఇటువంటివి రైతులు సమిష్టిగా, సహకార పద్ధతిలో, సంక్షేమ దృష్టితో చేస్తే తప్పక సాధ్యమే. వ్యవసాయం వ్యక్తిగత వ్యవహారం కాదు. సమిష్టిగా, వనరులన్నింటిని క్రమపద్ధతిలో ఉపయోగిస్తే సాధ్యపడుతుంది.

ఆ క్రమంలో నేను ఒక డాక్టరును కలిసాను. వృత్తిరీత్యా ఆయన వైద్యుడు. అయితే ఆయన తన దగ్గరకు వచ్చే చాలామంది రోగుల రోగాలకు కారణం వాళ్ళు తినే ఆహార పదార్థాల్లో ఉంటున్న పురుగుమందు, అలాగే వాళ్ళు పురుగుమందులు విపరీతంగా వాడుతున్న పర్యావరణంలో జీవించడం కారణాలుగా గుర్తించారు. అప్పుడాయన రోగులకు వైద్యం చెయ్యడం కన్నా, రోగి రోగానికి కారణమవుతున్న వ్యవసాయానికి వైద్యం చెయ్యాలనే లక్ష్యంతో, మట్టి ఆరోగ్యాన్ని పరిరక్షించాలనే లక్ష్యంతో వ్యవసాయంలోకి వచ్చేసారు. సుస్థిర వ్యవసాయ పద్ధతులను ప్రచారం చేయడం తన కార్యక్రమంగా రూపొందించుకున్నారు. అయితే ఆయనకున్న వయస్సు, ఆచరణకుండే పరిమితి, వ్యవస్థకున్న మార్కెట్ సంస్కృతి, విలువలూ, లాభాపేక్ష, సమిష్టితత్వం లేకపోవడం, కుల, మత, వర్గ పొందికలు, ఆలోచనల్లో వెనకబాటుతనం, పాలకులకు భవిష్యత్ దృష్టి లేకపోవడం... వెరసి ఆయననుకున్న లక్ష్యం మనందరిముందు లక్ష్యంగానే ఉంది. ఒక సవాలుగానే ఉంది.

అయితే పురుగుమందుల వాడకం వివిధ పంటలపైన ఏవిధంగా ఉందో ఈ పట్టికలో చూద్దాం:

క్ర.	పంట	సాగయ్యే భూమిలో శాతం	మొత్తం పురుగు మందుల్లో వినియోగ శాతం
1.	పత్తి	5	54
2.	వరి	24	17
3.	కూరగాయలు, పండ్లు	3	13
4.	తోట పంటలు (కాఫీ, జీడిమామిడి, పొగాకు)	2	8
5.	ఇతర ధాన్యాలు పప్పు దినుసులు,నూనెగింజలు	58	2
6.	చెరకు	2	3
7.	ఇతరాలు	6	3

సాగుభూమిలో కేవలం 5% గా ఉన్న పత్తిపై 54% పురుగుమందులు, సాగుభూమిలో 3%గా ఉన్న పండ్లు కూరగాయలపై 13% పురుగుమందులు వాడుతున్నామంటే ఎంత విచ్చలవిడిగా, విచక్షణారహితంగా పురుగుమందులు వినియోగిస్తు న్నామో అర్థమవుతుంది. అయితే ఈ పురుగుమందులకు కచ్చితంగా ప్రత్యామ్నాయాలు ఉన్నాయి. ఆరోగ్యకరమైన పద్ధతులున్నాయి. మార్కెట్ నియంత్రణలో వ్యవసాయం ఉండడం వల్ల మనకు ఈ పరిస్థితి ఎదురవుతోంది. వాడుతున్న ఈ పురుగుమందులో 10% మాత్రమే మొక్కపైకి చేరగా మిగిలిన 90% మట్టిలోకి, నీటిలోకి, గాలిలోకి పరివ్యాప్తమవుతోందనేది కఠినమైన వాస్తవం. అయితే ఈ పద్ధతులు ఎవరికోసం, ఎవరి లాభం కోసం అనేది మనం ఆలోచించాలి. రైతుకు ఆరోగ్యకరమైన పద్ధతులను, విధానాలను మనం రూపొందించినప్పుడు మనందరం ఆరోగ్యంగా ఉంటాం. పర్యావరణానికి మేలు కూడా జరుగుతుంది.

అయితే పాలకుల విధానాలెట్లా ఉన్నాయని చూస్తే స్వాతంత్ర్యం వచ్చిన తొలిరోజుల్లో వ్యవసాయానికిచ్చిన ప్రాధాన్యతను క్రమంగా తగ్గించుకుంటూ వచ్చి ఈ రోజు రైతులు ఆత్మహత్యలు చేసుకునే దిశగా పరుగు పెడుతోంది. ఒక వ్యవసాయ సమాజంలో రైతులే ఆత్మహత్య చేసుకుంటున్నపుడు అది ఒక సామాజిక సంక్షోభానికి ప్రబల నిదర్శనం. ఈ పరిస్థితిని చూసి మనం మౌనంవహిస్తే చరిత్రలో దోషులుగా మిగిలిపోతాం.

పాలకులు, ఆలోచనాపరులు, మేధావులు, అంతా రైతు అనుకూలతలోను, రైతు సంక్షేమంలోనే మనందరి సంక్షేమం ఉందనేది గుర్తెరిగి అటువైపుగా అడుగులేస్తేనే మనందరి మనుగడ సాధ్యమవుతుంది. ప్రస్తుతం మన పాలకులు, చేపడుతున్న విధానాలు ఎట్లా ఉన్నాయంటే ఏదో దేశంలో పశువులనుంచి పాలు ఎక్కువగా పిండుకోవడానికి హార్మోనులు వాడడం వలన

వాటి పేడ కూడా విషతుల్యమైపోతే ఆ పేడను మన కాండ్ల రేవులో (ఎక్కడైతే దేశ స్వాతంత్ర్యం కోసం గాంధీగారు ఉప్పు సత్యాగ్రహం ప్రారంభించారో...) డంప్ చేయడానికి స్థలమిచ్చారు. వాళ్ళకి వ్యర్థపదార్థమైతే, పర్యావరణానికి హాని అనిపిస్తే... మనకు మాత్రం హానికరం కాదా. ఇది కేవలం తాము నిలుచున్న చోటు శుభ్రంగా ఉంటే చాలు పరిసరాలు ఎలా ఉంటేనేం... అనే సంకుచిత దృష్టికి నిదర్శనం. ఇంక భోపాల్‌లో కార్బైడ్ దుర్ఘటన సరేసరి. అమెరికా తన పర్యావరణాన్ని దృష్టిలో పెట్టుకుని చాలా పరిమిత ఉత్పత్తికి, చాలా తక్కువ కెపాసిటి కార్బైడ్ ప్లాంట్‌కు తనదేశంలో అనుమతిస్తే మన ప్రభుత్వం పర్యావరణం, ప్రజాసంక్షేమాన్ని గాలికి విడిచి అక్కడ కన్నా అనేక రెట్ల కెపాసిటి ఉన్న కార్బైడ్ ప్లాంటుకు అనుమతివ్వడం, సరైన పర్యవేక్షణ, రిపేర్ మెయింటెనెన్స్‌లు లేక వారి నిర్లక్ష్యానికి వేలాది మంది ప్రాణాలు కోల్పోవడం మనకు తెలిసిందే. అనేక పశువులు, పక్షులు చనిపోవడమే కాక ఇప్పటికీ చాలా మంది, తరువాత తరం పిల్లలు కూడా వ్యాధిగ్రస్తులై బాధపడుతున్నారు. ఇప్పటికీ అక్కడి ప్రజలకు నష్టపరిహారం, సహకారం అందలేదు.

ఏదైనా ఉత్పత్తి చేయడానికి అనుమతిచ్చేటప్పుడు, పదార్థం వాడటానికి అనుమతిచ్చేటప్పుడు ఉత్పత్తి కాబడే పదార్థం ఎవరి ప్రయోజనానికి, ఉత్పత్తయ్యే క్రమంలో బైప్రొడక్ట్ ఏమిటి, గాలిలో కలిసేవి, నీటిలో కలిసేవి, మట్టిలో కలిసేవి... ఆరోగ్యానికి కలిగే నష్టాలేంటి... అనేవి కూలంకషంగా చర్చించి, ఆలోచించి, దీర్ఘకాలిక దృష్టితో అనుమతినియ్యాలి. కాని కొద్దిమంది 'అభివృద్ధి' ప్రాతిపదికయ్యినపుడు అశేష ప్రజల ప్రయోజనాలకేగతి పడుతుందో యాభై ఏళ్ళ స్వతంత్ర (?) భారతంలో మనం అనుభవిస్తూనే ఉన్నాం.

గత అనుభవాల నుంచి మనం నేర్చుకున్నదెంత? గ్రహించిందెంత? సరిచేసుకోవడానికి, ఆచరించిందెంత? మన మట్టి ఆరోగ్యం ఎలా ఉంది? ఎలా ఉండాలి? మనమేం చెయ్యగలం? ఇవన్నీ ఆలోచించాల్సిన విషయాలు.

❑

పరిశోధనా ఫలాలు సమాజానికి అందజేయండి!

సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలలో మీరు ఎంతో పరిశోధన చేసి ఉంటారు. అధ్యాపకులుగా మీ విద్యార్థులకు ఎన్నో పరిశోధనలలో ప్రత్యక్ష పరోక్ష సహకారాలు అందిస్తూ ఉంటారు. అయితే సమాజానికి ఎంతో ఉపయోగపడాల్సిన పరిశోధనా పత్రాలు ఏ సెమినార్‌లోనో ప్రస్తావించి వదిలేస్తే సరిపోదు. మీ పరిశోధనా ఫలాలు తెలుగు సమాజంలో నలుగురికి చేరాలి. కొత్త ఆలోచనలకు ప్రేరణ కావాలి, కొత్త మార్గాలను ఆవిష్కరించాలి. అందుకు మీకు వేదికగా నిలిచేందుకు వీక్షణం ముందుకు వస్తోంది.

తెలుగులో పాపికార్న్ పత్రికలే కానీ సీరియస్ పత్రికలు లేవన్న అభిప్రాయాన్ని పటాపంచలు చేస్తూ విజయవంతంగా రెండున్నరేళ్ళ ప్రస్థానం సాగించి, 50 సంచికలు పూర్తి చేసుకుంది వీక్షణం.

ఎటువంటి డబ్బు మూటల దన్ను లేకుండా గుప్పెడు పాత్రికేయులు, సామాజిక శాస్త్రవేత్తలు కలిసి నడుపుతున్న ఈ పత్రికకు ఎందరో మేధావులు, అధ్యాపకులు, ఆలోచనాపరులు చందాదారులుగా ఉన్నారు. తెలుగు సమాజం గర్వించదగ్గ పాత్రికేయులు, సామాజిక శాస్త్రవేత్తలు, ఉద్యమకారులు, నిపుణులు అనేకుల రచనలు వీక్షణం ప్రచురిస్తోంది.

రండి, ఈ బృహత్‌కార్యంలో మీరూ పాలుపంచుకోండి. మీరు చేసిన పరిశోధనా ఫలితాలను వీక్షణంలో ప్రకటించండి. అది ఏ సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశం అయినా ఫర్వాలేదు. తెలుగు ప్రజలకు ఆ అంశం ఆసక్తిగొల్పేదీ, ఉపయోగకరమైనదీ అని మీరు భావిస్తే చాలు. మీరే కాదు పి.హెచ్.డి చేసిన, చేస్తున్న మీ విద్యార్థులు కూడా తమ పరిశోధనా పత్రాలను (ఒక వ్యాసరూపంలో) పంపవచ్చు. రచనతో పాటు దానికి సంబంధించిన చిత్రాలు, గణాంకాలు కూడా జతపరిస్తే మరీ మంచిది.

ఎంతో శ్రమించి మీరు చేస్తున్న పరిశోధనలు నలుగురికీ ఉపయోగపడేలా చేయండి.

వీక్షణం మీ రచనల కోసం ఎదురుచూస్తుంది!

మీదే ఆలస్యం!!

రచనలు పంపాల్సిన చిరునామా :

ఎడిటర్, వీక్షణం, సెంటర్ ఫర్ డాక్యుమెంటేషన్, రీసెర్చ్ అండ్ కమ్యూనికేషన్

ఫ్లేట్ నెం. 3, హిమాయత్‌నగర్, హైదరాబాద్ - 500 029. ఫోన్: 040 - 55843495

ప్రజాస్వామ్య ముసుగులో రాచరికం

విజయ్ కుమార్

నూతన ప్రజాస్వామ్యం అంటే నిజమైన ప్రజాస్వామ్యం మనం ఏర్పరుచుకోవాలి. యిప్పుడున్న వ్యవస్థ కూడా ప్రజాస్వామ్యమనే అంటున్నాగు గదా, యింకా నిజమైన ప్రజాస్వామ్యమేమిటనే అనుమానం రావచ్చు.

ఒకప్పుడు మనకు రాజులుండేవారు. ఒక గుంపు తమ ఆయుధ (సైనిక) బలంతో ఒక ప్రదేశాన్ని ఆక్రమించి, తమ రాజ్యంగా ప్రకటించుకునేవాళ్ళు. గుంపు నాయకుడే రాజు అయ్యేవాడు. లేక యింతకు ముందే ఆక్రమించిన రాజుపై దండెత్తి ఓడించి, తమ రాజ్యంగా ప్రకటించుకునేవాళ్ళు. ఆ తర్వాత రాజు కొడుకు, అతని కొడుకు, యిలా వంశపారంపర్యంగా రాజులవుతుండేవాళ్ళు, మరొక గుంపు ఓడించే దాకా ఆ రాజ్యంలో నిర్ణయాలన్నీ రాజే చేస్తాడు. అన్నిటికీ రాజునే స్తుతిస్తారు.

యిప్పుడున్న ప్రజాస్వామ్యంలో అప్పటి రాచరికంలేదు. యిప్పుడు ప్రజలు రాజుని ఎన్నుకోవాలి, పరోక్షంగానైనా. తర్వాత రాజుగారు (యిప్పుడు ముఖ్యమంత్రి అనిపిలుస్తున్నాం) తన యిష్టా రాజ్యంగా పరిపాలిస్తారు. పేరుకి ప్రజాప్రతినిధులు (ఎమ్.ఎల్.ఏ లు), మంత్రులు వుంటారు. కాని నిర్ణయాలు మాత్రం రాజుగారే చేస్తారు. యిక ప్రభుత్వ ప్రకటనలన్నిటిలోనూ, రాజుగారి ఫోటో తప్పనిసరి. అంతకుముందు రెండు వేళ్ళు చూపుతూ చంద్రబాబునాయుడు ప్రతిప్రకటనలోనూ దర్శనమిచ్చేవాడు. అది ఎయిడ్స్‌గాని, టూరిజంగాని, కల్తీ సారాయిగాని ఏదైనా. యిప్పుడు రాజశేఖరరెడ్డిగారు ఐదువేళ్లు చూపుతూ దర్శనమిస్తున్నారు. యీ ప్రకటనలన్నిటిలో ఫోటో ప్రచురణకి, పెయింటింగ్‌కి అయ్యే ఖర్చు దాదాపు యాభై కోట్ల రూపాయలు అని వినికిడి. ఒక వ్యక్తి ప్రచారానికి యాభై కోట్ల రూపాయల ప్రజాధనం ఖర్చు పెట్టడమేమిటి? ప్రజాస్వామ్యంలో ఒక వ్యక్తి నిర్ణయం తీసుకోవడమేమిటి? సమిష్టిగా చేసిన నిర్ణయాలని అమలు పరచడమే వ్యక్తి పనిగా వుండాలి గాని, అతని/ఆమె యిష్టారాజ్యంగా వుండకూడదు.

యిప్పుడు ఎంత దౌర్భాగ్య స్థితి వుందంటే, తెలంగాణా రాష్ట్రం ఏర్పడాలా లేదా అనేది సోనియాగాంధీ గారి యిష్టానికి వదిలేశామని మనం ప్రతినిధులుగా ఎన్నుకున్న కాంగ్రెసు, టిఆర్‌యస్ వాళ్ళంతా చెబుతున్నారు. తెలంగాణా ప్రజలు, ఆంధ్రప్రదేశ్ ప్రజలు, దేశ సమస్య అవుతుందనుకుంటే యీ దేశ ప్రజలు లేక వారు ఎన్నుకున్న ప్రతినిధులు చర్చించి నిర్ణయానికి రావాలి గదా. అన్నీ సోనియమ్మ గారే చేస్తే యీ ప్రజాప్రతినిధులెందుకు, నిధులు పోగేసుకోవటానికేనా?

యీ రోజు ఒక్కొక్క ఎమ్.ఎల్.ఏ కి సంవత్సరానికి లక్షల రూపాయలు ఖర్చవుతున్నాయి. వారి జీతం, ప్రయాణ ఖర్చులు, విదేశీ ప్రయాణ ఖర్చులు, అలవెన్సులు, అసెంబ్లీలో కూర్చున్నందుకు అలవెన్సు, గన్‌మెన్ జీతాలు, సెక్రెటరీ జీతాలు, యిలాటివన్నీ కలుపుకుని సంవత్సరానికి ఒక్కొక్కరికి కోటి రూపాయలపైనే కావచ్చు. వాళ్ళు పైరవీలతో అక్రమంగా సంపాదించుకునేది యింకా చాలా చాలా అవుతుంది. యిదంతా ప్రజల సొమ్మే. మరి వందల కోట్లు ఖర్చు పెట్టి మనం వీళ్లందరినీ ఎందుకు పోషిస్తున్నట్లు? వీళ్ళు చాలదన్నట్లు, కౌన్సిల్ ఏర్పాటు చేస్తానని రాజుగారు ప్రకటించారు. మహారాణి (సోనియమ్మ) గారి అనుమతి కూడా పొందాడని చెబుతున్నారు. అంటే సంవత్సరానికి మరో వంద కోట్ల రూపాయల ఖర్చు. ఎందుకోసం, ఏం సాధించటం కోసం?

ప్రకటించిన గిట్టుబాటు ధరలకి ధాన్యం, యితర వ్యవసాయ వుత్పత్తులు కొనమని రైతులడిగితే, వంద కోట్ల రూపాయలు ఖర్చవుతుంది, నా దగ్గర డబ్బులేదని సమాధానం. మరి కొనని వ్యక్తికి కౌన్సిల్‌ని మేపడానికి డబ్బులెక్కడ నుండి వస్తున్నాయి. మనం అందరం కలిసి కొన్ని వేల కోట్ల రూపాయలు జమ చేసి యిచ్చి ప్రజలందరికవసరమయిన వాటికి అవసరమయిన విధంగా ఖర్చు చేసే బాధ్యతని ప్రజాప్రతినిధులకిస్తే, వాళ్ళంతా బాధ్యతారహితంగా, ఒక వ్యక్తికి అప్పగించి చేతులు దులుపుకుంటున్నారు. పరిటాల రవి హత్య గురించో, మంత్రిగారి అవినీతి గురించో జరిగినంత చర్చ కూడా బడ్జెట్ గురించి జరగటం లేదు. యీ రోజున తన నియోజక వర్గంలో వున్న అన్ని గ్రామాల పేర్లు చెప్పగలిగే ఎమ్.ఎల్.ఏ లు ఎంత మంది వున్నారు. ఎన్నికలప్పుడు గాకుండా, ఐదేళ్ళ పరిధిలో నియోజక వర్గంలోని అన్ని గ్రామాలని సందర్శించే ఎమ్.ఎల్.ఏ లు ఎంత మంది వున్నారు. పోనీ, ప్రతి గ్రామ అవసరాలను తన పార్టీ కార్యకర్తల ద్వారానైనా సేకరించి, వాటిని సమగ్రంగా ప్రభుత్వానికి తెలియజేసే ఎమ్.ఎల్.ఏ లు ఎంతమంది వున్నారు? ఎమ్.ఎల్.ఏ పదవి అంటే పైరవీలు చేసుకోవటం, కాంట్రాక్టులిప్పించుకోవడం, పంచాయతీలు (సమాంతర న్యాయ వ్యవస్థ అని పోలీసులే చెబుతున్నారు) నిర్వహించడం, వీటన్నిటి ద్వారా అక్రమ ధనార్జన చేయడంగా అయిపోయింది. ప్రజాసమస్యలు తీర్చడమంటే, ఎక్కడో ఒక చోట ఏదో పని చేస్తామని పునాది రాళ్ళు వేయడం, డబ్బు సంపాదనలో భాగంగా చేసే అరకొర పనుల్నే, తమ ఘనతలుగా చాటుకోవడం.

(మిగతా 50వ పేజీలో)

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం 2005

ముఖ్యమైన అంశాలు

గ్రామీణ ప్రాంతాలలోని నిరుపేద కూలీ కుటుంబాల బతుకులకు భద్రత కల్పించడం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ప్రధాన లక్ష్యం. నైపుణ్యం లేని పనులను చేయడానికి ముందుకు వచ్చే ప్రతి కుటుంబానికి ఏడాదిలో కనీసం 100 పనిదినాలు కల్పించడం, పని కల్పించలేకపోతే నిరుద్యోగభృతి చెల్లించడం, పనిచేసే చోట తగిన సౌకర్యాలు కల్పించడం వంటివి ఈ చట్టంలో పొందుపర్చిన ముఖ్యమైన అంశాలు... దానికి తగ్గట్టుగా లక్ష్యాలు, విధి విధానాలు, అమలు వ్యవస్థలతో పాటు నిబంధనలను ఉల్లంఘిస్తే తీసుకునే చర్యలను కూడా నిర్వచించారు. ఈ చట్టాన్ని ఆగస్టు 23, 2005న పార్లమెంట్ ఆమోదించింది.

ఉద్దేశం

నైపుణ్యత అవసరంలేని కూలిని చేయటానికి ముందుకు వచ్చే ప్రతి కుటుంబంలోని పెద్దవాళ్ళకి వంద రోజులకు తక్కువ కాకుండా కూలీ ఉపాధి కల్పించటం

అమలయ్యే ప్రాంతాలు

- కేవలం గ్రామీణ ప్రాంతాలు
- చట్టం పరిధిలోకి వచ్చే ప్రాంతాలను కేంద్ర ప్రభుత్వం ప్రకటిస్తుంది.

కూలీల హక్కులు

- నైపుణ్యత అవసరం లేని కూలి పని చేయటానికి ముందుకు వచ్చే ప్రతి ఒక్కరూ తమ పేరును గ్రామ పంచాయితీలో నమోదు చేయించుకుని పని పత్రాన్ని పొందవచ్చు
- పంచాయితీలో నమోదు చేసుకున్న ప్రతి కుటుంబానికి 100 రోజులకు తక్కువ కాకుండా కూలి పని తప్పనిసరిగా కల్పిస్తారు
- అర్హులైన ప్రతి ఒక్కరికి దరఖాస్తు చేసుకున్న 15 రోజులలో కుటుంబ పరిమితికి లోబడి కోరుకున్నన్ని పనిదినాలు కల్పిస్తారు
- పని కల్పించని పక్షంలో కూలీలకు రోజువారీ నిరుద్యోగ భృతిని చెల్లించాలి. మొదటి 30 రోజులకు గాను కనీస కూలీ రేటులో 25 శాతం, మిగిలిన రోజులకు 50 శాతం చొప్పున చెల్లించాలి.
- దరఖాస్తు చేసుకున్న సమయంలో ఉంటున్న ప్రదేశానికి 5 కిలోమీటర్ల పరిధిలో పని కల్పించాలి, అలా కాని పక్షంలో రవాణా, ఇతర ఖర్చుల కింద కూలీ మొత్తంలో 10 శాతం అదనంగా చెల్లించాలి
- ప్రస్తుతం నడుస్తున్న పనిలో కూలి కల్పించలేనప్పుడు, కనీసం 50 మంది ఆ పనికి అందుబాటులో ఉన్నప్పుడు మాత్రమే కొత్త పని మొదలు పెడతారు. అయితే కొండ ప్రాంతాలకు, చెట్లు నాటే పనులకు ఇది వర్తించదు
- పని జరిగే ప్రదేశంలో తాగునీరు, అత్యవసర వైద్య సదుపాయాలు, పిల్లల్ని చూసుకోవటం వంటి సౌకర్యాలు కల్పిస్తారు
- కూలీలకు సకాలంలో డబ్బులు చెల్లింపు, ప్రమాదం, చావు వంటి సందర్భాలలో నష్టపరిహారం చెల్లిస్తారు
- కూలీ వేతన చెల్లింపు చట్టం, సమాన కూలీ చట్టం (1996) ప్రకారం కూలీ నిర్ణయించాలి.

చేపట్టే పనులు

- కాంట్రాక్టర్లు, కూలీల పని తగ్గించే యంత్రాలు నిషేధం
- చేపట్టే పనులను యంత్రాలతో కాకుండా సాధ్యమైనంత వరకు కూలీలతో చేస్తారు
- ప్రధానంగా కూలీలు చేసే పనులే చేపడతారు
- ముడి సరుకు, నైపుణ్యత గల కూలీలు, కొంత నైపుణ్యతగల కూలీలకు అయ్యే మొత్తం ఖర్చు 40 శాతానికి మించకూడదు
- షెడ్యూల్డ్ కులాలు, తెగల కుటుంబాలకు చెందిన భూములకు సాగునీటి సదుపాయ కల్పన
- సాంప్రదాయ సాగునీటి వనరుల పునరుద్ధరణ, చెరువుల పూడిక తీయటం
- భూమి అభివృద్ధి పనులు
- వరద నియంత్రణ, రక్షణ పనులు, నీరు నిలబడిపోయే ప్రాంతాలలో మురుగునీరు తీసే పనులు
- అన్ని కాలాల్లో అనువుగా ఉండేలా గ్రామీణ ప్రాంతాలకు రోడ్ల సౌకర్యం
- రాష్ట్ర ప్రభుత్వాలతో సంప్రదించి కేంద్ర ప్రభుత్వం ప్రకటించే ఇతర పనులు

కూలీ రేట్లు

- రోజు కూలీ 60 రూపాయలకు తగ్గకూడదు
- కనీస కూలీ చట్టంతో సంబంధం లేకుండా ఎప్పటికప్పుడు కూలీ రేట్లను నిర్ణయించే అధికారం కేంద్ర ప్రభుత్వానికి ఉంది. వివిధ ప్రాంతాలకు వివిధ రేట్లను కేంద్ర ప్రభుత్వం ప్రకటించవచ్చు
- కేంద్ర ప్రభుత్వం కూలీ రేట్లు ప్రకటించే వరకు రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ కూలీలకు ప్రకటించిన కనీస కూలీ రేటు వర్తిస్తుంది

కూలీ చెల్లింపు

- కూలీలకు ప్రతి వారం డబ్బులు చెల్లించాలి. ఎట్టి పరిస్థితిలోను ఇది 15 రోజులకు మించకూడదు
- కూలీ మొత్తాన్ని కొంత నగదుగాను, కొంత బియ్యం రూపంలోనూ ఇస్తారు. కూలీ మొత్తంలో కనీసం 25 శాతం నగదు రూపంలో ఇవ్వాలి
- నగదు రూపంగా ఇచ్చే కూలీ మొత్తం నుంచి ప్రతిరోజు కొంత మొత్తం ఇచ్చేలా ఏర్పాట్లు చేయాలి

అమలు వ్యవస్థ, ప్రక్రియ

చట్టం రూపాందించిన తరువాత దీనిని అమలు చెయ్యటానికి ప్రతి రాష్ట్ర ప్రభుత్వం ఆరు నెలల లోపల ఒక పథకాన్ని రూపొందించాలి. ప్రణాళిక తయారీ, అమలు, పర్యవేక్షణ వంటి అన్ని అంశాలలో పంచాయితీ సంస్థలు కీలక పాత్ర వహిస్తాయి, మొత్తం మీద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పని చేస్తాయి. ఆయా స్థాయిల్లో చట్టం అమలుకు వ్యవస్థలు, వాటి బాధ్యతలు ఇలా ఉంటాయి.

గ్రామసభ స్థాయిలో...

- గ్రామ పంచాయితీ చేపట్టాల్సిన పనులను సిఫారసు చేయడం
- గ్రామ పంచాయితీ చేపట్టే పనులను పర్యవేక్షించడం
- సామాజిక తనిఖీ

గ్రామ పంచాయితీ స్థాయిలో...

- గ్రామసభ సిఫారసుల ఆధారంగా అభివృద్ధి ప్రణాళిక తయారు చేయడం
- పనికోరే కుటుంబాలను, పని అవసరాన్ని నమోదు చేసుకోవటం, కూలీల హక్కులను గుర్తించడం, కల్పించిన పని దినాలను నమోదు చేసే పని కాగితాన్ని కుటుంబాలకు జారీ చేయడం
- పనులను కేటాయించడం
- ఒక పథకం కింద కనీసం 50 శాతం నిధులకు అమలు బాధ్యత వహించటం

జిల్లా స్థాయిలో...

జిల్లా పరిషత్ బాధ్యతలు తీసుకుంటుంది. బ్లాకుల వారీగా చేపట్టే పనుల జాబితాను ఆమోదించి, ఖరారు చేయటంతో పాటు పనుల తీరును పర్యవేక్షిస్తుంది. ఇందుకు జిల్లా పరిషత్‌కు జిల్లా కోఆర్డినేటరు సహాయం చేస్తారు. జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వహణ అధికారి, లేదాజిల్లా కలెక్టరు, లేదా ఇతర జిల్లా స్థాయి అధికారిని రాష్ట్ర ప్రభుత్వం జిల్లా కోఆర్డినేటరుగా నియమిస్తుంది. ఆ అధికారి బాధ్యతలు :

- కార్యక్రమం అమలుకు మొత్తం మీద బాధ్యత వహించడం
- మండల పరిషత్ తయారు చేసిన ప్రణాళికలు క్రోడీకరించి, ఆమోదం నిమిత్తం జిల్లా పరిషత్‌కి పంపించడం
- జిల్లా పరిషత్ ఆమోదం కోసం కూలీల బడ్జెట్ తయారుచేయడం
- పనులను పరిపాలన, సాంకేతిక ఆమోదాలను ఇవ్వడం
- కార్యక్రమ అధికారులతో సమన్వయం
- పనుల అమలును సమీక్షించటం, పర్యవేక్షించటం
- సమస్యల పరిష్కారం

మండల స్థాయిలో...

మండల ప్రణాళికను మండల పరిషత్ ఆమోదించి జిల్లా పరిషత్‌కు అందచేస్తుంది. ప్రణాళిక అమలును పర్యవేక్షిస్తుంది. కార్యక్రమ అధికారి ఈ పనిలో సహాయం చేస్తారు. దీనికోసం రాష్ట్ర ప్రభుత్వం మండల అభివృద్ధి అధికారి హోదాకి తగ్గని ఒక అధికారిని ప్రత్యేకంగా కార్యక్రమ అధికారిగా నియమిస్తుంది. కార్యక్రమ అధికారి, ఇతర సహాయక సిబ్బంది జీతాలను కేంద్రం భరిస్తుంది

కార్యక్రమ అధికార బాధ్యతలు:

- ప్రతిపాదిత ప్రణాళికలను క్రోడీకరించి, మండల పరిషత్, ఆమోదాన్ని పొందడం
- నిరుద్యోగ భృతిని మంజూరు చేయటం, పర్యవేక్షించటం, సామాజిక తనిఖీ జరిగేలా చూడటం
- జిల్లా కోఆర్డినేటర్‌కు జవాబుదారీగా పనిచేయడం

ఉపాధి హామీ సంఘాలు

కార్యక్రమాల అమలుకు గాను కేంద్ర, రాష్ట్ర స్థాయిల్లో ఉపాధి హామీ సంఘాలు ఏర్పడతాయి.ఈ సంఘాలలో అధికారులతో పాటు మహిళలు, షెడ్యూల్డ్ కులాలు,షెడ్యూల్డ్ తెగలు, ఇతర వెనకబడిన కులాలు, అల్ప సంఖ్యాక వర్గాలు, పంచాయితీరాజ్ సంస్థల ప్రతినిధులు ఉంటారు. రాష్ట్ర సంఘం కూడా చేపట్టదగిన పనుల జాబితాను తయారు చేస్తుంది. ఉపాధి హామీ సంఘం బాధ్యతలు:

- కార్యక్రమ అమలును క్రమం తప్పకుండా సమీక్షించటం, పర్యవేక్షించటం
- కార్యక్రమం గురించి విస్తృతంగా ప్రచారం చేయటం
- కార్యక్రమ అమలు గురించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సలహాలివ్వడం


ఉపాధి హామీ నిధులు

పార్లమెంటు ఆమోదంతో జాతీయ ఉపాధి హామీ నిధిని కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తుంది. కేంద్ర ప్రభుత్వం తయారు చేసే షరతులు, నిబంధనలకు లోబడి ఈ నిధిని ఉపయోగిస్తారు. రాష్ట్రాలు కూడా రాష్ట్ర ఉపాధి హామీ నిధిని ఏర్పాటు చేయవచ్చు.

- 'వాసన్' సౌజన్యంతో

కదంబం

అసమ సమాజంపై తిరుగుబాటు



అసమ సమాజం ఎటువంటి హింసను ప్రేరేపించగలదో నవంబర్ మొదటి వారంలో చెలరేగిన ఫ్రాన్స్ హింసాకాండ కళ్ళకు కట్టింది.

అక్టోబర్ 27 నాడు ఫ్రాన్స్‌లో పేద వలసవాసులు ఉండే క్లిషి-సౌ-బోయ్ అనే వాడలో ఇద్దరు యువకుల మృతి ఈ విధ్వంసకాండ మొదలవడానికి తక్షణ కారణం. కానీ ఫ్రాన్స్‌లో 'బాన్‌లు' (సబర్బన్ మురికివాడ)లలో నివసిస్తున్న లక్షలాది వలస ప్రజానీకానికి మాత్రం అది అనేక దశాబ్దాల వివక్షపై ధిక్కార ప్రకటన.

నల్లజాతి ఆఫ్రికన్ ముస్లిములు ఈ దాడులకు పాల్పడినా మొత్తంగా పరిశీలిస్తే ఇవి మతపరమైన దాడులు కావు. కేవలం ప్రభుత్వ, పోలీసు వైఖరిపై అసహనంతో ఉన్న వర్గం ఈ దాడులకు పాల్పడింది. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులు అనేకం పరశురామ ప్రీతి అయ్యాయి. దాదాపు పదివేల కార్లు బుగ్గి అయ్యాయి. ఈ నిరసన జ్వాలలు ఫ్రాన్స్ సరిహద్దులు దాటి బెల్జియం, డెన్మార్క్, జర్మనీ, గ్రీస్, నెదర్లాండ్స్, స్పెయిన్, స్విట్జర్లాండ్ దేశాలకు పాకటం గమనార్హం.

పెద్దగా ప్రాణనష్టం (ఈ దాడులలో చనిపోయింది ఒకే వ్యక్తి) లేకుండానే తమ నిరసనను ప్రకటించి, ఫ్రెంచి సమాజపు వివక్షాపూరిత విధానాలను ప్రపంచానికి చాటిచెప్పింది దహనకాండ.


సిఐఏ చీకటి జైళ్ళ టెర్రరిజం

అమెరికా నేరాల చిట్టాలో మరో నేరం చేరింది. టెర్రరిజంపై యుద్ధం పేరిట అనేక మందిని అక్రమంగా నిర్బంధించడం, వారిని క్రూరంగా హింసించడమే కాకుండా అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించి బందీలను వివిధ దేశాల్లోని రహస్య జైళ్ళకు అమెరికా తరలిస్తోందని నవంబర్ మొదటి వారంలో వాషింగ్టన్ పోస్ట్ పత్రిక సంచలనాత్మక కథనం వెలువరించింది.

అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థ ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ కూడా నవంబర్ 8న సిఐఏ ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ అక్రమ చీకటి జైళ్ళపై సవివరమైన నివేదికను ప్రచురించింది. ఇందులో ఒళ్ళు గగుర్పొడిచే అనేక వివరాలు వెల్లడించింది ఆమ్నెస్టీ. అందరికీ తెలిసిన గ్వాంటనామో బే-క్యూబా, అబూ గ్రేబ్ - ఇరాక్ జైళ్ళలో దాదాపు పదకొండు వేల మంది బందీలుగా ఉండగా ఎవరికీ తెలియకుండా సిఐఏ అనేక మందిని ఈజిప్ట్, జోర్డాన్, మొరాకో, పాకిస్తాన్, ఖతార్, సౌదీ అరేబియా, సిరియాలకు అమెరికా పంపిందని ఆమ్నెస్టీ పేర్కొంది.

యూరప్‌లోని పోలండ్, రొమేనియా దేశాల్లోని రహస్య జైళ్ళకు అమెరికన్ గూఢచారి సంస్థ సిఐఏ అనేక వందలమందిని విమానాల్లో తరలించిందని వాషింగ్టన్ పోస్ట్ ప్రకటించింది. ఈ ఆరోపణలపై విచారణ జరపాలని, అమెరికా ప్రభుత్వాన్ని నిజాలు వెల్లడించాలని డిమాండ్ చేయాలని యురోపియన్ యూనియన్ నిర్ణయించింది. బందీలను తరలించడానికి తమ విమానాశ్రయాలను సిఐఏ అక్రమంగా వినియోగించుకున్నదని తెలియగానే ఈ ఉదంతంపై స్పెయిన్, స్వీడన్, ఐస్‌లాండ్ దేశాలు విచారణకు ఆదేశించాయి.

'టెర్రరిజంపై పోరాటం తప్పక చేయాల్సిందే కానీ ఆ పోరాటం న్యాయబద్ధమైనదిగా ఉండాలి' అంటున్న యూరపియన్ యూనియన్ విచారణాధికారి డిక్ మార్టి మాటలు అమెరికాకు ఎప్పటికయినా అర్థమవుతాయా?



ఇంటర్నెట్ ఎవరి సొంతం?

ఇంటర్నెట్ ఇవ్వాళ ఒక బిలియన్ మంది ప్రపంచ ప్రజల నిత్య జీవితంలో ఒక భాగం అయిపోయింది. అయితే ఇంటర్నెట్‌పై అమెరికా గుత్తాధిపత్యం చెలాయిస్తోందనీ, సమాచార స్వేచ్ఛకు ఇది తీవ్ర విఘాతం అని అనేక ప్రపంచ దేశాలు గళం విప్పాయి. ట్యునీషియాలో జరిగిన 'వరల్డ్ సమ్మిట్ ఆన్ ఇన్ఫర్మేషన్ సొసైటీ' వేదికపై యురోపియన్ యూనియన్, భారత్, బ్రెజిల్, ఇరాన్, ఇతర ఆఫ్రికా, ఆసియా దేశాలు ఇంటర్నెట్‌పై అమెరికా హక్కును ఇక కొనసాగించరాదని, అది ఒక స్వతంత్ర సంస్థకు అప్పజెప్పాలనీ గట్టిగా కోరాయి.

ఇప్పుడు ఇంటర్నెట్‌ను నియంత్రిస్తున్న 'ఇంటర్నెట్ కార్పొరేషన్ ఫర్ అసైన్డ్ నేమ్స్ అండ్ నెంబర్స్ (ఐసిఏఎన్ఎన్) పేరుకు స్వతంత్ర సంస్థే అయినా అది అమెరికా వాణిజ్యశాఖ ఆధ్వర్యంలోనే నడపబడుతోంది. ఇంటర్నెట్‌లో కీలకమైన 13 రూట్ డిఎన్ఎస్ సర్వర్లు అమెరికాలోనే ఉన్నాయి.

ఇంటర్నెట్ యాజమాన్యాన్ని అమెరికా నుండి తప్పించి ఐక్యరాజ్య సమితికి అప్పజెప్పాలన్న కొన్ని దేశాల వాదనలో కూడా లోపాలున్నాయి. ఎందుకంటే నేడు ఐక్యరాజ్యసమితి నిష్క్రియాపరత్వానికి మారుపేరుగా మారిపోయింది. దాని చేతిలోపడితే ఇంటర్నెట్ ఇంకా అరాచకంగా మారిపోతుందనే భయాలూ ఉన్నాయి.

అందుకేనేమో ఎన్ని వాదోపవాదాలు జరిగినా చివరికి ట్యునీషియా సదస్సులో ప్రస్తుతానికి ఇంటర్నెట్ యాజమాన్యం యథాతథంగా ఉంచాలని ఒక నిర్ణయానికి వచ్చాయి ప్రపంచదేశాలు.

కదంబం




కాల్ సెంటర్లు కావవి, రోమన్ బానిస నౌకలు!

ఐటీ ఆధారిత బిజినెస్ ప్రాసెస్ ఔట్‌సోర్సింగ్ (బిపిఓ) లేదా కాల్‌సెంటర్ పరిశ్రమలోని ఉద్యోగులు ఎటువంటి పరిస్థితులలో పనిచేస్తున్నారో వివి గిరి నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లేబర్ ఓ కొత్త నివేదికలో వెల్లడించింది. రోమన్ బానిస నౌకల్లో ఉండే వాతావరణమే కాల్ సెంటర్లలో ఉందనీ, కాసిన్ని కాసుల కోసం తమ విలువైన జీవిత కాలాన్ని యువత ఈ ఉద్యోగాల్లో పోగొట్టుకుంటోందని ఆ నివేదిక తెలియజేస్తోంది. ఈ రంగంలో పనిజేసే అత్యధికులకు కెరీర్‌పరంగా ఎటువంటి ఎదుగుదల ఉండదని, వారు నిత్యం అత్యంత కఠినమైన వత్తిడిలో పనిచేయటం మూలాన వారి ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయని ఆ నివేదిక హెచ్చరించింది.

ఎలాంటి కార్మిక చట్టాల పరిధిలో ఈ రంగం లేకపోవడం వల్ల ఉద్యోగులకు కనీస హక్కులు లేని దుర్భర పరిస్థితులు ఉన్నాయని వివి గిరి నివేదిక ద్వారా తెలుస్తోంది.

నానాటికీ విస్తరిస్తున్న బిపిఓ పరిశ్రమ ఉద్యోగులు అసంఘటిత రంగంలో ఉన్నారు. వారి హక్కుల పరిరక్షణ కొరకు వారికో యూనియన్ ఉండటం అవసరమని భావించిన సెంటర్ ఫర్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సిఐటియు), బిపిఓ ఉద్యోగుల కొరకు ఓ కొత్త ట్రేడ్ యూనియన్ నెలకొల్పుతున్నట్టు ప్రకటించింది. 5.2 బిలియన్ డాలర్ల టర్నోవర్‌తో దాదాపు అయిదు లక్షల మందికి ప్రత్యక్ష ఉపాధినిస్తున్న బిపిఓ పరిశ్రమకు మాత్రం ఈ పరిణామం రుచించినట్లు కనబడటం లేదు.

ముంబై హైకోర్టు సంచలన తీర్పు



నగరం నడిబొడ్డున ఉన్న ఖాయిలా నూలుమిల్లుల భూములు ఒక్కటొక్కటీ రియల్ ఎస్టేట్ బిల్డర్ల చేతికి చిక్కి కాంక్రీట్ వనాలుగా మారిపోతున్న దశలో వెలువడ్డ ఈ తీర్పు ముంబై వాసులకు గొప్ప ఊరట కలిగించింది. అయితే బాంబే ఎన్విరాన్‌మెంట్ యాక్షన్ గ్రూప్ అనే స్వచ్ఛంద సంస్థ వేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని విచారించిన ముంబై హైకోర్టు అక్టోబర్ 17న డెవలప్‌మెంట్ కంట్రోల్ రూల్ సవరణ చెల్లదని తీర్పు చెప్పింది.

ముంబైలో మిల్లు భూములను వినియోగించే విధానాన్ని నియంత్రించే డెవలప్‌మెంట్ కంట్రోల్ రూల్ (డిసిఆర్)ను 2001లో అప్పటి ముఖ్యమంత్రి విలాస్‌రావ్ దేశ్‌ముఖ్ సవరించాడు. తత్ఫలితంగా ఈ భూములు షాపింగ్ కాంప్లెక్సులు, మాల్స్, అపార్ట్‌మెంట్ కాంప్లెక్సుల్లా మార్చడానికి మార్గం సుగమమయ్యింది.

దేశ వాణిజ్య రాజధానిగా పేరుగాంచిన ముంబైలో భూమి ఎంత ప్రియమైనదో అక్కడ మిల్లు భూములకు లభిస్తున్న ధరలే సాక్ష్యం. ప్రభుత్వరంగ సంస్థ అయిన నేషనల్ టెక్స్‌టైల్స్ కార్పొరేషన్ (ఎన్‌టీసీ) కొద్ది నెలల క్రితం తన ఆధీనంలోని 5 మిల్లులను అమ్మింది. వాటి అమ్మకపు ధరలు చూడండి... ఎల్ఫిన్‌స్టోన్ మిల్లు - 441.8 కోట్లు, జూపిటర్ మిల్లు - 276 కోట్లు, అపోలో మిల్లు - 180 కోట్లు, కోహినూర్ మిల్లు - 421 కోట్లు. ఇందులో చివరిదైన కోహినూర్ మిల్లును శివసేన నాయకులు మనోహర్‌జోషి కుమారుడు ఉమేష్ జోషి, ఇంకో శివసేన ప్రముఖుడు రాజ్ థాక్రే కలిసి కొన్నారు. ఇప్పుడీ తీర్పుతో ఆ లావాదేవీలన్నీ రద్దయినట్లే.

ముంబై మిల్లులకు 150 ఏళ్ల ఘన చరిత్ర ఉంది. 1854లో మొట్టమొదటగా బాంబే స్పిన్నింగ్ మిల్లు ప్రారంభించబడింది. అప్పటికి బ్రిటన్ రాజ్యపు దుస్తుల అవసరాలు అమెరికా ద్వారా తీరేవి. అయితే అంతర్యుద్ధం ఫలితంగా అమెరికా నుండి ఎగుమతులు కుంటుపడటంతో ఆ స్థానాన్ని మనదేశం చేజిక్కించుకుంది.

1961 నాటికి ఉచ్ఛ దశలో ఉన్న బొంబాయి నూలు మిల్లులు రెండున్నర లక్షల మందికి ఉపాధి కలిగించేవి. అయితే ఇతర దేశాల నుండి వస్తున్న తీవ్ర పోటీని తట్టుకోలేక సంక్షోభంలో కూరుకుపోయిన ఈ పరిశ్రమ క్రమంగా తన వైభవాన్ని కోల్పోయింది. ఇప్పుడు ముంబైలో యాభై ఎనిమిది మిల్లులు పని చేస్తున్నాయి. వీటిల్లో సుమారు ఇరవై వేల మంది పనిచేస్తున్నారు.

సామాజిక న్యాయపు ప్రశ్నలివి!

ఎన్. వేణుగోపాల్

రాష్ట్రంలో విద్య, ఉద్యోగాల్లో ముస్లింలకు ఐదుశాతం రిజర్వేషన్ కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన చట్టాన్ని హైకోర్టు విస్తృత ధర్మాసనం కొట్టివేసింది. ఆ చట్టం రాజ్యాంగ విరుద్ధమని, సరైన కారణాలతో తయారు కాలేదని ధర్మాసనంలోని న్యాయమూర్తులు అభిప్రాయపడ్డారు. వెనుకబడిన కులాల కమిషన్ నివేదిక ఆధారంగానే ఐదు శాతం రిజర్వేషన్ విధానం అమలులోకి వచ్చింది గనుక ధర్మాసనం ఆ కమిషన్ నివేదికను కూడ తీవ్రంగా తప్పుపట్టింది. సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వారికి మాత్రమే రిజర్వేషన్లు కల్పించాలని, ముస్లింలందరూ అట్లా వెనుకబడి ఉన్నారని కమిషన్ చెప్పడం తప్పని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

హైకోర్టు తీర్పు మీద రాజకీయ వైఖరుల నుంచి అటూ ఇటూ ప్రతిస్పందనలూ వెలువడుతున్నాయి. ముస్లింలకు రిజర్వేషన్ల కల్పనను కోర్టు కొట్టివేయడాన్ని భారతీయ జనతాపార్టీ, సంఘ్ పరివార్ ఆహ్వానించాయి. ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళతానని ప్రకటించింది. చట్టంలోని సాంకేతిక లోపాలను సవరించాలని, అవసరమైతే రాజ్యాంగ సవరణ చేయాలని సిపిఐ, సిపిఐ-ఎంలు వ్యాఖ్యానించాయి. ఐదుశాతం కాక, మూడు శాతం రిజర్వేషన్ అయితే సమస్య వచ్చిఉండేది కాదని తెలుగుదేశం అభిప్రాయపడింది.

రాజకీయాభిప్రాయాల, ఆరోపణల-ప్రత్యారోపణల గందరగోళం మధ్య అసలు గుర్తించవలసిన సమస్యలు మరుగున పడిపోతున్నాయి. ధర్మాసనం ఇచ్చిన తీర్పులో, చేసిన వ్యాఖ్యలలో ఉన్న అభ్యంతరకరమైన అభిప్రాయాల గురించి, సామాజిక న్యాయభావనకు తూట్లుపొడిచే వైఖరి గురించి చర్చించవలసి ఉండగా అదంతా పక్కదారి పడుతోంది.

ఒక మతపరమైన సమూహంగా మాత్రమే కాక ఒక సామాజిక బృందంగా ముస్లింల వెనుకబాటుతనం గురించి ఏ ముస్లిం మొహల్లాకు వెళ్ళిచూసినా కళ్ళకు కట్టినట్టు కనబడుతుంది. అది ఒక మతం కదా, కులాలకు ఇచ్చినటువంటి రిజర్వేషన్లు వాళ్లకు ఎట్లా ఇవ్వవచ్చు అని పండిత చర్చలు చేసే వారందరికీ ఇవాల్టికీ మన గ్రామాలలోని సబ్బండ వర్ణాలలో ఒక కులంగానే ముస్లింలు గుర్తించబడుతున్నారని గుర్తుచేయక తప్పదు. పేరుకు ముస్లింరాజులు, నవాబులు, జాగీర్దారులు కొన్ని వందల ఏళ్లపాటు రాజ్యం చేసినా, అనల్‌మాలిక్ పేరుతో ముస్లిం సాధారణ ప్రజానీకంలో అభిజాత్యం రెచ్చగొట్టడానికి ప్రయత్నించినా ఆ రోజున కూడ ముస్లింలలో ఏ ఐదు శాతం మందో సంపన్నులుగానూ, తొంభైశతం పైగా పేదలుగానూ ఉండేవారనేది వాస్తవం. అష్రఫ్ అజ్లఫ్ విభేదాలే కాదు, హిందూ సమాజ ప్రభావంతో అంతరాల సమస్యలు ఏర్పడి, ఇస్లాంలోని మౌలికమైన సర్వమానవ సమానత్వం, సోదరత్వం అంతరించిపోయాయి. తమ వాళ్ళే రాజరికం చేస్తున్నారనే భేషజం కూడ తొలగిపోయిన తర్వాత దేశవ్యాప్తంగానే ఎక్కడెక్కడ పేదరికం, అవిద్య, అనారోగ్యం, నిరుద్యోగం, వెనుకబాటుతనం తాండవిస్తుంటే అక్కడక్కడ ముస్లింలదే అత్యధిక జనాభా అయింది. చేతివృత్తులు, తక్కువ ఆదాయం వచ్చే వృత్తులు, మెకానిక్‌లు, తాళాలు బాగుచేసేవాళ్ళు మిషన్‌కుట్టేవాళ్ళు, దూది ఏకేవాళ్ళు, పట్టణాల శివార్లలో మురికివాడల్లో ఉండేవాళ్ళు - ఇదీ ముస్లింల జీవనచిత్రం. ప్రపంచీకరణ క్రమం తర్వాత ఈ వృత్తుల్లో చిన్నస్థాయి కార్ఖానాలు చాలా మూతబడిపోయాయి కనుక వాళ్లకు ఆ మాత్రం ఉపాధి కూడ లేకుండాపోయింది. సరిగ్గా అప్పుడే దేశంలో మతకల్లోలాల మంటలు మరింతగా చెలరేగి, బాబ్రీ మసీదు విధ్వంసం కూడ జరిగి, ఈ దేశంలో ముస్లింలు రెండోతరగతి పౌరుల్లా ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని, నిత్య అభద్రతతో బతకవలసిన స్థితి వచ్చింది. కొనసాగుతున్న వెనుకబాటుతనానికి అభద్రత కూడ తోడయింది.

దేశవ్యాప్తంగా ముస్లిం జీవన దృశ్యం అదయితే ఇందుకు ఆంధ్రప్రదేశ్ ముస్లింల జీవన దృశ్యం ఏమీ భిన్నమైనదికాదు. ఇక్కడ కూడ పాత నవాబుల జాగీర్దారుల వారసులు ఏ కొందరో సకల సౌభాగ్యాలు అనుభవిస్తున్నట్టు, విద్యలో, ఉద్యోగాలలో అన్ని సౌకర్యాలు పొందుతున్నట్టు కనబడవచ్చు. అటువంటి ఒక సంపన్న ముస్లిం కుటుంబానికి సమాంతరంగా కనీసం లక్షమంది నిరుపేద ముస్లింలు కనబడతారు. రాజ్యాంగబద్ధంగా మిగిలిన వెనుకబడిన కులాలు, బృందాలు అన్ని విద్య, ఉద్యోగరంగాలలో అభివృద్ధి చెందడానికి ఏవో రక్షణలు పొందుతుండగా, వారికన్నా దుర్భరమైన స్థితిలో కూడ ఉన్న ఈ బృందానికి మాత్రం కేవలం వారు ముస్లింలన్న కారణంగా ఏ రక్షణలూ అందడం లేదు.

ఈ స్థితిని గుర్తించినందువల్లనే కేంద్రస్థాయిలోనూ, రాష్ట్రస్థాయిలోనూ ముస్లింలకు విద్య, ఉద్యోగ రంగాలలో రక్షణలు కల్పించే ప్రయత్నాలు చాలా కాలంగా సాగుతున్నాయి. ఆ ప్రయత్నాల కొనసాగింపుగానే 2004 కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళిక 'సంవత్సరాదాయం రు.24,000 కలిగిన ముస్లిం కుటుంబాలను బిసిల జాబితాలో చేర్చాలనీ, బిసి రిజర్వేషన్‌ల మొత్తం వాటా 10 శాతం పెంచాలనీ పుట్టుస్వామి కమిషన్ మధ్యంతర సిఫారసు సమర్పించింది. అయితే కమిషన్ తన తుది నివేదికను

సమర్పించలేదు. కాంగ్రెస్ పార్టీ ఈ వ్యవహారాన్ని కొత్తగా ఏర్పాటు చేసే కమిషన్‌కు నివేదించి రిజర్వేషన్‌లను సానుకూల దృష్టితో పరిశీలిస్తుంది'. అని రాసింది. ప్రణాళికలో స్పష్టంగా ఎంతశాతం రిజర్వేషన్లు అమలు చేయనున్నారో ప్రకటించకపోయినా, రాష్ట్ర ఎన్నికల వ్యవహారాల ఇన్‌చార్జి గులాంనబీ ఆజాద్ ఏడు శాతం రిజర్వేషన్ ఇస్తామని ప్రకటించారు. డా. వైఎస్. రాజశేఖరరెడ్డి కూడా అదే అంకెను పదేపదే ప్రకటిస్తూ వచ్చారు. పుట్టుస్వామి కమిషన్ తుది నివేదిక సమర్పించకుండా రద్దు చేసిన చంద్రబాబు నాయుడుకూడా ముస్లింలకు మూడుశాతం రిజర్వేషన్ ఇస్తామని వాగ్దానం చేశారు.

అంటే ఒక రకంగా ముస్లింలకు రిజర్వేషన్లు అనేది రెండు ప్రధాన పార్టీల వాగ్దానంగా మారి విధాన నిర్ణయం స్థాయికి చేరింది. ఇదే హైకోర్టు గత ఏడెనిమిది సంవత్సరాలలో అనేక ప్రజాప్రయోజన వ్యాజ్యాలలో (ప్రభుత్వ విధాన నిర్ణయాలను తాము అడ్డుకోజాలమని, ఒకసారి ప్రభుత్వ విధానం ప్రకటన జరిగిన తర్వాత దాని సాంకేతిక న్యాయాన్యాయ విచక్షణ తమ చేతిలో ఉండదని ప్రకటించాయి. మరి ఇప్పుడు ఈ విధాన నిర్ణయంలో మాత్రం జోక్యం చేసుకోవడం మాత్రమే కాదు, ఈ రాష్ట్రంలో ఏడు శాతం ప్రజానీకం పట్ల అవమానకరమైన వ్యాఖ్యలు చేయడానికి కూడ వెనుకాడడం లేదు.

సరే, ఆ ఎన్నికలలో గెలవగానే, ఎన్నికల వాగ్దానాన్ని నిలబెట్టుకోవడానికి అన్నట్టుగా 2004 జులై 12న ముస్లింలకు విద్య, ఉపాధి రంగాలలో 5 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ రాష్ట్రం ప్రభుత్వం ఒక జీవో జారీ చేసింది. ఆ జీవో విడుదలకు అవసరమైన న్యాయపరమైన లాంఛనాలను పాటించలేదని, మైనారిటీ కమిషన్ సిఫార్సులను కాక బిసి కమిషన్ సిఫార్సుల ఆధారంగా ఇటువంటి నిర్ణయం తీసుకోవాలని అభిప్రాయపడుతూ హైకోర్టు ఆ జీవోను కొట్టివేసింది. ఆ తీర్పు తర్వాత రాష్ట్ర ప్రభుత్వం డి. సుబ్రమణ్యం నాయకత్వాన ఒక బిసి కమిషన్‌ను నియమించి ముస్లింల వెనుకబాటుతనాన్ని అంచనావేసే బాధ్యతను అప్పజెప్పింది. ఆ కమిషన్ రాష్ట్రంలో అనేక ప్రాంతాలు పర్యటించి అనేక అధ్యయనాలు చేసి 2005 మే 24న నివేదిక సమర్పించబోగా కొన్ని బిసి కుల సంఘాలు ఆ నివేదిక మీద స్టేకోసం హైకోర్టును ఆశ్రయించాయి. ఆ ఆటంకాలన్నీ అధిగమించి బిసి కమిషన్ జూన్ 14న తన నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించింది. (ఈ 'రిపోర్ట్ ఆన్ ఇన్‌క్లూజన్ ఆఫ్ ముస్లిం కమ్యూనిటీ ఇన్‌ది లిస్ట్ ఆఫ్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్ ఇన్ ది స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్‌'పై సమగ్రమైన విశ్లేషణను మిత్రులు సయ్యద్ నశీర్ అహ్మద్ 'గీటురాయి' వారపత్రికలో ఏడు వారాల పాటు ధారావాహికంగా అందించారు).

ఆ నివేదికలో సుబ్రమణ్యం కమిషన్ మూడు ప్రధాన సిఫారసులు చేయగా, జూన్ 17న సమావేశమైన మంత్రివర్గం అందులో రెండు సిఫారసులను ఆమోదిస్తూ ముస్లింలకు ఐదుశాతం రిజర్వేషన్ల విషయమై ఆర్డినెన్సు జారీ చేయాలని నిర్ణయించింది. ముస్లింలలోని క్రీమీలేయర్ (సంపన్న వర్గాలకు) ఈ రిజర్వేషన్ వర్తించదని అట్లాగే ప్రస్తుతం వెనకబడిన కులాలకు అందుతున్న రిజర్వేషన్లకు ఇబ్బంది కలుగకుండా ముస్లింల కోసం బిసి-ఇ అనే ఒక కొత్త తరగతిని సృష్టిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. పింజారా, లద్దాఫ్, దూదేకుల, నూర్‌బాషా, మెహతర్ వంటి ప్రస్తుతం వెనుకబడిన కులాల జాబితాలో ఉన్నవారిని కూడ ఆ జాబితా నుంచి బిసి-ఇ జాబితాకు మార్చాలని కమిషన్ చేసిన సిఫార్సును ప్రభుత్వం అంగీకరించలేదు. ఈ ఆర్డినెన్సునే ఆ తర్వాత ప్రభుత్వం చట్టంగా మార్చింది.

ఇంత చరిత్రతో, శ్రమతో తయారయిన చట్టంలో ఇంకా సాంకేతిక లోపాలున్నాయంటే ఈ ప్రభుత్వం ఎంత తొందరపాటుతో, ఎంత అనాలోచితంగా తన విధాన నిర్ణయాలు ప్రకటిస్తున్నదో అర్థం చేసుకోవచ్చు. అయితే ప్రభుత్వపు తొందరపాటును మించిన అనుచితమైన వ్యాఖ్యలు ధర్మాసనం వైపు నుంచీ, రాజకీయ వర్గాలవైపు నుంచి వస్తున్నాయి. చట్టం ఇప్పుడున్నటువంటి సాంకేతిక లోపాలు లేకుండా తయారయినా హిందుత్వవాదులు దాన్ని వ్యతిరేకించే వారనడంలో సందేహం లేదు. ఆ వ్యతిరేకతల ప్రభావం ధర్మాసనం మీద పడి ఉండేదనడంలో కూడా సందేహం లేదు.

వెనుకబాటుతనానికి సాంఘిక, విద్యావరమైన వెనుకబాటు తనాన్నే ప్రమాణంగా తీసుకోవాలని న్యాయమూర్తులు అన్నారు. నిజంగానే బిసి కమిషన్ ముస్లింల సాంఘిక విద్యావరమైన వెనుకబాటుతనాన్ని అంచనా కట్టి ఆ ప్రమాణంపైననే రిజర్వేషన్‌కు సిఫారసు చేసింది. ప్రాథమిక విద్య నుంచి ఉన్నతవిద్య దాకా దాదాపు ప్రతిరంగంలోనూ ముస్లిం విద్యార్థుల శాతం వారి జనాభా కన్న చాలా తక్కువగా ఉందని కమిషన్ సోదాహరణంగా చూపింది. అట్లాగే ఉపాధి, ఉద్యోగం, నిరుద్యోగం విషయంలో కూడ ముస్లింల స్థితి వారి జనాభా నిష్పత్తితో పోలిస్తే ఎంత దయనీయంగా ఉన్నదో కమిషన్ చూపింది. ప్రభుత్వపథకాల లబ్ధిదారులలో ముస్లింలు 4 శాతాన్ని మించకపోవడాన్ని కూడ కమిషన్ చూపింది. 'తగినంత ప్రాతినిధ్యం అంటే నైష్పత్తిక ప్రాతినిధ్యంకాదు' అని న్యాయమూర్తి అనడం ఆశ్చర్యకరం. రాష్ట్ర జనాభాలో 9.2 శాతం ఉన్న ప్రజానీకం విద్యలో, ఉపాధిలో మూడు, నాలుగు శాతం కూడ పొందకపోతే, ఆ మిగులును ఎవరు అనుభవిస్తున్నట్టు? అలా అనుభవించే హక్కు వారికెక్కడి నుంచి ఎట్లా వచ్చింది? ఇవి మనం ఒక మతంలో పుట్టినందువల్లనో, పుట్టకపోయినందువల్లనో వేసే ప్రశ్నలు కావు. ఇది సామాజిక న్యాయానికి, సహజ న్యాయానికి సంబంధించిన ప్రశ్నలు.


ప్రజాతంత్ర నవంబర్ 13-19, 2005 నుండి

❑

అసలు నేరం వదిలి కొసరుపై రభస!

| రామచంద్రం |

ఇరాక్‌కు 'చమురుకు బదులుగా ఆహారం' పథకం కింద జరిగిన లావాదేవీల్లో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగాయని పాల్ వోకర్ సమర్పించిన నివేదిక వెల్లడించడంతో దేశంలో పెద్ద దుమారం రేగింది. ఈ లావాదేవీల్లో కాంగ్రెస్ పార్టీ, కేంద్ర విదేశాంగ వ్యవహారాల మంత్రి నట్వర్‌సింగ్ పేర్లు కూడా ఉండటంతో కేంద్ర ప్రభుత్వం ఇరుకున పడింది. ఇది మరో బోఫోర్స్‌గా ప్రధాన ప్రతిపక్షం అంటుండగా, ప్రభుత్వం మాత్రం అసలీ నివేదికలో చాలా అర్ధసత్యాలున్నాయని, దీనిపై ఒక సమగ్ర విచారణకు ఆదేశించి నిజాలు నిగ్గు తేలుస్తామంటోంది. ఈలోగా ప్రతిపక్షాల ఆందోళన ను చల్లబరిచేందుకు నట్వర్‌సింగ్ మంత్రిత్వశాఖను తొలగించింది మన్మోహన్ ప్రభుత్వం.



మొదటి గల్ఫ్ యుద్ధం తరువాత ఇరాక్‌పై అనేక ఆంక్షలు విధించి సద్దాం ప్రభుత్వాన్ని ఏకాకిని చేసింది అమెరికా. కొన్నేళ్ళ తరువాత ఈ ఆంక్షల ఫలితంగా వేలాది మంది అమాయక ఇరాకీలు మృత్యువాత పడుతుండటంతో అంతర్జాతీయ సమాజం వత్తిడి మేరకు ఐక్యరాజ్యసమితి ఇరాక్ చమురును అమ్మి బదులుగా అత్యంత అవసరమైన వస్తువులు దిగుమతి చేసుకోవడానికి 'చమురుకు బదులుగా ఆహారం' పథకం కల్పించింది.

ఈ పథకం అమలులో భాగంగా వివిధ విదేశీ కంపెనీలకు, వ్యక్తులకు ఇరాక్ చమురు కేటాయింపులు జరిపింది. ఈ లావాదేవీల్లో కొద్ది మొత్తాన్ని 'సర్‌చార్జి'గా వసూలు చేసి సద్దాం తన స్వంతానికి వాడుకున్నాడనేది వోకర్ ప్రధాన ఆరోపణ.

అయితే ఇలా 'సర్‌చార్జి'ని వసూలు చేయడం ఏ దేశపు ఎగుమతి-దిగుమతి లావాదేవీల్లోనైనా సహజమేననీ, అయినా చమురు తప్ప మరో ఆదాయ వనరు లేని సద్దాం ప్రభుత్వానికి ఇలాంటి 'వసూళ్ళు' తప్ప మరో మార్గం లేదని అంతర్జాతీయ విశ్లేషకులు అంటున్నారు.

అసలు ఈ సమస్య ఉత్పన్నం కావడానికి మూలమే అమెరికా ఏకపక్ష ఆంక్షలు. ఇప్పుడీ రిపోర్టు కూడా అమెరికన్ ప్రభుత్వానికి అంతో ఇంతో సాయపడేందుకు సిఐఏ సాయంతో తయారయ్యిందనే ఆరోపణలు కూడా వినవస్తున్నాయి. ఈ రిపోర్టు దాదాపు 66 దేశాలకు చెందిన 2,400 కంపెనీల పేర్లు వెల్లడించింది. రష్యా ప్రభుత్వం అయితే వోకర్ ఈ రిపోర్టు తయారుచేయడానికి ఆధారపడ్డ డాక్యుమెంట్ల విశ్వసనీయతపై సందేహం వ్యక్తపరచింది.

అసలు అమెరికన్ దాడి తరువాత సద్దాం ప్రభుత్వపు ఆనవాళ్ళు లేకుండా ఉన్న ఇరాక్‌లో వోకర్ ఏ పత్రాలను సంపాదించి ఈ నివేదిక తయారు చేశాడు? అమెరికా మద్దతుతో ఇరాక్‌ను నడుపుతున్న ఆపద్ధర్మ ప్రభుత్వం సద్దాంపై ఎలాంటి సాక్ష్యాలు ఈ కమిటీకి అందించింది? ఇరాక్ యుద్ధంపై స్వదేశంలో జార్జిబుష్ తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న దశలో ఈ రిపోర్టు వెలువడటం వెనుక మతలబేమిటి? వంటి ప్రశ్నలకు జవాబులు వెతకాల్సిందే.

అయితే అలీనోద్యమ నేతగా పేరొందిన నట్వర్‌సింగ్ ఇలాంటి చీకటి వ్యవహారాలలో చేయి పెట్టడం మాత్రం క్షమించరాని నేరం. ❑

గ్లో 'బలి' గొండ

ఇతిహాస్

భారతీయ రైల్వే 'జాతికి జీవనరేఖ' అని చెప్పుకుంటుంది కానీ అది రోజు రోజుకీ మృత్యురేఖగా మారిపోతోంది అని ఇటీవలి వలిగొండ దుర్ఘటన నిరూపిస్తోంది. గత అయిదేళ్ళలో ఇది పన్నెండో పెద్ద దుర్ఘటన కావటం భారతీయ రైల్వేలో దిగజారుతున్న భద్రతా ప్రమాణాలకు సూచికగా నిలుస్తోంది. ప్రమాదం జరిగిన ప్రతీసారీ ఒక విచారణ కమిటీ వేయడం, ఎవరో ఒక చిరుద్యోగిని బలి పశువును చేయడం పరిపాటయిపోయింది. ఈ పరిణామాలు ఎందుకు జరుగుతున్నాయి, ఏ రాజకీయార్థిక కారణాలు ఈ దుర్ఘటనలకు పరోక్ష కారణాలవుతున్నాయనే ప్రశ్నలు అడగవలసిన సమయమిది. వలిగొండ ప్రమాదంలో మరణించిన 114 మంది కొరకు కాకపోయినా భారతీయ రైళ్లలో ప్రతి నిత్యం జీవన్మరణ ప్రయాణం చేస్తున్న కోటి ముప్ఫై లక్షల మంది ప్రయాణీకుల కొరకైనా పై ప్రశ్నలకు జవాబులు వెతకాల్సిందే.

బ్రిటీషు వారి హయాంలో 1853లో ప్రారంభించబడ్డ భారతీయ రైల్వే ఇవ్వాళ ప్రపంచంలోనే అతిపెద్ద రైల్వే వ్యవస్థ. అనునిత్యం పదకొండు వేల రైళ్ళను నడుపుతూ, సగటు మనిషికి చౌకైన ప్రయాణ సాధనంగా మన్ననలందు కుంటోంది భారతీయ రైల్వే. 1991లో సరళీకృత ఆర్థిక విధానాల పేరిట ఐ.ఎం.ఎఫ్, వరల్డ్ బ్యాంక్ దేశంలో పరి పాలనను నియంత్రించడం మొదలయ్యాక వాటి కన్ను భారతీయ రైల్వేలపై బడింది. తత్ఫలితంగా రైల్వేల్లో ప్రైవేటీకరణ శకం ఆరంభం అయ్యింది. అంతేకాదు రైల్వేల్లో ఉద్యోగులు అధికంగా ఉన్నారనీ, వారిని తొలగించాలని ప్రపంచ బ్యాంక్ అనేక దఫాలు రైల్వేలకు సూచించింది. 2001 ఆగస్టులో ప్రభుత్వంచే నియమించబడిన రాకేష్‌మోహన్ కమిటీ రైల్వేలను సమూలంగా ప్రైవేటీకరించాలని సిఫారసు చేసింది.

రైల్వే రంగంలో మనకు ఓనమాలు నేర్పిన బ్రిటన్ 1991లోనే అక్కడి రైల్వేను ప్రైవేటీకరించింది. ఆ తరువాత అక్కడి రైల్వేల పనితీరుపై తీవ్ర దుమారం రేపింది. సేవల నాణ్యత దారుణంగా పడిపోయిందనీ, ప్రయాణీకుల భద్రతకు సరైన చర్యలు తీసుకోవటంలేదని ఆరోపణలు మిన్నంటాయి.

బ్రిటన్ అనుభవం అలా ఉంటే మన రైల్వేశాఖ మాత్రం ప్రైవేటు మంత్రాన్నే జపించసాగింది. కొత్త నియామకాలకు కత్తెర వేసింది. అనేక అనుబంధ సర్వీసులను పూర్తిగా లేదా పాక్షికంగా ప్రైవేటుకు అప్పజెప్పింది. ఇదే సమయంలో రాజకీయ నాయకుల పరోక్ష అండతో ఒక కొత్త తరం రైల్వే కాంట్రాక్టర్లు నాసిరకం పనులు చేసి డబ్బులు దన్నుకోవడం ఎక్కువైంది.

సిబ్బంది లేమి, నిధుల లేమి, మితిమీరిన అవినీతి కారణంగా ప్రయాణీకుల భద్రత నానాటికీ తీసికట్టవుతోంది. గత పదేళ్ళుగా జరుగుతున్న భారీ ప్రమాదాల్లో అధిక శాతం మానవ వైఫల్యం



వల్లనేనని రైల్వేశాఖ చెబుతోంది. వీటిని నిరోధించేందుకు 17,000 కోట్ల రూపాయల స్పెషల్ రైల్వే సేఫ్టీ ఫండ్ ఏర్పాటు చేశారు. అందులోంచి దాదాపు రు.6500 కోట్లు గత ఏడాది మార్చి నాటికే ఖర్చు కూడా చేసేశారు. కానీ ప్రమాదాలు మాత్రం క్రమం తప్పకుండా జరుగుతూనే ఉన్నాయి.

వలిగొండ దుర్ఘటనే తీసుకుంటే 29 అక్టోబర్ నాడు ప్రమాదం జరిగింది. నల్గొండ జిల్లా వలిగొండ సమీపంలోని రామసముద్రం చెరువు తెగి సమీపంలోని రైలు వంతెన కొట్టుకుపోవడంతో ఆ సమయంలో ఆ మార్గంలో ప్రయాణిస్తున్న సికింద్రాబాద్ - రేపల్లె ఫాస్ట్ పాసింజర్ ప్రమాదానికి గురైయ్యింది. అందుకు అయిదు రోజుల ముందు నుండే రాష్ట్రం తుఫాను పదఘట్టనల క్రింద అతలా కుతలం అవుతోంది. అనేక చోట్ల రైల్వే లైన్లు, రోడ్లు, కమ్యూనికేషన్ వ్యవస్థలు దెబ్బతిని ఉన్నాయి. అయినప్పటికీ ఆ కాళరాత్రిలో ఎటువంటి ముందస్తు తనిఖీ లేకుండా డెల్టా ఫాస్ట్ పాసింజర్ రైలును మృత్యువు ఒడిలోకి పచ్చజెండా ఊపి పంపారు.

దుర్ఘటన జరిగాక ఇరిగేషన్, రెవెన్యూ రైల్వే అధికారులు తప్పు మీదంటే మీదని ఒకరిపై మరొకరు నెపం వేసుకున్నారు.

2000లోనే భారతీయ రైల్వే డిజాస్టర్ మేనేజ్‌మెంట్ రివ్యూ కమిటీ నొకదాన్ని వేసిందనీ, తుఫానులు, భూకంపాల వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు రైల్వే అధికారులు ఏమేం చేయాలో ఆ కమిటీ సవివరమైన నివేదిక ఇచ్చిందనీ, విపత్తు సమయంలో ఇతర ప్రభుత్వ విభాగ అధికారులతో రైల్వే అధికారులు అనునిత్యం సంప్రదిస్తూ ఉండాలని ఐఏఎంఎస్ రాణా నేతృత్వం లోని ఆ కమిటీ సూచించిందనీ తెలుసుకుంటే ప్రజల ప్రాణాల పట్ల రైల్వేశాఖ ఎంత నేరపూరిత నిర్లక్ష్య వైఖరి కనబరుస్తున్నదో అర్థమవుతుంది. ❑

(41వ పేజీ తరువాయి)

యిది ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడం, ప్రజాస్వామ్యం పేరుమీద దుర్మార్గపు రాచరిక వ్యవస్థని అమలు చేయడం. యిక పోలీసు డిపార్టుమెంటు రాజ్యాంగాన్ని, చట్టాలని గాలికొదిలేసి, రాజుగారి నమ్మినబంట్లుగా వ్యవహరిస్తున్నారు. వాళ్ళ ముఖ్య అధికారి పాతాళభైరవి సినిమాలో రేలంగి పాత్రని గుర్తుకు తెస్తుంటాడు. రాజుగారు హత్య చేయమంటే, హత్య చేయడమే గాక, యిచ్చిన డబ్బుని, బహుమతుల్ని పంచుకోవటానికి నిస్సిగ్గుగా కొట్టుకుంటున్నారు. ఆదిరెడ్డి తదితరుల హత్య తర్వాత బహుమతుల పంపకంలో జరిగిన గొడవలు బహిర్గతమే కదా.

ఇక మావోయిస్టు పార్టీ యితర సంఘాల నిషేధమే తీసుకోండి, అంత ముఖ్యమైన విషయానికి, అసెంబ్లీ అత్యవసర సమావేశం జరపాలి. చర్చించాలి. అప్పుడు నిర్ణయం తీసుకోవాలి. కమ్యూనికేషన్ వ్యవస్థ యింతగా పెరిగిన యీ రోజుల్లో, రెండు రోజుల వ్యవధిలోనే అటువంటి సమావేశాన్ని ఏర్పాటు చేయవచ్చు. నిషేధించడాన్ని చాలా పార్టీలు వ్యతిరేకించాయి. కొందరు కాంగ్రెసు మంత్రులు, ఎమ్.ఎల్.ఏ. లు కూడా వ్యతిరేకించారు. ముఖ్యమంత్రి ప్రతినిధిగా తిరస్కరించినా, దొడ్డిదారిన మంత్రి అయిన శివరాజ్ పాటిల్ నిషేధించమన్నాడని నిషేధించవచ్చా? ప్రజాజీవితంపై ప్రభావం చూపే అనేక నిర్ణయాలు యిలా ఏకబద్ధంగా, ఒక వ్యక్తి యిష్టా రాజ్యంగా జరుగుతున్నప్పుడు దీనిని ప్రజాస్వామ్యమని ఎలా అంటాం? యిది ప్రజాస్వామ్య ముసుగులో వున్న రాచరిక వ్యవస్థ. ఆర్డినెన్సులు ప్రజాస్వామ్యానికి విరుద్ధమయినవి. ఆర్డినెన్స్ అనే దాన్ని రాజ్యాంగం నుండి తొలగించాలి. మనం యీ కుహనా ప్రజాస్వామ్యాన్ని కాదు, నూతన ప్రజాస్వామ్యాన్ని డిమాండు చేయాలి. ప్రజాస్వామ్యమంటే ఎలా వుండాలి? మనందరం కలిసి ఏర్పరచుకున్న వ్యవస్థ, మనందరి సంక్షేమం చూసేలా వుండాలి. అందరికీ ఉపాధి వుండాలి. విద్య, ఆరోగ్యం లాంటివి వ్యక్తికి అదనపు ఖర్చు లేకుండా జరగాలి. అంటే ఏ వ్యక్తి కూడా ఆహారంలేక, కొనడానికి డబ్బులేక, ఆకలితో వుండకూడదు. ఏ వ్యక్తికీ బిచ్చమెత్తే, వ్యభిచరించే అవసరం వుండకూడదు. వ్యవసాయంలో ప్రకృతి పరంగావచ్చే ఒడిదుడుకులకి రైతు వ్యక్తిగతంగా కాకుండా సమాజం బాధ్యత తీసుకోవాలి. అంటే సమిష్టి బాధ్యత వుండాలి. అందువలన ఉత్పత్తి విభజన ఎలావుండాలో కూడా ప్రజలే నిర్ణయించాలి.

ఫ్యాక్టరీల ఉత్పత్తుల ధరలు ఖర్చుని బట్టి నిర్ణయించుకోవాలి. కొంతమంది వ్యక్తులకి అక్రమంగా సంపాదించుకునే అవకాశం లేకుండా వ్యవస్థ రూపొందాలి. అంటే, కంపెనీ యాక్టుని సమూలంగా మార్చాలి. మన అవసరాలని బట్టి, మనకున్న వనరుల్ని బట్టి పరిశ్రమలు స్థాపించుకోవాలి.

దారితప్పి సంపాదించిన వాళ్ళని గుర్తించి శిక్షించే విధానం వుండాలి. ధరలపై సమాజానికి అదుపువుండాలి. కనీస అవసరాలు అందరికీ ఏర్పడాలి. అదే నూతన ప్రజాస్వామ్యం. అటువంటి వ్యవస్థని నిర్మించుకోవడం మన చేతుల్లోనేవుంది. రైతు, కార్మిక వుద్యోగ సంఘాలన్నీ సంఘటితమైతే నూతన ప్రజాస్వామ్యాన్ని సాధించుకోవడం సులభమే. ఆ దిశగా మనందరం యీ రోజు నడవాల్సివుంది. ❑

వీక్షణం 2005 సూచిక

ఆగస్టు 2005

సెప్టెంబర్ 2005

అక్టోబర్ 2005

నవంబర్ 2005

కొత్త పుస్తకాలు









- ***నాన్న - రాజన్ తండ్రి అన్వేషణ*** - ప్రొఫెసర్ టి.వి. ఈచర వారియర్, మలయాళం నుంచి ఇంగ్లీషు - నీలన్, తెలుగుసేత - సి. వనజ, మాడభూషి శ్రీధర్, హైదరాబాద్ బుక్‌ట్రస్ట్ ప్రచురణ, 60+iv పేజీలు, 1/8 డెమీ, రు. 25, ప్రతులకు : హైదరాబాద్ బుక్‌ట్రస్ట్, ప్లాట్ నెం. 85, బాలాజీనగర్, గుడిమల్కాపూర్, హైదరాబాద్ - 500 028.

- ***టెలివిజన్ జర్నలిజం - తోట భావనారాయణ*** - సాయిశక్తి పబ్లికేషన్స్ ప్రచురణ. 436+XXVi పేజీలు, 1/8 రాయల్. వెల రు. 200. ప్రతులకు : అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు లేదా సాయిశక్తి పబ్లికేషన్స్, 301, సుందరసాయి ప్లాజా, వెంకటరమణ కాలనీ, ఖైరతాబాద్, హైదరాబాద్ - 500 004.

- ***స్వతంత్ర భారతం - మోయలేని అప్పులభారం - లాభసాటి వ్యాపారమైన రాజకీయరంగం*** - విజయా కోటేశ్వరరావు, 24 పేజీలు, 1/8 డెమీ. వెల రు.10. ప్రతులకు : తుంపాల శ్రీరామమూర్తి, కన్వీనర్, సామాజిక చైతన్య వేదిక, డోర్ నం. 9-9-57/2, జోగవానిపాలెం, గాజువాక, విశాఖపట్నం - 530 026.

- ***జూనియర్ డాక్టర్లు కోరుతుందేమిటి?*** - జస్టిన్ జీవన్‌రెడ్డి, ఎం. శ్రీనివాస్, డా. పివిఆర్ భాస్కరరావు, కె. గోవర్ధన్, తిరుగుబాటు ప్రచురణలు, 64 పేజీలు, 1/8 డెమీ, రు. 10. ప్రతులకు : పిడిఎస్‌యు ఆఫీస్, మార్క్స్ భవన్, విద్యానగర్, 7వ లైన్, హైదరాబాద్ - 500 044.

- ***సుప్రీంకోర్టు తీర్పు - సామాజిక న్యాయం - వ్యాసాలు*** - తిరుగుబాటు ప్రచురణలు, 60 పేజీలు, 1/8 డెమీ, రు. 10. ప్రతులకు : పిడిఎస్‌యు ఆఫీస్, మార్క్స్ భవన్, విద్యానగర్, 7వ లైన్, హైదరాబాద్ - 500 044.

- ***పాలమూరు నుంచి పల్నాటి దాకా ... కామ్రేడ్ సుగుణ - సంస్మరణ వ్యాసాలు*** - దిక్సూచి ప్రచురణలు, 112 పేజీలు, 1/8 డెమీ, రు. 5. ప్రతులకు : అన్ని ముఖ్యమైన పుస్తక కేంద్రాలు.

- ***పశ్చిమ గోదావరి గుండెకోత - తీర ప్రాంత రైతాంగ ఉద్యమం - నడుస్తున్న చరిత్ర*** - దిక్సూచి ప్రచురణలు, 24 పేజీలు, 1/8 డెమీ, రు. 5. ప్రతులకు : గోరు మాధవరావు, బొడ్డపాడు, పలాస మండలం, శ్రీకాకుళం జిల్లా.

- ***పోలవరం ప్రాజెక్టును ఎందుకు వ్యతిరేకించాలి?*** - పోలవరం ప్రాజెక్టు వ్యతిరేక ఆదివాసీ పోరాట కమిటీ ప్రచురణ, 8 పేజీలు, 1/4 డెమీ, వెల లేదు, ప్రతులకు : పి. త్రినాథరావు, అడ్వకేట్,78-10-4/3, ఎస్‌బిఐ కాలనీ, శ్యామలానగర్, రాజమండ్రి-533 103.









ఆంధ్రప్రదేశ్ : నాడు - నేడు

జనాభా వివరాలు

	1961	2001
1) మొత్తం జనాభా	3.59 కోట్లు	7.62 కోట్లు
2) జనసాంద్రత	131 మంది (చ.కి.మీ కు)	277 మంది (చ.కి.మీ కు)
3) స్త్రీలు	1.78 కోట్లు	3.76 కోట్లు
4) పురుషులు	1.81 కోట్లు	3.85 కోట్లు
5) లింగ నిష్పత్తి (పు : స్త్రీ)	1000 : 981	1000 : 978
6) గ్రామీణ జనాభా	2.97 కోట్లు	5.54 కోట్లు
7) పట్టణ జనాభా	0.62 కోట్లు	2.08 కోట్లు
8) అక్షరాస్యత	21.2 %	60.47 %

నీటి పారుదల

	1955-1956 లక్షల హెక్టార్లు	2002-2003 లక్షల హెక్టార్లు
1) కాలువలు	12.92	12.08
2) చెరువులు	10.68	4.25
3) బావులు	2.84	6.89
4) బోర్లు	-	11.52
5) ఇతర	1,03	1.37
మొత్తం	27.47	36.13

భూమి వినియోగం

(లక్షల హెక్టార్లు)

	1956	2002-2003
1. అడవులు	56.62	61.99
2. బంజర్లు	29.32	20.83
3. వ్యవసాయేతర	13.51	25.88
4. సాగుయోగ్య బంజర్లు	16.67	7.00
5. కంచెలు, గడ్డి భూములు	11.71	6.76
6. ఇతర చెట్లు	2.55	2.77
7. ఇతర పడావు	6.99	16.78
8. ప్రస్తుత పడావు	19.57	35.06
9. ప్రస్తుతం సాగులో ఉన్న భూమి	112.91	97.29*

* - ప్రస్తుతం సాగులో ఉన్న భూమిలో చేపల చెరువులు కూడా చేర్చబడ్డాయి.

వచ్చే సంచికలలో...

ప్రొ.డి. నరసింహారెడ్డి, ప్రొ.జి. హరగోపాల్, ప్రొ.ఆర్.ఎస్. రావు, డా. కె. నాగేశ్వర్, బిర్సు, ఆత్రం రామారావు, జి. రాంమోహన్, బి. సైదులు తదితరుల రచనలు వచ్చే సంచికల్లో ...

యాభైయవ పడిలో ప్రవేశించిన ఆంధ్రప్రదేశ్ రాజకీయార్థిక, సామాజిక, సాంస్కృతిక పరిణామాల గురించిన విశ్లేషణలు వీక్షణంలో ఈ సంవత్సరం పొడవునా ప్రచురిస్తాము.

వీక్షణం చందాదారులుగా చేరండి!
వీక్షణంను మిత్రులకు పరిచయం చేయండి!

తెలుగు నాట విలక్షణమైన ఆర్థిక, సామాజిక పత్రిక 'వీక్షణం'ను రెండు సంవత్సరాలకు పైగా ఆదరించి పోషిస్తున్న మిత్రులందరికీ 'వీక్షణం' సంపాదకవర్గం వినమ్రంగా ధన్యవాదాలు తెలుపుతోంది. అయితే తెలుగుసీమలో రాజకీయ, ఆర్థిక, సామాజిక అంశాల విశ్లేషణ కోసం ప్రజలలో, పాఠకులలో, ఆలోచనా పరులలో వ్యక్తమవుతున్న తహతహకూ, ఆ ఆసక్తిని తీర్చడంలో 'వీక్షణం' చేస్తున్న కృషికీ మధ్య చాల అంతరం ఉంది. ఆ అంతరం పూడాలంటే 'వీక్షణం'కు పాఠకుల నుంచే ఇతోధిక సహకారం అందాలి. 'వీక్షణం' చందాదారుల సంఖ్య కనీసం మూడురెట్లు పెరిగితే గాని, 'వీక్షణం' తన ముందు పెట్టుకున్న కర్తవ్యాలను తీర్చడం సాధ్యం కాదు. అంటే 'వీక్షణం' పాఠకులలో ప్రతి ఒక్కరూ తమ చందాలను క్రమం తప్పకుండా పునరుద్ధరించు కోవడంతో పాటు, కనీస మరొక ముగ్గురు మిత్రులకు 'వీక్షణం'ను పరిచయం చేసి చందాలు కట్టించాలి.

'వీక్షణం చందాదారులుగా చేరండి!
మీ మిత్రులను 'వీక్షణం' చందాదారులుగా చేర్పండి!
ఇది వీక్షణంకు సాయం కాదు, తెలుగు సమాజం తన గురించి తాను తెలుసుకోవడానికి చేసే అన్వేషణకు సాయం!

వీక్షణం విడిప్రతి రు.10, సంవత్సర చందా రు. 120,
దశాబ్ది చందా రు. 1,000
చందాలు కింది చిరునామాకు ఎం.ఒ./డి.డి. ద్వారా పంపవచ్చు.

***వీక్షణం**, సి.డి.ఆర్.సి, మైత్రి రెసిడెన్సీ,*
3-6-394, స్ట్రీట్ నం. 3, హిమాయత్‌నగర్, హైదరాబాద్-500029.

మీలోని రచయితను వెలికి తీయండి!
వీక్షణం మీ రచన కోసం వేచి చూస్తోంది!

మీ చుట్టూ, మీ గ్రామంలో, మీ బస్తీలో, మీ పని స్థలంలో, మీరు పనిచేసే సంఘంలో ఏదో ఒక ఘటన మిమ్మల్ని కదిలిస్తుంది. మీలో ఆలోచనలు రగిలిస్తుంది. ఆ ఘటన వెనుక ఉన్న సామాజిక, రాజకీయ, ఆర్థిక మూలాల గురించి మీరు అన్వేషిస్తుంటారు. మీ ఆలోచనలను రాయండి. సరిగ్గా 'వీక్షణం' ఎదురు చూస్తున్నది అటువంటి క్షేత్ర నివేదికల కోసమే. 'వీక్షణం' ఆర్థిక, సామాజిక పత్రిక తెలుగు సమాజం తన గురించి తాను చేసుకునే ఆలోచనలకు, అన్వేషణలకు ఒక వేదిక. మీరు అట్టడుగు నుంచి, మీ అనుభవాల నుంచి పంపే నివేదికలు ఆ ఆలోచనల్లో, అన్వేషణల్లో భాగమే.

'వీక్షణం'ను ఇటు క్షేత్ర నివేదికల, అటు నిపుణుల విశ్లేషణల మేలు కలయికగా తీర్చిదిద్దాలని సంపాదకవర్గం ప్రయత్నిస్తోంది. మన జీవితాల మీద ప్రగాఢ ప్రభావం వేయగల అంతర్జాతీయ, జాతీయ, ప్రాంతీయ పరిణామాల మీద నిపుణుల విశ్లేషణలు ఎంత అవసరమో, ఆ పరిణామాలు అట్టడుగు మనుషుల జీవన సరళిని ఎట్లా మారుస్తున్నాయో కింది నుంచి నివేదించడమూ అంతే అవసరం.


వీక్షణం మీ పత్రిక వీక్షణం మన పత్రిక
వీక్షణం తెలుగు సమాజం తన గురించి తాను చేసుకునే అన్వేషణ. ఆ అన్వేషణలో భాగం పంచుకోండి.

రచనలు పంపవలసిన చిరునామా:

సంపాదకుడు, **వీక్షణం**, సి.డి.ఆర్.సి, మైత్రి రెసిడెన్సీ,
3-6-394, స్ట్రీట్ నం. 3, హిమాయత్‌నగర్, హైదరాబాద్-500029.

RNI Regn. No. APTEL/2003/11482

PRINTED BOOK
Postal Regn. No. LII/RNP/H-HD-1029/2004-06



Owned, Printed and Published by V. Hanumantha Rao at 301, Mythri Residency, 3-6-394, Road No. 3, Himayat Nagar, Hyderabad - 500 029. Ph : 55843495. Printed at Charita Impressions, Azamabad, Hyderabad. For Nutan Art Printers, Hyderabad. Working Editor : N. Venugopal

VEEKSHANAM
301, Mythri Residency,
3-6-394, Road No. 3, Himayatnagar, Hyderabad - 500 029.